www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

100 మంది గ్రూప్-1 టాపర్లలో
48 మంది బీసీలు
ఐదుగురు ఎస్టీలు, ముగ్గురు ఎస్సీలు
ఓసీలు, ఈడబ్ల్యూఎస్ కలిపి 44 మంది
ఇంగ్లిష్‌లో 12,323 మంది రాశారు 13
తెలుగులో 7,829.. ఉర్దూలో 9 మంది
వాల్యుయేషన్‌లో ఎలాంటి లోపాలు లేవు
టీజీపీఎస్సీ కార్యదర్శి వెల్లడి

శుక్రవారం | 14-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 345 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: పౌర్ణమి మ. 12:25 తదుపరి పాడ్యమి, నక్షత్రం: ఉత్తర ఫల్గుణి, వర్జ్యం: మ.2.17-4.03, అమృతఘడియలు: రా.12.55-2.41, దుర్ముహూర్తం: ఉ.8.50-9.37, మ.12.48-1.35, రాహుకాలం: ఉ. 10.30-12.00, సూర్యోదయం: 6.27, సూర్యాస్తమయం: 6.21 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అసెంబ్లీ చరిత్రలో చీకటి రోజు
జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం దారుణం
అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నిరసన
పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్టు చేసి
తెలంగాణ భవన్ వద్ద వదిలిన పోలీసులు

సచివాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నేతల నిరసన

మాట.. మంట
విపక్ష ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై అధికార, విపక్షాల వాగ్వాదం
'సభ మీ ఒక్కరి సొంతం కాదు' అని స్పీకర్‌ను ఉద్దేశించి జగదీశ్ రెడ్డి వ్యాఖ్య
సభాపతిని బెదిరించే ధోరణి వద్దన్న శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల
స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధించడంపై అధికార పార్టీ సభ్యుల ఆగ్రహం
జగదీశ్ రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్
సమావేశాలు ముగిసేదాకా ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించిన స్పీకర్
బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళన
తదుపరి చర్యల కోసం ఈ అంశాన్ని ఎథిక్స్ కమిటీకి పంపాలని సభ నిర్ణయం

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): 'సభ మీ ఒక్కరి సొంతం కాదు' అంటూ.. నిండు సభలో అసెంబ్లీ స్పీకర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రస్తుత సమావేశాలు ముగిసేదాకా ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రకటించారు! గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చలో భాగంగా గురువారం సభలో అధికార, విపక్షాల మధ్య జరిగిన వాగ్వాదంతో అసలే ఉద్రిక్తంగా ఉన్న వాతావరణం.. జగదీశ్ రెడ్డి వ్యాఖ్యలతో మరింత వేడెక్కింది! ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్‌కు క్షమాపణలు చెప్పాలని అధికార పార్టీ ఎమ్మెల్యేలు పట్టుపట్టారు. ఒక దశలో.. జగదీశ్‌రెడ్డిపై బహిష్కరణ వేటు వేస్తారనే ప్రచారం కూడా జరిగింది. కానీ ఆయన్ను సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. తదుపరి

మిగతా 12వ పేజీలో...

స్పీకర్‌గా ఓసీ ఉంటే అలాగే మాట్లాడేవారా?
సభాపతితోనే వాదనా?
జగదీశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాల్సిందే: కాంగ్రెస్
ఆ వ్యాఖ్యల్లో అన్‌పార్లమెంటరీ పదాలు లేవు 12
స్పీకర్‌ను అవమానించినట్లైతే జగదీశ్ విచారం తెలుపుతారు
సభాపతికి హరీశ్ ప్రతిపాదన
సస్పెన్షన్ ముందు హైడ్రామా

ప్రతిసారీ ఫొటోలు దిగి చూపాలా?
గాంధీ కుటుంబంతో నాకెంతో సాన్నిహిత్యం ఉంది

వారిని కలిసినప్పుడల్లా ఫొటోలు దిగి ప్రదర్శించాల్సిన అవసరం నాకు లేదు
నాపై విశ్వాసం ఉండబట్టే పదవులు కట్టబెట్టారు
విపక్షాల ఉచ్చులో పడను.. వాళ్లను పట్టించుకోను
రేవంత్.. చెబితే చేస్తాడు.. ఎక్కడా రాజీ పడడు
కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడంలో తోడుగా ఉన్నోళ్లు మాకు ముఖ్యం
37 మందిని కార్పొరేషన్ చైర్మన్లను చేశాం
రాష్ట్ర సమస్యలపై కిషన్‌రెడ్డి పోరాడాలి
బీఆర్ఎస్ పైశాచికానందం పొందుతోంది
శాసనసభలో చర్చకు కేసీఆర్ రావాలి
ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్
ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో 'భారత్ సమ్మిట్'
60 దేశాల ప్రతినిధులను ఆహ్వానించాం
'రైజింగ్ తెలంగాణ'కు మద్దతుగా నిలవండి
కేంద్ర మంత్రి జైశంకర్‌కు సీఎం రేవంత్ వినతి



చెన్నైలో జరగనున్న సమావేశానికి ఆహ్వాన పత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి అందజేస్తున్న డీఎంకే ప్రతినిధులు

న్యూఢిల్లీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గాంధీ కుటుంబంతో తనకు ఎంతో సాన్నిహిత్యం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అందరూ అనుకునేదానికంటే ఎక్కువ సాన్నిహిత్యమే ఉందన్నారు. విపక్షాల ఉచ్చులో తాను పడబోనని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీకి, తనకు మధ్య దూరం పెరిగిందన్న ఆరోపణలను కొట్టిపారేశారు. "ఎవరో ఏదో అనుకుంటున్నారని నేను పట్టించుకోను. గాంధీ కుటుంబానికి నాపై ఎంతో నమ్మకం ఉంది కాబట్టే పీసీసీ అధ్యక్షుడు, ఆ తర్వాత ముఖ్యమంత్రిని చేశారు. విపక్షాలు మొదటి నుంచి అసత్య ప్రచారాలు చేస్తూనే ఉన్నాయి. కానీ, మంత్రివర్గం నుంచి రాజ్యసభ, ఎమ్మెల్సీల వరకు ఏం జరిగిందో చూశారు కదా? అయినా, గాంధీలను కలిసిన ప్రతిసారి ఫొటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదు. నేను ఎవరి ట్రాప్‌లో పడను" అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. గురువారం ఢిల్లీలోని తన నివాసంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిలో పాల్గొన్నారు. కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి కాబట్టే ఆయన్ని రాష్ట్ర సమస్యలపై అడుగుతున్నామని చెప్పారు. కిషన్‌రెడ్డికి కేంద్రంతో సత్సంబంధాలు ఉన్నాయని, వ్యక్తిగతంగానూ అందరితో పరిచయాలు ఉన్నాయని గుర్తుచేశారు. కేంద్ర మంత్రివర్గంలో ప్రతిఒక్కరూ వాళ్ల రాష్ట్రానికి సంబంధించి

మిగతా 13వ పేజీలో...

గులాబీకి బదులు ఆకుపచ్చ కార్డు
రాష్ట్రంలో రేషన్ కార్డులకు కొత్త రంగులు
పేదలకిచ్చే కార్డులపై మూడు రంగులు 2

22న చెన్నై సమావేశానికి వెళ్తాం: కేటీఆర్ 13

దక్షిణాదిపై కేంద్రం కుట్రను
తిప్పికొడతాం!
సీట్లు రాలేదన్న అక్కసుతో దక్షిణాది ప్రాధాన్యాన్ని తగ్గించే యత్నం
రాష్ట్రాల హక్కుల పరిరక్షణకు అంతా ఏకం కావాలి: సీఎం
కేంద్రంపై పోరుకు 22న చెన్నైలో భేటీకి రావాలని స్టాలిన్ ఆహ్వానం
రేవంత్‌రెడ్డికి లేఖను అందించిన డీఎంకే బృందం 13
అధిష్ఠానం అనుమతితో చెన్నైకి వెళ్తానన్న ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రితో బీజేపీ సీనియర్ నేతల
రహస్య భేటీలు
ఇలాగైతే తెలంగాణలో అధికారంలోకి రాగలమా?



సొంత పార్టీ నేతలపై ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన ఆరోపణ
బీజేపీ నుంచి పాత సామాన్లను రిటైర్ చెయ్యాలని వ్యాఖ్య
హోలీకి పోలీసు ఆంక్షలపై ఫైర్
ఇలా చేస్తే రేవంత్‌రెడ్డికీ కేసీఆర్‌కు పట్టిన గతేనని హెచ్చరిక

హైదరాబాద్ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తమ పార్టీ నేతలపైనే సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ బీజేపీకి చెందిన కొందరు సీనియర్ నేతలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రహస్యంగా భేటీ అవుతున్నారని ఆరోపించారు. ఆ నేతలు ఇలా చేస్తే తెలంగాణలో బీజేపీ అధికారం ఎలా చేపడుతుందని ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ అధికారం చేపట్టాలంటే పార్టీలోని పాత సామాను.. పార్టీ నుంచి బయటకు పోవాలని అన్నారు. పార్టీ అధిష్ఠానం ఈ అంశంపై దృష్టి పెట్టాలని కోరారు. ఇది 'నా పార్టీ', 'నా అయ్య పార్టీ' అని అనే వాళ్లు తెలంగాణ బీజేపీలో చాలా మంది ఉన్నారని రాజాసింగ్ పేర్కొన్నారు. అలాంటి వారిని రిటైర్ చేస్తేనే బీజేపీకి మంచి రోజులు వస్తాయని అభిప్రాయపడ్డారు. ఇది తన ఒక్కడి కోరిక మాత్రమే కాదని, పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయం కూడా

మిగతా 2వ పేజీలో...



అమెరికాకు.. ఇప్పుడొద్దులే!
మన విద్యార్థుల్లో తగ్గిన మోజు.. అనేక కారణాలు

అమెరికాలో ఆర్థిక అనిశ్చితి.. వీసా ఫీజుల్లో పెరుగుదల.. కఠినంగా మారిన వడపోత.. ట్రంప్ అస్థిర నిర్ణయాలు
ఇతర దేశాల్లో పెరిగిన అవకాశాలు.. గతేడాదితో పోలిస్తే 38 శాతం తగ్గిన హెచ్1బీ దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ చేసిన చాలా మంది విద్యార్థుల కల.. అమెరికా. ఎంఎస్ పేరిట విమానం ఎక్కేయడం... ఎంఎస్ పూర్తి చేసేలోగా ఏదో ఒక కంపెనీలో ఉద్యోగం సంపాదించడం... వీలైతే అక్కడే స్థిర నివాసం ఏర్పర్చుకోవడం. అయితే, ఈ కల చెదిరిపోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. రెండోసారి అగ్రరాజ్యం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్ దూకుడుగా తీసుకుంటున్న నిర్ణయాలు దీనికి కారణమవుతున్నాయి. అమెరికాలో ఉద్యోగం కోసం తీసుకునే హెచ్1బీ వీసా కోసం వచ్చిన దరఖాస్తులు ఈసారి భారీగా పడిపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకూ యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్‌కు వివిధ దేశాల నుంచి వచ్చిన దరఖాస్తులు 4,79,953. గత ఏడాదితో పోలిస్తే ఇది 38.6% తక్కువ. హెచ్1బీ దరఖాస్తుల్లో భారత్ నుంచి వచ్చినవి గణనీయమైన సంఖ్యలో ఉంటాయి. మొత్తంగా, వాటి సంఖ్య తగ్గిందంటే భారత్ నుంచీ తగ్గుదల భారీగా ఉన్నట్లేనని నిపుణులు చెబుతున్నారు.

అప్పట్లో టాప్-3లో హైదరాబాద్
ట్రంప్ 2.0 ప్రారంభం కావటానికి ముందు.. మన దేశం నుంచి ఎక్కువ వీసా అభ్యర్థనలు వచ్చే నగరాలలో హైదరాబాద్ టాప్ 3లో ఉండేది. కానీ, ఇప్పుడు

మిగతా 14వ పేజీలో...



సునీతా విలియమ్స్ రాక
మరింత ఆలస్యం
సాంకేతిక సమస్యలతో నాసా-స్పేస్ ఎక్స్ క్రూ10 ప్రయోగం వాయిదా 14
నేటి ఉదయం మరోసారి ప్రయోగానికి ఏర్పాట్లు



కాల్పుల విరమణకు
పుతిన్ అంగీకారం
రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీలక పరిణామం 14
ముఖ్య పాత్ర పోషించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

కంచ గచ్చిబౌలి 400 ఎకరాలు
ప్రభుత్వానివే
హెచ్‌సీయూకు సంబంధం లేదు
ప్రభుత్వ ఆధీనంలోనే ఆ భూమి
ఐటీ, వాణిజ్య, నివాస జోన్ల అభివృద్ధి జరగనుంది
స్పష్టతనిచ్చిన టీజీఐఐసీ వర్గాలు

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక వనరుల సమీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం లేఅవుట్ చేసి, వేలం వేయాలని నిర్ణయించిన రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని సర్వే నెంబరు 25 పరిధిలో ఉన్న 400 ఎకరాల భూమితో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం(హెచ్‌సీయూ)కు ఎలాంటి సంబంధం లేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ భూమి ప్రభుత్వానిదేనని, ఎలాంటి ఆక్రమణల్లో

మిగతా 13వ పేజీలో...

అమ్మో.. అప్పుడే
40 డిగ్రీలు
నిప్పులు చెరుగుతున్న సూరీడు
14 జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా..
నిర్మల్ జిల్లా లింగాపూర్‌లో అత్యధికంగా 40.7 డిగ్రీలు
రాష్ట్రంలోనే అత్యల్పంగా హైదరాబాద్‌లో 38.6 డిగ్రీలు 14
నేడు, రేపు ఆరెంజ్ అలర్ట్

తమిళనాడు బడ్జెట్‌లో
₹ మాయం
తమిళ 'రూ'ను చేర్చిన స్టాలిన్ ప్రభుత్వం

తారాస్థాయికి చేరిన హిందీ వ్యతిరేక చర్యలు
ఓ తమిళుడి సృష్టి అది..ఎలా తొలగిస్తారు?
స్టాలిన్ అవివేకానికి ఇది నిదర్శనం: అన్నామలై
రూపే చిహ్నం రూపశిల్పి ఉదయ్ కుమార్ ధర్మలింగం
తమిళనాడుకే చెందిన ఐఐటీ ప్రొఫెసర్

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అమలు చేయదలచిన జాతీయ విద్యావిధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్ లోగోలో 'రూపే' చిహ్నాన్ని తొలగించింది. దాని స్థానంలో తమిళంలో 'రూ' (రూబాయ్) అనే అక్షరానికి చోటు కల్పించింది. దీంతో హిందీ భాష విషయంలో కేంద్ర ప్రభుత్వానికి, తమిళ నాడు ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న వివాదం మరింత



తమిళనాడు బడ్జెట్ 2024 లోగో



మార్పు చేసిన ప్రస్తుత లోగో

మిగతా 14వ పేజీలో...



గుంటూరు జీజీహెచ్‌లో రోగికి స్మార్ట్ ఫోన్‌తో గుండె పరీక్ష చేస్తున్న సిద్ధార్థ్

ఏడు సెకన్లలోనే గుండె పరీక్ష!
స్మార్ట్ ఫోన్‌తో గుండె జబ్బుల నిర్ధారణ
ఏఐ ఆధారిత యాప్‌ను రూపొందించిన 14 సంవత్సరాల బాలుడు సిద్ధార్థ్
గుంటూరు జీజీహెచ్‌లో 500 మందికి కార్డియాక్ స్క్రీనింగ్ పరీక్షలు 2
పది మందికి గుండె జబ్బులున్నట్లు తేల్చిన యాప్.. ఈసీజీ, 2డీ ఎకోలతో నిర్ధారణ

ఐదుగురు ఎమ్మెల్సీలూ
ఏకగ్రీవం!
కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్ సభ్యులకు ధ్రువీకరణ పత్రాలిచ్చిన ఎన్నికల అధికారి
విజయశాంతి ఆస్తి రూ.113 కోట్లు
సొంతిల్లు, కారు లేదన్న రాములమ్మ 2
అద్దంకి దయాకర్‌కు వాహనాల్లేవ్
దాసోజు శ్రవణ్‌కు సొంతిల్లు లేదు
తెలంగాణ కేసీఆర్ సొత్తు కాదు: విజయశాంతి
ఏపీలోనూ ఐదుగురు ఎమ్మెల్సీలు ఏకగ్రీవం



పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌తో కొత్త ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్



ఇకపై ఐదేళ్ల పిల్లలకూ
కాక్లియర్ సర్జరీ
గతంలో మూడేళ్ల వరకే ఆరోగ్య శ్రీ కింద వెసులుబాటు 3
వయసు పరిమితిని పెంచిన ప్రభుత్వం
వినికిడి లోపంఉన్న చిన్నారులకు వరం

జర్నలిస్టులుగా అసభ్య పదజాలం వాడొచ్చా?

- రేవంత్‌పై జర్నలిస్టుల వీడియో... సీపీఆర్ఓ అయోధ్యరెడ్డి అభ్యంతరం
- రాజ్‌దీప్ సర్దేశాయ్‌ను ట్యాగ్ చేస్తూ ప్రశ్నలు

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అసభ్య పదజాలాన్ని వాడే హక్కు జర్నలిజం ఇచ్చిందా అంటూ సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌ను సీఎం సీపీఆర్ఓ బోరెడ్డి అయోధ్యరెడ్డి ప్రశ్నించారు. అసభ్య పదాలను మౌఖికంగా గాని, రాత పూర్వకంగాని వినియోగిస్తామా అని నిలదీశారు. సీఎం రేవంత్‌ను తిడుతున్న వీడియోను పోస్ట్ చేసిన కేసులో రేవతి, తన్వీ అనే జర్నలిస్టులను అరెస్ట్ చేయడాన్ని ఎడిటర్స్ గిల్డ్ ఖండించిన విషయం తెలిసిందే. దీని స్పందనను సీనియర్ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్ట్ చేశారు. సీఎం రేవంత్, రాహుల్ గాంధీ, జైరాం రమేశ్‌లను ట్యాగ్ చేశారు. దీనిపై రాజ్‌దీప్ సర్దేశాయ్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంబంధాల ప్రధాన అధికారి బోరెడ్డి అయోధ్యరెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందించారు. జర్నలిస్టులుగా ప్రశ్నలడిగే అవకాశం ఉంటుంది కానీ.. సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వారు వాడిన పదాలను విన్నారా అంటూ.. ఇలాంటి పదాలను ఆంగ్లంలోకి అనువదించి చానెల్‌లో ప్రసారం చేయగలరా అని అయోధ్యరెడ్డి ప్రశ్నించారు.

షీర్ జోన్‌లో కప్పు కూలకుండా ఏర్పాట్లు

- ఎస్ఎల్‌బీసీలో కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

నాగర్‌కర్నూల్/మన్ననూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోని షీర్ జోన్‌లో పైకప్పు కూలకుండా ఉండటానికి రక్షణ ఏర్పాట్లు చేస్తున్నారు. సహాయక చర్యలకు ముందుకు వెళ్లే క్రమంలో రెస్క్యూ టీమ్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ ఆపరేషన్‌లో పాలు పంచుకుంటున్న సింగరేణి రెస్క్యూ బృందాలు.. బొగ్గు గనుల్లో పై కప్పు కూలకుండా మద్దతుగా నిలిచే రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాయి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో గల్లంతైన ఏడుగురు కార్మికుల జాడను కనుక్కునేందుకు సింగరేణి రెస్క్యూ బృందం, ర్యాట్ హోల్ మైనర్లు, ఆర్మీ, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సహా 18 విభాగాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. సహాయ సిబ్బంది డీ-1 జోన్‌లోకి వెళ్తే వారికి ప్రాణహాని ఉండే అవకాశం ఉందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిపుణులు హెచ్చరించడంతో రాష్ట్ర సర్కారు రొబోటిక్ మిషనరీ వ్యవస్థను రంగంలోకి దించాలని నిర్ణయించుకుంది. దీనికి సంబంధించిన పరికరాలు రెండు రోజుల క్రితం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు చేరుకున్నాయి. రెండు రొబోటిక్ యంత్రాలు కూడా వచ్చాయి. రొబోటిక్ యంత్రాలు పని చేయడానికి అనుకూలమైన పరిస్థితిని నిపుణులు సొరంగంలో కల్పిస్తున్నారు.

ఆస్తి కోసం కన్నతల్లిని కడతేర్చిన కొడుకు

శంషాబాద్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం కన్న తల్లినే అంతమొందించాడు ఓ కొడుకు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పట్టణంలోని రాళ్లగూడలోని రాఘవేందర్ కాలనీలో నివాసముంటున్న ప్రకాశ్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించి నిత్యం తల్లి చంద్రకళ (55)ను డబ్బు కావాలని అతడు వేధిస్తుండేవాడు. తనకు ఇంటి పత్రాలిస్తే వాటిని బ్యాంకులో తాకట్టు పెట్టి డబ్బులు తీసుకుంటానని తల్లిని అడిగేవాడు. దాంతో గతంలో గొడవలు జరగ్గా రెండుసార్లు పోలీసులకు చంద్రకళ ఫిర్యాదు చేసింది. పోలీసులు ప్రకాశ్‌ను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. ఈ క్రమంలో బుధవారం మద్యం సేవించి వచ్చిన ప్రకాశ్ తనకు డబ్బు కావాలని తల్లి చంద్రకళను అడిగాడు. తన దగ్గర డబ్బులు లేవని ఆమె చెప్పడంతో కోపోద్రిక్తుడై మొదట రాడ్‌తో తర్వాత సిలిండర్ తీసుకొచ్చి ఆమె తలపై బలంగా మోది హతమార్చాడు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డికి మరోసారి నోటీసు

మొయినాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి పోలీసులు మరోసారి నోటీసు ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం తోలుకట్ట రెవెన్యూ పరిధిలో శ్రీనివాస్‌రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో గత నెల 11న కోడిపందాలు నిర్వహించగా.. పోలీసులు దాడి చేసిన విషయం తెలిసిందే. అప్పుడు అక్కడ భారీ ఎత్తున నగదు, కార్లు, కోళ్లు పట్టుబడ్డాయి. ఫాంహౌస్ యజమాని శ్రీనివాస్‌రెడ్డికి పోలీసులు గత నెల 13న నోటీసు ఇచ్చారు. అయితే ఆయన తన లాయర్ ద్వారా నోటీసుకు జవాబు ఇచ్చారు. దానికి సంతృప్తి చెందని పోలీసులు గురువారం ఎమ్మెల్సీకి మరోమారు నోటీసుల ఇచ్చారు. మాదాపూర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి నోటీసు అందజేశారు. శుక్రవారం విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు.

నాగంగారూ.. ఎలా ఉన్నారు?

- జనార్దన్ రెడ్డికి చంద్రబాబు ఆప్యాయ పలకరింపు

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేసిన తెలంగాణ సీనియర్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి.. సీఎం చంద్రబాబును కలిశారు. ఓబుళాపురం మైనింగ్ కేసు తుది తీర్పు ఉండటంతో గురువారం విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు నాగం వచ్చారు. అనంతరం అసెంబ్లీకి చేరుకుని చంద్రబాబుతో భేటీ అయ్యారు. చాలాకాలం తర్వాత తనను కలిసిన నాగంను చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు. తన సీట్లో నుంచి లేచి ఆయన్ను ఆహ్వానించారు. 'నాగం గారూ ఎలా ఉన్నారు.. ఆరోగ్యం ఎలా ఉంది' అంటూ ఆప్యాయంగా పరామర్శించారు. తాము కలసి చాలా రోజులైందని గుర్తు చేస్తూ, పిల్లలు ఎలా ఉన్నారంటూ ఆరా తీశారు. ఓబులాపురం మైనింగ్ విషయంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం నేతలు చేసిన ఉద్యమాలపై నాడు కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల విచారణలో భాగంగా విజయవాడ వచ్చానని నాగం తెలిపారు. ఈ కేసులను సుదీర్ఘకాలం తర్వాత కొట్టివేయడంపై చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో చేసిన ప్రజాపోరాటాల గురించి చర్చించుకున్నారు. నాగం ఫైర్ బ్రాండ్‌గా ఉండేవారని, పార్టీ ఆదేశిస్తే దూసుకుపోయేవారని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేసుకున్నారు.

కాచిగూడలో ప్రతిమ ఆస్పత్రిని సీజ్ చేస్తున్నామంటూ హంగామా!

- ఆస్తి పన్ను చెల్లించలేదని హడావుడి
- నిమిషాల వ్యవధిలోనే మాట మార్పు
- ఉన్నతస్థాయి ఆదేశాలతో వెనుదిరిగిన అధికారులు!.. నోటీసుల తొలగింపు
- మూడు రోజులు గడువిచ్చినట్టు వెల్లడి

బర్కత్‌పుర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను బకాయి చెల్లించనందున కాచిగూడలోని ప్రతిమ ఆస్పత్రిని సీజ్ చేస్తామంటూ హడావుడి చేసిన జీహెచ్ఎంసీ అధికారులు.. నిమిషాల వ్యవధిలోనే నిర్ణయం మార్చుకున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఫోన్లు రావడంతో ఆస్పత్రి భవనానికి అంటించిన నోటీసులను తొలగించి.. బకాయిల చెల్లింపునకు ఆస్పత్రి యాజమాన్యం మరో మూడు రోజులు గడువు అడిగితే ఇచ్చామంటూ అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ ఆస్పత్రి భవనానికి సంబంధించి రెండు సంవత్సరాల ఆస్తి పన్ను రూ.40 లక్షలకు పైగా బకాయి ఉంది. పన్ను మదింపులో వ్యత్యాసం ఉందని ప్రజావాణిలో ఆస్పత్రి ప్రతినిధులు కమిషనర్ ఇలంబరిదిని కలిశారు. కమిషనర్ ఆదేశాల మేరకు వివరాలు పరిశీలించిన రెవెన్యూ విభాగం అధికారులు.. ప్రస్తుత బకాయి రూ.37,37,713గా తేల్చారు. ఆ మొత్తం రెండు రోజుల్లో చెల్లిస్తామని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. గడువు ముగియడంతో గురువారం అంబర్‌పేట సర్కిల్ అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్లు పి.రవీందర్, బి.రవీందర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి ఆస్పత్రికి వెళ్లారు. కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర పరికరాలు, ఫర్నిచర్‌ను పక్కన పెట్టారు. ఆస్పత్రిని సీజ్ చేస్తామని నోటీసులు అంటించారు. ఆస్పత్రి సిబ్బంది ఈ విషయాన్ని యాజమాన్యానికి తెలపడంతో నిమిషాల వ్యవధిలోనే ఉన్నతాధికారుల నుంచి జీహెచ్ఎంసీ అధికారులకు ఫోన్ వచ్చినట్టు తెలిసింది. దీంతో వారు అక్కణ్నుంచీ వెళ్లిపోయారు. కాగా.. ఈ వ్యవహారంపై కమిషనర్ ఇలంబరిది సీరియస్ అయినట్టు తెలిసింది. ఆస్పత్రులు, విద్యాసంస్థల విషయంలో సంయమనం పాటించాలని ఆయన ఆదేశించినట్టు సమాచారం.

ఐదుగురు ఎమ్మెల్సీలూ ఏకగ్రీవం!

కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్ సభ్యులకు ధ్రువీకరణ పత్రాలిచ్చిన ఎన్నికల అధికారి

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఐదుగురు సభ్యులూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్; సీపీఐ అభ్యర్థి నెల్లికంటి సత్యం; బీఆర్ఎస్ అభ్యర్థి దాసోజు శ్రవణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. గడువు అనంతరం ఐదు స్థానాలకు ఐదుగురి నామినేషన్లే మిగలడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొంగులేటి, కోమటిరెడ్డి, జూపల్లి, ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. దాసోజు శ్రవణ్ ధ్రువీకరణ పత్రం తీసుకునే సమయానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా అంబేడ్కర్ విగ్రహం వద్దకు నిరసన తెలిపేందుకు వెళ్లారు. దీంతో బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయ కార్యదర్శి ఇతరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, ఏకగ్రీవంగా ఎన్నికైన ఐదుగురు ఎమ్మెల్సీలు తమ ఆస్తులు, కేసుల వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించారు.

అద్దంకి ఆస్తి 1.03 కోట్లు



అద్దంకి దయాకర్ పేరిట వాహనాలేమీ లేవు. భార్య పేరుతో ఒక స్కూటర్ మాత్రం ఉంది. ఆయన ఆస్తి 1.03 కోట్లు, అప్పు రూ.53.44 లక్షలుగా పేర్కొన్నారు. ఆయన చరాస్తి రూ.1,01,774; భార్యకు రూ.20 లక్షల విలువ చేసే బంగారం, వెండి, నగదుతో కలిపి రూ.35.58 లక్షలు ఉన్నట్లు తెలిపారు. జనగామలో రూ.6 లక్షల విలువైన స్థలం, హఫీజ్‌పేటలో 2,275 చ.అ. విస్తీర్ణం ఉన్న రూ.60.74 లక్షల విలువైన ఫ్లాట్ ఉన్నాయి.

నెల్లికంటి సత్యంపై పలు కేసులు



నెల్లికంటి సత్యం పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. కిడ్నాప్, ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగించడంతోపాటు పలు కేసులున్నాయి. ఆయన భార్య చరాస్తులు రూ.25.90 లక్షలు. స్థిరాస్తులు రూ.48.50 లక్షలు. ఇందులో నల్లగొండలో ఇల్లు, ఆ జిల్లాలో సుమారు 10 ఎకరాల భూమి ఉన్నాయి. భార్యాభర్తల పేరిట చెరో రెండు లక్షల పంట రుణం ఉంది.

శ్రవణ్‌కు సొంతిల్లు లేదు



దాసోజు శ్రవణ్ కుమార్ తనకు ఇల్లు, ప్లాట్లు, ఫ్లాట్లు లేవని ప్రకటించారు. రెండు కార్లు మాత్రం ఉన్నాయి. బ్యాంకుల్లో రూ.25.20 లక్షల డిపాజిట్లు, భార్య పేరుతో రూ.1.86 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని తెలిపారు. భార్య పేరుతో రూ.7.26 లక్షల అప్పు ఉందని వెల్లడించారు.

కేతావత్ శంకర్‌పై 21 కేసులు!



కేతావత్ శంకర్‌పై మొత్తం 21 కేసులున్నాయి. తెలంగాణ ఉద్యమంలో వివిధ దశల్లో పెట్టిన కేసులతోపాటు ఇతర కేసులున్నట్లు తెలిపారు. తనతోపాటు భార్య పేరుతో దిలావర్‌పూర్‌లో రూ.21 లక్షల విలువ గల 10.53 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, మొత్తం స్థిరాస్తుల విలువ రూ.41 లక్షలని ప్రకటించారు.

రాములమ్మకు కారు లేదు..!



విజయశాంతి తన మొత్తం ఆస్తులు రూ.113 కోట్లు అని ప్రకటించారు. తన కుటుంబానికి రూ.112 కోట్ల విలువ గల భూములున్నాయని తెలిపారు. చెన్నైలోని కోయంబేడులో తనపేరుతో రూ.67.50 కోట్ల విలువగల భూమి, తన భర్త పేరుతో హైదరాబాద్‌లో రూ.45 కోట్ల విలువ గల 371 గజాల స్థలం ఉందని వెల్లడించారు. 2.47 కిలోల బంగారం ఉందని, దీని విలువ రూ.1.98 కోట్లుగా ఉందని వివరించారు. బ్యాంకులో రూ.1.01 కోట్ల డిపాజిట్లు ఉన్నాయన్నారు. 2009లో కేసీఆర్ అరెస్టుకు నిరసనగా సంగారెడ్డిలో చేసిన ఆందోళనకు సంబంధించి కేసుతోపాటు హనుమకొండలో పలు కేసులున్నట్లు తెలిపారు.

సామాజిక న్యాయానికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- మస్టర్ కోసమే అసెంబ్లీకికేసీఆర్: అద్దంకి

హైదరాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థుల నిర్ణయంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. తద్వారా సామాజిక న్యాయానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని చెప్పారు. గాంధీ భవన్‌లో గురువారం ఆయన కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'బీఆర్ఎస్ హయాంలో అసెంబ్లీలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ సభ్యత్వాలను రద్దు చేశారు. భట్టివిక్రమార్కకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేశారు. డిప్యూటీ సీఎంగా ఉన్న రాజయ్యను బర్తరఫ్ చేశారు. ఇప్పుడు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను అవమానించేలా ఆ పార్టీ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మాట్లాడారు. ఒక వైపు బలహీన వర్గాలను కించపరుస్తూ.. ప్రజాస్వామ్య విలువల గురించి కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. కేసీఆర్ మాదిరిగానే దళితులను చిన్నచూపు చూడటం బీఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో విజయశాంతి పాత్ర కీలకమని, ఆమె గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు కుమ్మక్కయి కవితను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కులగణన సర్వేకు భయపడే దాసోజు శ్రవణ్‌కి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చిందన్నారు. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో కేసీఆర్ ఇంట్లో పడుకుంటే కొట్లాడిందే తామేనన్నారు. కష్టపడినవారికి వెంటాడి పదవులు ఇచ్చే పార్టీ కాంగ్రెస్ అని చెప్పారు. మస్టర్ కోసమే కేసీఆర్ అసెంబ్లీకి వస్తున్నారన్నారు. దళితుడు స్పీకర్‌గా ఉంటే బీఆర్ఎస్ ఓర్చుకోలేకపోతోందన్నారు.

తెలంగాణ వ్యతిరేకులను దించనున్న బీజేపీ: విజయశాంతి

తాను తెలంగాణ ఉద్యమం మొదలుపెట్టిన నాడు కేసీఆర్ టీడీపీలో ఉన్నారని, తెలంగాణ ఏ ఒక్కరి ఆయన సొత్తు కాదని విజయశాంతి అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ సరైన నిర్ణయాలు తీసుకోలేదు కాబట్టే ఆ పార్టీలను వదిలేశానని చెప్పారు. తన పార్టీని బీఆర్ఎస్‌లో విలీనం చేయించుకున్న కేసీఆర్ ఆ తర్వాత మోసం చేశారన్నారు. తెలంగాణ ఇస్తున్న సమయంలోనూ కేసీఆర్ పార్లమెంటులో లేరన్నారు. తెలంగాణ వ్యతిరేకులను బీజేపీ రాష్ట్రంలో దించబోతోందన్నారు. తెలంగాణ వ్యతిరేకి అయిన కిరణ్‌కుమార్ రెడ్డి బీజేపీలోకి వచ్చినందునే తాను ఆ పార్టీని వదిలేశానన్నారు.

పారిశ్రామికవేత్తలకు కంటి నిండా నిద్ర కరువాయె!

- అధిక పని, ఆర్థిక అనిశ్చితి, ఫోన్ చూడటంతో సమస్య..సర్వేలో వెల్లడి

నందిగామ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉండేందుకు కంటి నిండా నిద్ర ఎంతో అవసరం. అయితే ఇటీవల పెరిగిన యాంత్రిక జీవనంలో మనిషికి నిద్ర కరువవుతోంది. మరీ ముఖ్యంగా ఇది పారిశ్రామికవేత్తల్లో తీవ్రంగా ఉంటోందని రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హాశాంతి వనంలోని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, టై గ్లోబల్ సంస్థల అధ్యక్షులు కమలేశ్ పటేల్, మురళి చెబుతున్నారు. శుక్రవారం ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా తమ సంస్థలు సంయుక్తంగా దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, బెంగళూరుల్లోని పారిశ్రామికవేత్తల నిద్రలేమి సమస్యలపై సర్వే నిర్వహించాయని వారు తెలిపారు. ఇందులో 80 శాతం కంటే ఎక్కువ మంది పారిశ్రామికవేత్తలకు కంటి నిండా నిద్ర కరువైనట్లు తేలిందని చెప్పారు. నిరంతరం ఎక్కువ గంటలు పనిచేయడం, ఆర్థిక అనిశ్చితి, ఒత్తిడితో కూడిన నిర్ణయాలు తదితర అంశాలు వారి నిద్ర సమస్యకు కారణమవుతున్నాయని, అలాగే పడుకునే ముందు ఫోన్ చూడటం కూడా వారి నిద్రను దూరం చేస్తోందని అన్నారు. దేశవ్యాప్తంగా తమ సర్వేల్లో పాల్గొన్న 260 మంది పారిశ్రామికవేత్తల్లో 200 మంది తాము తీవ్ర నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నట్లు చెప్పారని తెలిపారు. ధ్యానంతో మానసిక ప్రశాంతతతో పాటు ఒత్తిడి తగ్గి మంచి ఆలోచనలకు పదును పెట్టవచ్చని చెప్పారు. పారిశ్రామికవేత్తలకు సమతుల్యత, ఆరోగ్యాన్ని తిరిగి సాధించడంలో సహాయపడేందుకు హార్ట్‌ఫుల్‌నెస్, టై గ్లోబల్ సంస్థలు 21న వర్చువల్‌గా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు వెల్లడించారు.

రూ.22.86 లక్షల జీఎస్టీ చెల్లించండి

- భద్రాద్రి జిల్లా కూలీకి ఏపీ నుంచి నోటీసులు

చంద్రుగొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కూలీ పనులు చేసుకుంటూ జీవించే భద్రాద్రి జిల్లాకు చెందిన ఓ కూలీకి ఏపీ పన్నుల శాఖ అధికారులు షాకిచ్చారు. మీ వ్యాపార లావాదేవీల్లో అవకతవకలు గుర్తించామని, ఇందుకు సంబంధించి జీఎస్టీ బకాయిలను వడ్డీ, జరిమానాతో కలిపి రూ.22.86 లక్షలను తక్షణమే చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. పాన్‌కార్డు కూడా లేని సదరు కూలీ.. ఈ నోటీసులు చూసి లబోదిబోమంటున్నాడు. భద్రాద్రి జిల్లా చంద్రుగొండ గ్రామానికి చెందిన జానపటి వెంకటేశ్వర్లు అనే కూలీకి విజయవాడలోని వాణిజ్య పన్నుల శాఖనుంచి ఈ నోటీసులు అందాయి. వెంకటేశ్వర్లు పేరిట విజయవాడలో భాగ్యలక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థ ఉన్నట్టు, కాంట్రాక్టు పనులు చేసే ఆ సంస్థ 2022-23కు సంబంధించిన లావాదేవీలు, జీఎస్టీ చెల్లింపుల్లో అవకతవకలు గుర్తించినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు అసలు, వడ్డీ, జరిమానా కలిపి రూ.22,86,014ను మూడు రోజుల్లోగా చెల్లించాలని సూచించారు. అయితే, తెలిసిన వ్యాపారులతో కలిసి వెంకటేశ్వర్లు ఆ నోటీసుల్లో పేర్కొన్న భాగ్యలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ చిరునామాకు వెళ్లగా అక్కడ ఎలాంటి కార్యాలయం లేకపోవడం గమనార్హం.

గులాబీకి బదులు ఆకుపచ్చ కార్డు

- రాష్ట్రంలో రేషన్ కార్డులకు కొత్త రంగులు
- పేదలకిచ్చే కార్డులపై మూడు రంగులు
- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డు రంగులు మారనున్నాయి. రాష్ట్రంలోని దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న(ఏపీఎల్) కుటుంబాలకు ఆకుపచ్చ రంగు(గ్రీన్) రేషన్ కార్డులను జారీ చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీలోని తన చాంబర్‌లో గురువారం విలేకరులతో ముచ్చటిస్తూ ఉత్తమ్ ఈ విషయం చెప్పారు. ఏపీఎల్ కుటుంబాలకు ప్రస్తుతం ఉన్న గులాబీ రంగు కార్డుల స్థానంలో ఈ ఆకుపచ్చ రంగు కార్డులను ఇస్తామని తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండే(బీపీఎల్) కుటుంబాలకు ఇచ్చే రేషన్ కార్డులపై మూడు రంగులు ఉంటాయని చెప్పారు. ఆ రంగులేంటి ? కాంగ్రెస్ పార్టీ జెండా రంగులా ? అని ప్రశ్నించగా.. ఆ వివరాలు ఇప్పుడే వెల్లడించలేమని తెలిపారు. కాగా, ఎస్ఎల్‌బీసీ సొరంగంలో తవ్వకానికి వినియోగిస్తున్న రోబోల ఏజెన్సీకి రూ.4 కోట్లను ప్రకటించామని చెప్పారు. ఆ నిధుల విడుదలకు అనుమతిస్తూ సంబంధిత లేఖపై ఆయన సంతకం చేశారు.

ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా నామినేషన్లు వేసిన ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ నెల 29న ఖాళీకానున్న ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు టీడీపీ నుంచి బీటీ నాయుడు, బీదా రవిచంద్ర, కావలి గ్రీష్మ, జనసేన నుంచి కొణిదెల నాగబాబు, బీజేపీ నుంచి సోము వీర్రాజు నామినేషన్లు దాఖలు చేసిన విషయం విదితమే. గురువారం నామినేషన్ల ఉపసంహరణకు గుడువు ముగియడంతో ఈ ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి వనితారాణి ప్రకటించారు.

ఏడు సెకన్లలోనే గుండె పరీక్ష!

స్మార్ట్ ఫోన్‌తో సెకన్లలో గుండె జబ్బుల నిర్ధారణ

- ఏఐ బేస్డ్ యాప్‌తో మాస్ కార్డియాక్ స్ర్కీనింగ్ పరీక్ష
- గుంటూరు జీజీహెచ్‌లో ప్రయోగాత్మకంగా నిర్వహణ

గుంటూరు మెడికల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఓపీ విభాగంలో రోగులకు రెండు రోజులుగా గుండె జబ్బుల స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే.. కార్డియాలజిస్టులకు బదులు 14 ఏళ్ల బాలుడు సిద్ధార్థ్ నంద్యాల.. ఈ పరీక్షలు నిర్వహించడం.. అదికూడా స్మార్ట్ ఫోన్‌తో చేయడం అందరినీ ఆకర్షించింది. ఈ స్మార్ట్ ఫోన్‌లో అతడు స్వయంగా రూపొందించిన.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో పని చేసే సిర్కాడియావీ అనే యాప్ ఇన్‌స్టాల్ చేసి ఉంది. స్మార్ట్ ఫోన్‌ను రోగి ఛాతిపై ఏడు సెకన్లపాటు ఉంచితే ఈ యాప్ హృదయ స్పందనను రికార్డు చేస్తుంది. రోగికి గుండె జబ్బు ఉంటే బీప్ సౌండ్‌తో రెడ్ లైట్ వెలిగి గ్రాఫిక్‌లో 'అబ్‌నార్మల్ హార్ట్ బీట్' అనే పదాలు స్ర్కీన్‌పై కనిపిస్తున్నాయి. జీజీహెచ్ ఓపీలో దాదాపు 500 మందికి స్ర్కీనింగ్ పరీక్షలు చేయగా, వారిలో పది మందికి గుండె జబ్బులు ఉన్నట్లు ఈ యాప్ తేల్చింది. వీరిని వార్డుకు తరలించి.. ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు చేయగా.. ఆశ్చర్యకరంగా అందరికీ గుండె జబ్బులు ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. వాస్తవానికి అప్పటి వరకు తమకు గుండె జబ్బు ఉన్న విషయం వారికి కూడా తెలీదు. ఈ మాస్ స్ర్కీనింగ్ పరీక్షలు వైద్య సిబ్బందికి కొత్త అనుభవాన్ని అందించాయి. సిద్ధార్థ్ ఇచ్చిన శిక్షణతో ఆరుగురు నర్సులు ఈ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఎవరీ సిద్ధార్థ్..!?

అనంతపురానికి చెందిన సిద్ధార్థ్ కుటుంబం 2010లో అమెరికాలో స్థిరపడింది. తండ్రి మహేశ్ అమెరికాలో వ్యాపారవేత్త. మొదటి నుంచీ చదువులో చురుకుగా ఉండే సిద్ధార్థ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ (డల్లాస్)లో బ్యాచలర్ ఆఫ్ ఏఐ బేస్డ్ కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. 12 ఏళ్ల వయస్సులోనే మెడికల్ కోడింగ్‌పై పనిచేసిన సిద్ధార్థ్ అనంతరం వైద్య రంగంలో నూతన ఏఐ ఆధారిత పరికరాల తయారీపై దృష్టి సారించాడు. ఈ క్రమంలో సిర్కాడియావీ అనే యాప్‌ను ఆవిష్కరించాడు. ఆ యాప్‌తో అమెరికాలో 15 వేల మందికి స్ర్కీనింగ్ పరీక్షలు చేయగా.. 3,500 మందికి గుండె జబ్బులు ఉన్నట్లు గుర్తించింది. 93 శాతం కచ్చితత్వంతో పనిచేసే ఈ యాప్ సాయంతో ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో స్ర్కీనింగ్ పరీక్షలు చేశారు.



ఢిల్లీలో పెమ్మసానితో సిద్ధార్థ్

మంత్రి పెమ్మసాని ప్రోత్సాహం..

గుంటూరు ఎంపీ, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఇటీవల డల్లాస్‌లో కలిసిన సిద్ధార్థ్ నంద్యాల తాను ఆవిష్కరించిన యాప్ గురించి వివరించాడు. ఈ యాప్‌తో జీజీహెచ్‌లో రోగులకు పరీక్షించి చూద్దామని మంత్రి కోరారు. ఈ మేరకు సిద్ధార్థ్ డీఎంఈ డాక్టర్ నరసింహం, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబును కలసి జీజీహెచ్‌లో రోగులకు గుండె జబ్బుల స్ర్కీనింగ్ పరీక్షలు చేసేందుకు అనుమతి తీసుకున్నాడు. వెయ్యి మంది రోగులకు పరీక్షలు పూర్తి చేసి... అనంతరం ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని సిద్ధార్థ్ గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు.

సీఎం చంద్రబాబును కలవాలని ఉంది: సిద్ధార్థ్


ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కుడైన సర్టిఫైడ్ ఏఐ టెకీగా గుర్తింపు పొందిన సిద్ధార్థ్ ఏఐ సాయంతో రూపొందిన తన ప్రాజెక్ట్ గురించి సీఎం చంద్రబాబును కలసి వివరించాలని ఉందని తెలిపాడు. అయితే సీఎం అపాయింట్‌మెంట్ ఇంకా దొరకలేదని చెప్పాడు. 'పలు అమెరికా కంపెనీలు మా ప్రాజెక్ట్‌పై ఆసక్తిగా ఉన్నాయి. అయితే మాకు డబ్బు ప్రధానం కాదు. సొంత రాష్ట్రానికి ఉపయోగపడాలనే ఆశయంతో భారత్‌కు వచ్చాం' అని సిద్ధార్థ్ తండ్రి మహేశ్ తెలిపారు. స్ర్కీనింగ్ పరీక్షల నిర్వహణకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి సహకరించారని తెలిపారు.

సీఎంతో బీజేపీ సీనియర్ నేతల రహస్య భేటీలు

(మొదటిపేజీ తరువాయి)

ఇదేనని చెప్పారు. పార్టీలోని సీనియర్ నేతలు కొందరు అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి చెందిన కీలక నేతలను, ముఖ్యమంత్రిని రహస్యంగా కలుస్తున్నారని ఆరోపించారు. అలాంటి నేతలను పార్టీ నుంచి దూరం పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైతేనే హిందువులకు రక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న రాజాసింగ్.. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఇటీవల బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం రెడ్డి సామాజిక వర్గం చేతిలోనే ఉందని బాహాటంగా అన్నారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తేనే రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ధీటుగా బీజేపీ ఎదగగలదని అధిష్ఠానానికి సూచిస్తూ నెల రోజుల క్రితం మరో లేఖ విడుదల చేశారు. అలాగే ఇటీవల జరిగిన బీజేపీ జిల్లా అధ్యక్షుల ఎన్నికపైనా అసహనం వ్యక్తం చేశారు.

హిందువుల పండుగలపైనే ఆంక్షలు ఎందుకు ?



హిందువులపై పండుగలపైనే ఎందుకు ఆంక్షలు విధిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏడాదికి ఓసారి జరిగే పండగలపై వివక్ష చూపడం ఏంటనీ ధ్వజమెత్తారు. హోలీ పండుగ నేపథ్యంలో పోలీసులు విధించిన అంక్షలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాజాసింగ్ గురువారం ఓ వీడియో విడుదల చేశారు. హిందువులతో పెట్టుకుంటే కేసీఆర్ పరిస్థితి ఏమైందో ఆలోచన చేయాలని, అదే పరిస్థితి మీకు(సీఎం రేవంత్) ఎదురవుతుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఏడో నిజాం మార్గదర్శనంలో వెళుతున్నారని ఆరోపించారు. హోలీ రోజున సమూహంగా ఉండొద్దని, మధ్యాహ్నం 12 గంటల లోపే పండుగ చేసుకోవాలని, ఇతరులపై రంగులు చల్లితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఉత్తర్వులు జారీచేయడం తగదన్నారు. 30 రోజుల పాటు జరిగే రంజాన్ పండుగ వల్ల రాత్రి వేళల్లో ప్రజలకు ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఆ ఇబ్బందులు ప్రభుత్వం, పోలీసుల దృష్టికి రావడం లేదా ? అని ప్రశ్నించారు. ఒక వర్గానికి కొమ్ము కాస్తు ప్రభుత్వం మరో వర్గాన్ని ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. హిందువుల పండుగలపై వివక్షత చూపితే ప్రజలు హర్షించరని, రేవంత్ రెడ్డి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇక, హోలీ పండుగ సమయంలో పొరపాటున ఎవరి మీదైనా రంగులు పడితే అన్యథ భావించవద్దని రాజాసింగ్ కోరారు.

లోకం తీరు





ఆస్పత్రిని ప్రారంభిస్తున్న అపోలో ఆస్పత్రి జాయింట్ డైరెక్టర్ సంగీతారెడ్డి, సాయిబాబా సంస్థాన్ సీఈవో గోరకేష్ గోందికర్ సాహెబ్

షిర్డీలో శ్రీ సాయినాథ్ ఆస్పత్రి

ప్రారంభించిన అపోలో ఆస్పత్రి జాయింట్ డైరెక్టర్ సంగీతా రెడ్డి

హైదరాబాద్ సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): షిర్డీ సాయిబాబా సంస్థాన్ సహకారంతో షిర్డీ పరిసర ప్రాంతాల్లో కంటి సమస్యలు ఉన్న వారికి పరిష్కారం అందించేందుకు సాయిబాబా కృపతో శ్రీ సాయినాథ్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్నామని అపోలో ఆస్పత్రి జాయింట్ డైరెక్టర్ సంగీతా రెడ్డి తెలిపారు. మహారాష్ట్రలోని షిర్డీలో సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన 200 పడకల ఆస్పత్రిని సంగీతా రెడ్డి, సాయిబాబా సంస్థాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి గోరకేష్ గోందికర్ సాహెబ్‌తో కలిసి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఆస్పత్రి నిర్మాణానికి సంగీతా రెడ్డి ఆర్థిక సహకారమందించారు. ఈ ఆస్పత్రికి అవసరమైన అనుమతులను మహారాష్ట్ర ప్రభుత్వం అందించిందని, ఆస్పత్రిలో మొదటి రోజు నుంచి కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించవచ్చని సంగీతా రెడ్డి తెలిపారు. దాతల నుంచి సేకరించిన కార్నియా కంటి చూపులేని వారికి వరంగా మారుతుందన్నారు. నేటి నుంచి షిర్డీ.. సాయి నాథుడి భక్తి భావంతో పాటు కంటి చికిత్సలకు కూడా మారుపేరుగా నిలుస్తుందని సంగీతా రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా సంస్థాన్ అధికారులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మంత్రి సీతక్క చీరల బహూకరణ

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకున్న నేపథ్యంలో పార్టీలకు అతీతంగా.. మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చీరలను బహూకరించారు. తాను స్వయంగా కొనుగోలు చేసిన చీరలను గురువారం అసెంబ్లీ, శాసనమండలిలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు తన సిబ్బంది ద్వారా మంత్రి అందజేశారు.

డిజిటల్ అరెస్ట్ చేస్తామని.. రిటైర్డ్ ఉద్యోగినికి రూ.23 లక్షలు టోపీ

- మానవ రవాణా, మనీ ల్యాండరింగ్‌లో.. క్రిమినల్ కేసులు ఉన్నాయని బెదిరింపు

హైదరాబాద్ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా, మనీ ల్యాండరింగ్‌లో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని రిటైర్డ్ ఉద్యోగిని నుంచి సైబర్ కేటుగాళ్లు రూ.23లక్షలు కాజేశారు. మోసాన్ని ఆలస్యంగా గుర్తించిన బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగిని(65)కి ఇటీవల ఓ ఫోన్ కాల్ వచ్చింది. మానవ అక్రమ రవాణా, మనీ ల్యాండరింగ్‌కు సంబంధించి ఆమెపై బెంగళూరులో క్రిమినల్ కేసు నమోదైందని అవతలి వ్యక్తి చెప్పాడు. ఎస్సైతో మాట్లాడాలంటూ.. కాల్‌ను అవతలి వ్యక్తికి బదిలీ చేశాడు. ఇటీవల ఓ నేరస్థుడిని పట్టుకున్నామని, అతడిని విచారించగా బాధితురాలికీ ఈ కేసుతో సంబంధం ఉందని నేరస్థుడు చెప్పాడని వివరించాడు. అందుకు సంబంధించిన ఆధారాలు పోలీసుల వద్ద ఉన్నాయని భయపెట్టాడు. తనకు సంబంధం లేదని బాధితురాలు చెప్పినా వినిపించుకోలేదు. ఏదైనా ఉంటే సీనియర్ ఐపీఎస్ అధికారికి చెప్పుకోవాలని సలహా ఇచ్చాడు. ఆ తర్వాత ఆమెకు మరో కాల్ వచ్చింది. ఆ వ్యక్తి ఐపీఎస్ అధికారిలా పరిచయం చేసుకున్నాడు. దేశద్రోహం కేసులు నమోదయ్యాయని భయపెట్టాడు. కేసుల్లోంచి బయటపడాలంటే ఆమె బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును ఆర్‌బీఐకి చెందిన ఖాతాకు బదిలీ చేయాలని చెప్పాడు. ఆ తర్వాత ఆర్‌బీఐ అధికాలు ఆడిట్ చేస్తారని.. బాధితురాలికి మనీల్యాండరింగ్, మానవరవాణా లావాదేవీలకు సంబంధం లేదని తేలితే డబ్బు వాపస్ ఇస్తారని వివరించాడు. అదంతా నిజమని నమ్మిన బాధితురాలు రూ.23లక్షలను మోసగాళ్లు చెప్పిన ఖాతాలకు బదిలీ చేసింది. ఆ తర్వాత ఎలాంటి ఫోన్లు రాకపోవడం, ఫోన్ చేస్తే కేటుగాళ్లు స్పందించకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

భర్త హత్యకు భార్య సుపారీ

- హంతకుల ముఠాలోని వ్యక్తి అత్యాశతో బయటపడ్డ కుట్ర
- ప్రాణాలతో బయటపడిన భర్త.. కటకటాల్లోకి భార్య, నిందితులు

నర్సంపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఓ బ్యాంకు మేనేజర్‌ను చంపేందుకు అతని భార్య చేసిన కుట్ర ఓ క్యాబ్ డ్రైవర్ అత్యాశతో భగ్నమైంది. భర్తను చంపేందుకు యత్నించిన భార్య, ఆమె వద్ద డబ్బు తీసుకున్న మరో నలుగురు కటకటాలపాలయ్యారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలో వెలుగు చూసిన ఘటనకు సంబంధించి నర్సంపేట ఎస్సై జీ అరుణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నర్సంపేట మండలం ఆకులతండాకు చెందిన ధారావత్ సుమన్‌కు అదే మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన మంజులతో 2018లో వివాహమైంది. వీరికి ఓ కుమార్తె(4) ఉంది. సుమన్ హైదరాబాద్‌లోని ఐడీబీఎల్ బ్యాంకులో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. మనస్పర్థల వల్ల సుమన్, మంజుల రెండేళ్లుగా విడివిడిగా ఉంటున్నారు. పెద్దల సమక్షంలో పంచాయితీకి పిలిస్తే రాకపోగా, కలిసి ఉండేందుకు ఒప్పుకోకపోవడంతో సుమన్‌పై మంజుల కక్ష పెంచుకుంది. హోలీ పండుగ లోగా తన భర్త సుమన్‌ను చంపాలని ఆకులతండాలో తనకు పరిచయమైన మూడు గోపితో ఒప్పందం చేసుకుని ముందస్తు ఖర్చుల కోసం రూ.30వేలు ఇచ్చింది. అనంతరం గోపీ.. తనకు తెలిసిన క్యాబ్ డ్రైవర్లు మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన మల్లేష్, వరంగల్ జిల్లా రాయపర్తికి చెందిన బానోత్ నరేష్, మంజులకు బావ వరుసైన ములుగు జిల్లా అన్నంపల్లికి చెందిన మోతీలాల్‌తో ముఠాగా ఏర్పడ్డాడు. వీరంతా కలిసి హైదరాబాద్‌లో సుమన్ పని చేసే బ్యాంకు, అతని ఇంటి వద్ద రెక్కీ చేశారు. హత్యకు ప్రణాళిక చేస్తున్న క్రమంలో ముఠాలో ఒకడైన క్యాబ్ డ్రైవర్ బానోత్ నరేష్ అత్యాశతో మార్చి 4న సుమన్‌కు ఫోన్ చేశాడు. 'నేను అడిగినంత డబ్బు ఇస్తే నీకు సంబంధించిన ఓ ముఖ్యమైన విషయం చెబుతా.. లేదంటే నిన్ను చంపేస్తాం' అంటూ బెదిరించాడు. మార్చి9న సుమన్ నర్సంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బానోత్ నరేష్‌ను పట్టుకొని విచారించగా.. సుమన్ హత్యకు అతని భార్య మంజుల చేసిన కుట్ర బయటపడింది. దీంతో మంజుల, గోపి, మల్లేష్, మోతీలాల్, నరేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. బుధవారం కోర్టు ఆదేశాల మేరకు ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు.

అపోలోలో పిల్లల గుండె వైద్య శిబిరం

హైదరాబాద్ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని అపోలో మెడికల్ కాలేజ్ ఆస్పత్రి ఆవరణలో పిల్లల గుండె వ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం ప్రారంభించారు. అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆస్పత్రి (ఏఐఎంఎస్ఆర్), హైదరాబాద్ జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కె) ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. పిల్లల్లో పుట్టుకతో వచ్చే వైకల్యాలకు చికిత్స అందించడం రాష్ట్రీయ బాల్‌స్వాస్థ్య లక్ష్యమని కలెక్టర్ చెప్పారు. శిబిరంలో స్ర్కీనింగ్ నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సహాయం చేస్తున్నారని చెప్పారు. ఏఐఎంఎస్ఆర్ సీఈవో అపర్ణారెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలు, అణగారిన వర్గాల పిల్లలు, అనాథలకు సేవలందిస్తున్నామని, రెండేళ్లలో 800పైగా పిల్లలకు ఉచితంగా చికిత్స చేశామని తెలిపారు. డీన్ డాక్టర్ కే మనోహర్, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఇకపై ఐదేళ్ల వయసు పిల్లలకూ కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ

గతంలో పిల్లలకు మూడేళ్ల వరకే ఆరోగ్యశ్రీ కింద వెసులుబాటు.. వయసు పరిమితిని పెంచిన సర్కారు

హైదరాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు వినికిడి సమస్య నుంచి ఉపశమనం కలిగించే కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీకి వయసు పరిమితిని ప్రభుత్వం పెంచింది. రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ కింద ఇంతకాలం పిల్లలకు మూడేళ్ల వయసు వరకే ఈ శస్త్రచికిత్స చేయించుకునే వెసులుబాటు ఉండగా, దానిని ఐదేళ్ల వయసు వరకు ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో కర్ణన్ ఒక సర్క్యులర్ జారీ చేశారు. ఈ సర్జరీ వల్ల వినికిడి సమస్య నుంచి పూర్తిగా విముక్తి కలగకపోయినా కొంత ఉపశమనం కలుగుతుంది. ఈ సర్జరీకి ప్రైవేటులో సగటున రూ.6- 12 లక్షల వరకు ఖర్చు అవుతుందని ఈఎన్‌టీ వైద్యులు చెబుతున్నా రు. పేదల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ శస్త్రచికిత్సను చిన్నారులకు ఐదేళ్ల వయసు వరకు ఆరోగ్యశ్రీ కింద చేసేలా సర్కారు నిర్ణయం తీసుకుంది.

ఆస్పత్రుల సంఖ్యను పెంచనున్న సర్కారు

ఇప్పటిదాకా కోఠీలోని ఈఎన్‌టీ, గాంధీ ఆస్పత్రి, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రుల్లో మాత్రమే ఈ శస్త్రచికిత్స చేస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ గణాంకాల మేరకు 2022 నుంచి ఇప్పటిదాకా మొత్తం ఈ 3ఆస్పత్రుల్లో ఈ సర్జరీలు 132 చేశారు. మరిన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు ఈ సర్జరీలను చేసే అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఖర్చుతో కూడుకున్న శస్త్రచికిత్స కావడంతో నిధులు దుర్వినియోగమయ్యే అవకాశం ఉందని భావించి ఇంతకాలం ప్రైవేటు ఈఎన్‌టీ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ కింద ఈ సర్జరీలు చేసే అవకాశమివ్వలేదు. కాగా ప్రస్తుతం 3ప్రైవేటు బోధనాస్పత్రుల్లో ఈ శస్త్ర చికిత్సకు ప్రభుత్వం అనుమతినిచ్చినట్లు, ఆ వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు సమాచారం. ప్రైవేటు ఈఎన్‌టీ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ అనుసంధాన ఆస్పత్రులుగా నమోదయ్యే వీలు కల్పించేందుకు సర్కారు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇది విధానపరమైన నిర్ణయం కావడంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాత అందుకు అనుమతులు వచ్చే అవకాశాలున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కింద కోక్లియర్ ఇంప్లాంట్ సర్జరీకి రూ.5.75 లక్షలు చెల్లిస్తున్నారు. ఒక చెవికి కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేసేందుకే ఈ ఖర్చు అవుతుందని ఈఎన్‌టీ వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యశ్రీ కింద ఏడాదికి ఒక చెవికి సర్జరీ చేసుకోవచ్చు.

ప్రైవేట్‌ను అనుమతించాలి.. ప్రభుత్వ పర్యవేక్షణ ఉండాలి..



ఈఎన్‌టీ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ ప్యానెల్‌లో అవకాశం కల్పించాలి. దాంతో నాణ్యమైన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు మరింత అందుబాటులోకి వస్తాయి. అయితే ప్రైవేటులో నిర్వహించే ఈ సర్జరీలపై ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ ఉండాలి. అప్పుడే దుర్వినియోగయ్యే అవకాశం ఉండదు. జిల్లాకు ఒక అధికారిని నియమించి, పర్యవేక్షించాలి. వైరల్, బ్రెయిన్ ఇన్ఫెక్షన్ల కారణంగా కూడా వినికిడి లోపం తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఇటువంటి వాటికి కాక్లియర్ సర్జరీతో మెరుగైన ఫలితం ఉంటుంది.

- డాక్టర్ చావా ఆంజనేయులు, ఎంఎస్, చీఫ్ ఈఎన్‌టీ సర్జన్, ఏషియన్ ఈఎన్‌టీ కేర్ ఆస్పత్రి, హైదరాబాద్

కార్నియా వ్యాధులకు సెల్ థెరపీ

- ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి ఆస్ట్రేలియా పేటెంట్

హైదరాబాద్ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి 'స్ట్రోమల్ స్టెమ్ సెల్ థెరపీ'లో ఆస్ట్రేలియా పేటెంట్ లభించింది. ఈ చికిత్సా విధానం కార్నియా వ్యాధుల చికిత్స నివారణకు ఉపయోగపడుతుంది. దీనికి ఇప్పటికే భారత ప్రభుత్వం ఇరవై ఏళ్ల కాలపరిమితితో పేటెంట్ మంజూరు చేసింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ అనుమతితో క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయని, మరింత పరిశోధన తర్వాత ఈ సెల్ థెరపీ అందుబాటులోకి వస్తుందని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి గురువారం తెలిపింది. ఈ పేటెంట్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ సయన్ బసు, డాక్టర్ వివేక్ సింగ్‌కు మంజూరైంది. క్లినికల్ ట్రయల్స్ విజయవంతమైతే భవిష్యత్తులో కార్నియా వ్యాధుల చికిత్సా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చే శక్తి స్ట్రోమల్ స్టెమ్ సెల్ థెరపీకి ఉందని డాక్టర్ బసు తెలిపారు. అంతేకాక దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు అందుబాటు ధరలో చికిత్స అందించే అవకాశం ఉంటుందని డాక్టర్ వివేక్ సింగ్ చెప్పారు. ప్రస్తుతం కార్నియా అంధత్వానికి చికిత్సలో ఎక్కువగా కార్నియా మార్పిడి చేయాల్సి వస్తోంది. ఇది సంక్లిష్టమైన శస్త్రచికిత్సే కాకుండా జీవితాంతం వైద్య పర్యవేక్షణ అవసరం. కేరటోకోనస్ అనే వ్యాధి వల్ల కూడా దృష్టి లోపం ఏర్పడుతుంది. కార్నియా పలుచగా మారి ఆకారాన్ని కోల్పోవడం ఈ వ్యాధి లక్షణం. కొత్త సెల్ థెరపీతో కార్నియా ఆకారాన్ని స్థిరంగా ఉంచే కొల్లాజెన్ అనే ప్రొటీన్ స్థాయిని పునరుద్ధరించే అవకాశం ఉందని వారు తెలిపారు. కార్నియా మార్పిడికి బదులుగా వ్యక్తి సొంత కార్నియల్ స్టెమ్ సెల్స్‌ను లేక దాత నుంచి సేకరించినవి ఉపయోగించి కార్నియాకు మళ్లీ ఆరోగ్యకరమైన కణాలు అందేలా చేయవచ్చని చెప్పారు. సాధారణంగా ఇన్ఫెక్షన్లు, ప్రమాదాల వల్ల కంటి బయటవైపు ఉన్న పారదర్శక పొర (కార్నియా) దెబ్బతిని, దృష్టి లోపం ఏర్పడుతుందని చెప్పారు. ముఖ్యంగా తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో అంధత్వం, కంటి సమస్యలకు ఇదే ప్రధాన కారణంగా మారిందన్నారు.



ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి శాస్త్రవేత్తలు డాక్టర్ వివేక్ సింగ్, డాక్టర్ సయన్ బసు

కిడ్నాప్ చేసి.. డ్రగ్స్ ఇచ్చి..

పాఠశాల బాలికలపై అత్యాచారాలు?

వరంగల్‌లో ఓ కిలాడీ లేడీ ముఠా అరాచకాలు

ఓ బాలిక మిస్సింగ్ కేసుతో బయటపడ్డ ఘోరాలు

పోలీసుల అదుపులో ప్రధాన నిందితురాలు?

వరంగల్ క్రైం, మార్చి13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు వెళ్లే బాలికలను అపహరించి, వారికి డ్రగ్స్ ఇచ్చి, మానవ మృగాల చేతుల్లో పెట్టి.. ఆ చిన్నారుల జీవితాలను చిదిమేస్తున్న ఓ కిలాడీ లేడీ ముఠా బాగోతం వరంగల్‌లో వెలుగు చూసింది. ప్రాథమికంగా తెలిసిన సమాచారం ప్రకారం.. హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ కిలాడీ లేడీ.. వరంగల్, మిల్స్‌కాలనీ పరిధిలో నివాసముంటోంది. డ్రగ్స్‌కు బానిసైన ఆ లేడీ.. తనతోపాటు డ్రగ్స్‌కు అలవాటు పడిన ఓ అమ్మాయి, నలుగురు యువకులతో కలిసి ఓ ముఠాగా మారింది. పాఠశాల బాలికలే లక్ష్యంగా ఈ కిలాడీ లేడీ వరంగల్‌లోని సంపన్నుల కాలనీలు, కార్పొరేట్ పాఠశాలల వద్ద రెక్కీ నిర్వహిస్తుంది. పాఠశాలకు వెళ్లివచ్చే సమయాల్లో ఎంపిక చేసుకున్న బాలికలతో మాటలు కలిపి వారికి దగ్గరవుతుంది. చనువు పెంచుకుని, కలివిడిగా ఉన్నట్టు నటించి బాలికలను కిడ్నాప్ చేస్తోంది. ఆ బాలికలకు మత్తు పదార్థాలు ఇచ్చి.. అప్పటికే తన, తన గ్యాంగ్‌కు టచ్‌లో ఉన్న మానవ మృగాలకు వారిని అప్పగిస్తోంది. కిలాడీ లేడీకి డబ్బు ఇచ్చే మానవ మృగాలు.. బాలికలు మత్తులో ఉండగా వారిపై అత్యాచారాలు చేసేవారు. బాలికలు పూర్తిగా స్పృహలోకి రాగానే సదరు కిలాడీ లేడీ గ్యాంగ్ వారిని ఎక్కడ నుంచి తీసుకొస్తుందో అక్కడి వదిలేసి వెళ్లిపోతారు. ఈ ముఠా దాదాపు ఏడాదిన్నరగా ఇలాంటి పనులు చేస్తూ పలువురు బాలికల జీవితాలను నాశనం చేసింది. కిడ్నాప్ చేసిన బాలికలను ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు పక్కజిల్లాలకు కూడా తరలించినట్టు సమాచారం. అయితే వరంగల్ మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం ఓ బాలిక కనిపించకుండా పోగా కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ఇంటికి చేరుకున్న బాలికను ఆరా తీయగా తనను ఓ మహిళ కిడ్నాప్ చేసి తీసుకెళ్లిందని, ఆ తర్వాత తనకేం జరిగిందో తెలియదని, స్పృహలోకి వచ్చాక వదిలేసి వెళ్లారని చెప్పింది. బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించగా ఆమెకు డ్రగ్స్ ఇచ్చినట్టుగా తేలినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ బాలిక చెప్పిన వివరాలు, ఆనవాళ్ల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులకు సదరు కిలాడీ లేడీ గ్యాంగ్ చేస్తోన్న అరాచకాలు తెలిశాయి. సదరు కిలాడీ లేడీని పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఈ విషయంపై మిల్స్‌కాలనీ సీఐని సంప్రదించగా.. బాలిక, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అయితే, కిలాడీ లేడీ గ్యాంగ్ వ్యవహారంపై శుక్రవారం మరింత స్పష్టత వచ్చే అవకాశముంది.



జనగామ-నర్మెట రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

ఎండిన పంట.. రైతు గుండె మంట

- పురుగు మందు డబ్బాలతో నిరసన
- వరి చేనులో పశువుల్ని మేపిన రైతు
- జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో ఆందోళన

జనగామ రూరల్, చిన్నగూడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో సాగు చేసిన పంటలు తడి అందక ఎండిపోతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లెదుటే ఇలా ఎండిపోతుంటే ఏమీ చేయలేని నిస్సహాయతతో రైతుల గుండె మండుతోంది. ఈ తరుణంలో జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో రైతులు నిరసనలకు దిగారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నీరందించాలని డిమాండ్ చేశారు. జనగామ జిల్లా జనగామ మండలం గానుగుపహాడ్, ఎర్రగొల్లపహాడ్, ఎర్రకుంట తండా, మరిగడి, వడ్లకొండ గ్రామాల రైతులు గురువారం జనగామ-నర్మెట రహదారి గానుగుపహాడ్‌స్టేజి వద్ద నిరసన తెలిపారు. రోడ్డుపై టైర్లు కాల్చి, పురుగుల మందు డబ్బాలతో రాస్తారోకో చేపట్టారు. బీజేవైఎం నాయకుడు శానబోయిన మహిపాల్ ముదిరాజ్, రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి బొమ్మకూర్ రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ నెల 15 నుంచి బొమ్మకూరు రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. అలాగే, మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం విస్సంపల్లికి చెందిన రైతులు తుమ్మల చెరువు కింద వరి సాగు చేశారు. కొద్ది రోజులుగా చెరువు, బావుల్లో నీరు లేక పంట ఎండిపోయింది. దీంతో ఆవేదన చెందిన రైతులు గురువారం పంట చేనులో పశువులను మేపుతూ నిరసన వ్యక్తం చేశారు.

10 లక్షల ఎకరాల్లో పంటలు ఎండినా పట్టదా?

- ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని ఎందుకు విడుదల చేయటం లేదు?
- అసెంబ్లీలో ఈ అంశంపై చర్చించాలి
- దిద్దుబాటు చర్యలు చేపట్టాలి: బండి సంజయ్



హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పది లక్షల ఎకరాల్లో పంటలు ఎండినా పట్టించుకోరా అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కాంగ్రెస్ మార్క్ రైతు సంక్షేమ రాజ్యమంటే ఇదేనా అని నిలదీశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 10 లక్షల ఎకరాల మేరకు పంట ఎండిపోయినట్లు తెలుస్తోందని, ముఖ్యంగా ఆయకట్టు చివరి పంటలకు నీళ్లందక పూర్తిగా ఎండిపోతున్నాయన్నారు. అయినా ప్రభుత్వ యంత్రాంగం రైతులను ఆదుకునేందుకు, పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. 'ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి ప్రాజెక్టులు, చెరువులు నిండాయి. ఫలితంగా వానాకాలంలో రికార్డుస్థాయిలో 160 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వచ్చింది. యాసంగిలోనూ 56 లక్షల ఎకరాల్లో వరి, మరో 7 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటలు వేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. ఏ ప్రాంతంలో ఏ పంట వేయాలనే దానిపై ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను కూడా వ్యవసాయశాఖ అమలు చేయలేదు. నెల రోజుల్లో పంటలు కోతకు వస్తున్న తరుణంలో పొలాలకు నీరందక ఎండుతున్నాయి. ఇది ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే' అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టుల్లో 340 టీఎంసీలకుపైగా నీటి నిల్వలున్నట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయని, వాటిలో 150 టీఎంసీలు డెడ్‌స్టోరేజీ పోగా, మరో 190 టీఎంసీలకుపైగా నీరు అందుబాటులో ఉందన్నారు. తాగునీటి అవసరాలకు మినహాయిం చి మిగిలిన నీటిని సకాలంలో విడుదల చేసి చెరువులు నింపినట్లయితే పంటలు ఎండిపోయే దుస్థితి తలెత్తేది కాదని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, వ్యవసాయశాఖ ప్రణాళికలేమి కారణంగా.. నీళ్లున్నా వాడుకోలేని దుస్థితి తలెత్తి 10లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. రైతుల ఇబ్బందులపై అసెంబ్లీలో చర్చించాలనే ఆలోచన కాంగ్రెస్‌ప్రభుత్వానికి లేకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఈ అం శాన్నీ కేంద్రంపైకి నెట్టేసి తప్పించుకోవాలనుకుంటున్నారా?అని సీఎంను ప్రశ్నించారు. బాధిత రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణం ప్రకటన చేయాలని, ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయాలని సంజయ్ డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతికి అవకాశం!

అణుఒప్పందంపై అమెరికాతో చర్చలు జరిపేది లేదు, డోనాల్డ్ ట్రంప్ చేతనైనది చేసుకోవచ్చు అని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కుండబద్దలు కొట్టేశారు. చర్చలకు రమ్మని ట్రంప్ కబురుపంపిన లేఖను తాను చూడలేదని అంటూనే, ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా ఖొమేనీ కూడా మొన్నీమధ్య వ్యతిరేకంగానే మాట్లాడారు. అమెరికాతో ముచ్చట్లుపెట్టినంత మాత్రాన నెత్తిమీద ఉన్న ఆంక్షలు తొలగిపోవని, ఫలితం ఉండదని తెలిసికూడా చర్చలకు పోవడం ఎందుకని ఇరాన్ పెద్దాయన వ్యాఖ్యానించారు. ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధిచేస్తోందనో, అవసరమైన యురేనియంను శుద్ధిచేసి పోగేస్తున్నదనో అంత అనుమానం ఉన్నప్పుడు కాస్తంత మర్యాదగానే చర్చలకు రమ్మనవచ్చు. కానీ, అమెరికా అధ్యక్షుడికి అది తెలియదు కనుక, ఇరాన్‌కు కబురు పంపానని అంటూనే, సైనికచర్య హెచ్చరిక కూడా చేర్చారు. యుద్ధమా, ఒప్పందమా ఏది కావాలో తేల్చుకోవాలన్నారు. దారికి రాకపోతే దాడులు తప్పవన్న అర్థంలో మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడికి పరిష్కారాలకంటే, పెత్తనం మీదే ప్రేమ ఎక్కువంటూ ఇరాన్ పాలకులు ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నారు. అదిలించి బెదిరించి మమ్మల్ని దారికి తేలేరన్నదే ఇరువురి వ్యాఖ్యల సారాంశం తప్ప, చర్చలను ఇరాన్ తిరస్కరిస్తున్నట్టు కాదని విశ్లేషకుల వ్యాఖ్యానం. ట్రంప్ గదమాయించగానే దాసోహపడినట్టుగా కనిపించకుండా, ఈ ఆత్మగౌరవప్రదర్శనల అనంతరం ఇరాన్ దారికి వస్తుందని ఓ అంచనా.

అమెరికా అధ్యక్షుడు రాసిన లేఖను పట్టుకొని టెహ్రాన్ వచ్చిన ఎమిరేట్స్ దౌత్యప్రతినిధి ఇరాన్ విదేశాంగమంత్రికి దానిని అందచేశారట. ఇరాన్ క్షిపణి కార్యక్రమంమీద ఆంక్షలు విధించడంతో పాటు, పశ్చిమాసియాలో తమ ప్రభావాన్ని తగ్గించడానికే ట్రంప్ ఈ చర్చలను ప్రతిపాదించారని, అది తమకు అంగీకారం కాదని ఖమేనీ అంటున్నారు. ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ దౌత్యప్రతినిధులు చర్చలకు సిద్ధమేనని అంటూనే, అది అణ్వాయుధీకరణకు సంబంధించిన అనుమానాల పరిష్కారానికే పరిమితం కావాలని అన్నారు. నెలరోజుల క్రితం ఇరాన్ మీద విరుచుకుపడిన ట్రంప్ ఇంతలోనే మాట్లాడుకుందాం రండి అని పిలవడం ఆశ్చర్యంతోపాటు అనుమానాలు కూడా పెంచడం సహజం. పైగా, తనను చంపడానికి ఇరాన్ ప్రయత్నిస్తున్నట్టుగానూ, అందువల్ల, తనకు ఏం జరిగినా వెంటనే ఇరాన్‌ను దుంపనాశనం చేయమని తాను ఇప్పటికే అధికారులను ఆదేశించినట్టుగానూ ఆయన అప్పట్లో ఆడిపోసుకున్నారు. తన ప్రాణాలకే ఎసరుపెడుతున్న ఇరాన్‌కు ఇంతలోనే ఆయన చర్చల అవకాశం ఎందుకు ఇచ్చారో మరి. విఫలమైతే ఏంచేయాలన్న వ్యూహం కూడా ఇప్పటికే సిద్ధంగా ఉండివుంటుంది.

బరాక్ ఒబామా హయాంలో ఎంతో కష్టపడిసాధించిన అణుఒప్పందాన్ని తన తొలివిడత పాలనలో ట్రంప్ ఏకపక్షంగా కాలరాసిన సంగతి తెలిసిందే. భద్రతామండలిలోని ఐదు శాశ్వత సభ్యదేశాలు, జర్మనీ, యూరోపియన్ యూనియన్ ఒకవైపు, ఇరాన్‌మరోవైపు ఈ ఒప్పందం మీద సంతకాలు చేశాయి. మిగతా ప్రపంచమంతా యుద్ధభయం తగ్గినందుకు సంతోషించిన సందర్భం అది. ప్రపంచానికి కాస్తంత ప్రశాంతతను ప్రసాదించిన ఆ 2015నాటి ఒప్పందాన్ని మూడేళ్ళలోనే ట్రంప్ మట్టిపాల్జేశారు. అది అమెరికా పక్షాన కాక, ఇరాన్‌కు మేలుచేసే విధంగా ఉన్నదని వాదించారు. ఆ తరువాత ఇరాన్ మరిన్ని తీవ్రమైన ఆంక్షలు ఎదుర్కొంది, అష్టకష్టాలూ పడింది. జో బైడెన్ వచ్చి ఒప్పందాన్ని పునరుద్ధరిస్తారనుకుంటే అదీ జరగలేదు. దశాబ్దాలుగా ఇరాన్ ఏవో కారణాలతో ఆంక్షలను అనుభవిస్తూనే ఉంది. చమురు ఉండీ ఎగుమతిచేయలేక, అమెరికా బ్యాంకుల్లో బంగారం, నగదు స్తంభించిపోయినందునా బాధలు పడుతోంది.

గాజా యుద్ధంలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇరాన్ అండతో వేర్వేరు శక్తులు పోరాడిన విషయం తెలిసిందే. నేలమట్టమైన గాజాను రిసార్టుగా మార్చే ఆలోచన చేస్తున్న ట్రంప్ ఇప్పటికే అక్కడ యుద్ధం ఆగేట్టు చేశారు, జనాన్ని ఖాళీచేయించే ప్రయత్నంలోనూ ఉన్నారు. ఇరాన్‌ను దారికి తెచ్చుకోవడం ఇప్పుడు అత్యవశ్యకం. గత ఒప్పందంలో కీలకపాత్ర పోషించిన అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ కొత్త ఒప్పందానికి కూడా అనుకూలమే. ఇరాన్‌కు అన్యాయం జరగకుండా, భవిష్యత్తు భయాలు లేకుండా ఒప్పందం కుదరడానికి పుతిన్–ట్రంప్ స్నేహం ఉపకరిస్తే మరీ మంచిది. ఇరాన్ అణుబాంబు తయారీకి అడుగుదూరంలోనే ఉందని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ నెలక్రితం లెక్కగట్టిన నేపథ్యంలో, కొత్త కుట్రలకు పాల్పడకుండా, మరింత అవిశ్వాసానికి తావులేకుండా ట్రంప్ నిజాయితీగా వ్యవహరిస్తే ప్రపంచానికి మంచిది.

పేదల శ్రేయస్సుతోనే హరిత ధరిత్రి

■ సునీతా నారాయణ్

మట్టివాసన



పర్యావరణ విధ్వంస ప్రభావం మహిళలపైనే అధికంగా ఉంటుంది. ఆ కారణంగానే వారు ఒక మెరుగైన భవిష్యత్తును ఎలా నిర్మించుకోవాలనే విషయమై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో ముడిపడివున్న నా వృత్తి వ్యాసంగాలలో నేను నేర్చుకున్న మొదటి పాఠమిది. 1980వ దశకం తొలి సంవత్సరాలలో నేను కళాశాల విద్యను ముగించినప్పుడు పర్యావరణం అనేది ప్రజలు పెద్దగా పట్టించుకునే అంశంగా ఉండేది కాదు. నా స్నేహితులు ఎవరూ పర్యావరణ సంబంధిత వ్యవహారాలను వృత్తిగా స్వీకరించాలనే ఆలోచన చేయలేదు. అయితే అప్పటికే పర్యావరణ సమస్యలు ప్రపంచ వేదికలపై ప్రాధాన్యం వహిస్తున్నాయి. 1972లో స్టాక్‌హోంలో పర్యావరణ పరిరక్షణపై ప్రప్రథమ ప్రపంచ సదస్సు జరిగింది. అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి ఆ సదస్సులో పాల్గొన్న కొద్దిమంది ప్రభుత్వాధినేతలలో ఆనాటి మన ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ఒకరు. 1970ల్లోనే హిమాలయ ప్రాంతాల్లో వేలాది మహిళలు వృక్షాలను ఆలింగనం చేసుకుని కలప వ్యాపారుల నుంచి వాటిని రక్షించిన వైనం గురించి వార్తలు వెలువడ్డాయి. చిప్కో ఉద్యమంగా సుప్రసిద్ధమైన హిమాలయ మహిళల సాహసాలు దేశ ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించాయి. పేదల, మహిళల శ్రేయస్సుకు, పర్యావరణ భద్రత ముఖ్యమన్న అవగాహనను ఆ ఉద్యమం కలిగించింది.

చెట్ల కూల్చివేతను అడ్డుకోవాలని మహిళలు ఎందుకు అంత పట్టుదల చూపుతున్నారో అర్థం చేసుకునేందుకు హిమాలయ ప్రాంతాలలో పర్యటనలతో నా పర్యావరణ పరిరక్షణ కృషి ఆరంభమయింది. ఆ పర్యటనల ఫలితంగా జీవనోపాధులు, పర్యావరణం మధ్య ఉన్న సంబంధాన్ని చూడడం ప్రారంభించాను. ఈ దేశంలోని లక్షలాది మహిళలకు పర్యావరణం– భూమి, నీరు, అడవులు– విలాస విషయాలు కాదు. అవి వారి మనుగడకు సంబంధించినవి. సహజ సంపదలు వారి జీవితాలలో నిర్ణయాత్మక పాత్ర వహిస్తున్నాయి. ఆర్థికాభివృద్ధికి సహజ వనరులను పరిరక్షించి పెంపొందించడమే సరైన మార్గమని భావించాను. నిజానికి భారతదేశ సత్వర ఆర్థికాభివృద్ధికి సహజ వనరుల పునశ్శక్తిమంతం చేయడం చాలా ముఖ్యం. చిప్కో ఉద్యమంలో పాల్గొన్న మహిళలు చెట్లను ఆలింగనం చేసుకున్నది కలప వ్యాపారులు వాటిని నరికివేయకుండా అడ్డుకోవడం కోసం కాదు. ఆ వృక్షాలను నరికివేసే మొదటి హక్కు తమకు మాత్రమే ఉండాలని ఆ మహిళలు కోరుకున్నారు. చిప్కో ఉద్యమం పర్యావరణ పరిరక్షణ ఉద్యమం కాదు. సహజ వనరుల నుంచి స్థానిక జీవనోపాధులను నిర్మించుకునేందుకు జరిగిన అభివృద్ధి ఉద్యమమది.



వాతావరణ మార్పు ఒక తిరుగులేని వాస్తవం. అది సంభవిస్తోంది. దాని పర్యవసానాలు పేదలను, సమస్యకు కారణం కానివారిని మరింతగా దారిద్ర్యంలోకి నెట్టి వేస్తున్నాయి. వారు సొంతంగా అభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు వీలు కల్పించాలి. ఇందుకు పర్యావరణ పరమైన ఆస్తుల– వర్షపు నీరు సంరక్షణ నుంచి మెరుగైన ఆహార వ్యవస్థల దాకా– సృష్టించడం చాలా ముఖ్యం.

నా వృత్తి జీవితం తొలి సంవత్సరాలలో అనీల్ అగర్వాల్ (డౌన్ టు ఎర్త్ పత్రిక సంస్థాపక సంపాదకుడు)తో కలిసి పని చేశాను. ఆయన నాకు ఎన్నో విషయాలు నేర్పారు. హరిత భవిష్యత్తును నిర్మించుకునేందుకు గ్రామస్తులు కలిసికట్టుగా కృషి చేసిన పల్లెలకు వెళ్లాము. ఉత్తమ పద్ధతులలో అడవుల, జలవనరుల నిర్వహణ స్థానిక జన సముదాయాలకు ఎంతగా మేలు చేస్తుందో నేను ప్రత్యక్షంగా చూశాను. అనీల్, నేనూ చెట్ల పరిరక్షణే కాకుండా ప్రజాస్వామిక పద్ధతులను మరింతగా ప్రగాఢం చేసే మార్గాలపై దృష్టి పెట్టాము. తద్వారా ఉమ్మడి సహజ వనరుల (మన దేశంలోఅడవులు చాలావరకు ప్రభుత్వ విభాగాల యాజమాన్యంలో ఉండగా వాటిని ఉపయోగించుకునేది పేదలు, ముఖ్యంగా మహిళలు)కు పునరుజ్జీవనం కల్పించేందుకు ప్రయత్నించాము.

ఈ ప్రారంభం వాతావరణ మార్పు సవాళ్లను అర్థం చేసుకునేందుకు కూడా నాకు సహాయపడింది. అదే కాలంలో ఒక ప్రతిష్ఠాత్మక అమెరికా పరిశోధనా సంస్థ విడుదల చేసిన పర్యావరణ సంబంధిత సమాచారం ప్రభావంతో పేదప్రజలే ఎక్కువగా భూతాపం పెరుగుదలకు కారకులు అవుతున్నారనే అభిప్రాయానికి ఆ నాటి మన పర్యావరణ మంత్రి వచ్చారు. పశుపోషణ, వరిపైరుసాగు మొదలైన కార్యకలాపాలతో వారు భూతాపాన్ని పెంచుతున్నారని ఆయన భావించారు. పర్యావరణ మంత్రి వైఖరికి ఒక కొండ ప్రాంత రాష్ట్ర ముఖ్యమంత్రి కలవరపడ్డారు ప్రజలు పశువులను పెంచుకోవడాన్ని నిరోధించాలని కేంద్రం పంపిన ఒక సర్క్యులర్ విషయమై ఆయన మాతో చర్చించారు. ఇదెలా సాధ్యమని ఆ ముఖ్యమంత్రి ప్రశ్నించారు. పేద ప్రజలు పోషించే పశువులు ప్రపంచ వాతావరణ వ్యవస్థ విచ్ఛిన్నానికి ఎక్కువగా కారణమవుతున్నాయా అని మేమూ నివ్వెరపోయాము. పర్యావరణ విధ్వంసానికి ఎక్కువగా నష్ట పోతున్నది పేద ప్రజలే అని మాకు మా కృషిలో తెలిసివచ్చింది. అయితే ఇప్పుడు వాతావరణ మార్పునకు పూర్తిగా వారే బాధ్యులని ఘనత వహించిన మన పాలకులు ఎలా భావిస్తున్నారు?

ఈ ప్రశ్నతో మేము మా వాతావరణ పరిశోధనా ప్రస్థానాన్ని ప్రారంభించాం. ఒక స్థానిక అటవీ నిర్వహణకు, ప్రపంచ వాతావరణ నిర్వహణకు మధ్య పెద్ద తేడా లేదన్న వాస్తవాన్ని చాలా త్వరగానే గ్రహించాము. స్థానిక అడవి, ప్రపంచ వాతావరణం రెండూ ఉమ్మడి ఆస్తులే. అన్నిటి కంటే ముఖ్యంగా అవసరమైనది ఒక ఆస్తి హక్కుల చట్రం (సహజ వనరులను ఎలా స్వంతం చేసుకోవాలి, ఎలా ఉపయోగించాలో నిర్వచించే చట్టపరమైన, సామాజిక వ్యవస్థ. ఇందులో వ్యక్తులకు ఆస్తిని కలిగి ఉండటానికి, ఉపయోగించడానికి, బదిలీ చేయడానికి హక్కులు ఉంటాయి). ఇది సహకారాన్ని ప్రోత్సహిస్తుంది. పేద ప్రజలు కారణమవుతున్న ఉద్గారాలు (జీవనోపాధి వరి సేద్యం, పశు పోషణ నుంచి), సంపన్నుల విలాస జీవితం మూలంగా సంభవిస్తున్న ఉద్గారాలు (కారుల వినియోగం నుంచి) మధ్య తేడాను పరిగణనలోకి తీసుకోవలిసిన అవసరమున్నది. వాతావరణ మార్పు మానవాళి మనుగడకు ముప్పుగా పరిణమించిందన్న సత్యాన్ని ఇప్పుడు అందరూ గుర్తించారు. వాతావరణ మార్పు ఒక తిరుగులేని వాస్తవం. అది సంభవిస్తోంది. దాని పర్యవసానాలు పేదలను– సమస్యకు కారణం కానివారు– మరింతగా దారిద్ర్యంలోకి నెట్టి వేస్తున్నాయి. అభివృద్ధి అనేది సమానంగా ఉండాలంటే ప్రపంచవ్యాప్తంగా పేదలకు అభివృద్ధి హక్కును నిరాకరించ కూడదు. అభివృద్ధి ఫలాలలో వారికి వాటా కల్పించాలి. వారు సొంతంగా అభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు వీలు కల్పించాలి. ఇందుకు పర్యావరణ పరమైన ఆస్తుల– వర్షపు నీరు సంరక్షణ నుంచి మెరుగైన ఆహార వ్యవస్థల దాకా – సృష్టించడం చాలా ముఖ్యం.

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

బీడ్: శాసిస్తున్న నేర భారతం!

■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ





నేరమయ రాజకీయాలకు వ్యతిరేకంగా జాగృతమవ్వాల్సిన అవసరం ఎంతగా ఉన్నదో మహారాష్ట్రలో ఒక సర్పంచ్ హత్య ఉదంతం మనకు మరోసారి గుర్తు చేసింది. పెట్టుబడులను ఆకర్షించేందుకు మహానగరాలలో ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్స్ నిర్వహిస్తున్న మన ప్రభుత్వాలు తొలుత ప్రతి జిల్లా కేంద్రంలో శాంతి భద్రతల సమావేశాలు నిర్వహించాలి. రాజకీయ ప్రభావ ప్రాబల్యాలు ఎంతగా ఉన్నవారైనా సరే చట్టాలను ఉల్లంఘిస్తే సహించే ప్రసక్తే లేదన్న స్పష్టమైన సందేశాన్ని పంపాలి.

'దిల్‌వాలోంకే దిల్‌కా కరార్ లూట్నే... మై ఆయీ హూ యూపీ, బిహార్ లూట్‌నే.' 1999 నాటి 'షూల్' సినిమా గుర్తుందా? ప్రజలు పాడుకున్న ఆ సినిమా పాటలోని చరణాలవి. హిందీ భాషా ప్రాంతాల హృదయ భూమిలో నేరమయ రాజకీయాలకు రూపకంగా ఆ చరణాలు భాసిల్లాయి.సువిశాల గంగా నదీ మైదాన ప్రాంతాలలోని అనేక ప్రదేశాలలో నేరగాళ్ల–రాజకీయ వేత్తల సంబంధాలు వ్యవస్థీకృతమైన ఆ కాలంలో నేర పూరిత రాజకీయాలను ఆ చరణాలతో హేళన పూర్వకంగా ప్రస్తావించేవారు.

గంగా వాహినిలా నేరమయ రాజకీయాలు ప్రవహిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు అవి యూపీ, బిహార్ లకే పరిమితమయి లేవు. మహారాష్ట్ర బీడ్ జిల్లాలోని ఒక పల్లెలో గ్రామ సర్పంచ్‌ను ఇనప రాడ్‌లతో కొట్టి , చిత్ర హింసలకు గురి చేసి, చివరకు చంపివేసే ముందు నిందితుడు ఆ అభాగ్యుడిపై మూత్ర విసర్జన చేసిన వైనాన్ని సైతం కళ్లకు కట్టించిన వీడియో ఒకటి గత వారంలో వైరల్ అయింది. ఆ భయానక హత్యా అమానుషత్వం ఎలాగో ఒక కెమెరాలో రికార్డు అయింది. జరుగుతున్న దుర్మార్గాన్ని గడ్డప్పగించి చూస్తున్న గ్రామస్తులకు తనకు ఎంత పలుకుబడి ఉన్నదో చెప్పేందుకు ఆ దురాగతానికి పాల్పడినవారు సాహసించారని అనిపిస్తుంది! మహారాష్ట్రను దిగ్భ్రాంతిపరిచిన ఆ నేరంలో ప్రధాన నిందితుడు రాష్ట్ర మంత్రి ధనంజయ్ ముండేకు కీలక సహాయకుడు ! ఇందుకు ఆశ్చర్య పోవలిసిందేమీ లేదు. గత డిసెంబర్‌లో ఆ ఘోర హత్య జరిగింది. దాని తాలూకు వీడియోలు గత వారం మాత్రమే వెలుగులోకి వచ్చాయి. ప్రజలు దిగ్భ్రాంతి చెందారు. నిరసించారు. మంత్రి అంతిమంగా రాజీనామా చేయక తప్పలేదు.

పదవికి రాజీనామాతో, చేసిన పాపం సమసిపోతుందా? బీడ్ లోనేకాదు, దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో రాజకీయాలు ఒక నేరపూరిత కార్యకలాపంగా పరిణమించాయన్న వాస్తవాన్ని మంత్రి రాజీనామా దాచి పెట్టలేదు. ఈ కేసులో నిందితుడు బలవంతపు వసూళ్లకు పాల్పడే నేరస్థుడు. బీడ్ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టిన ముంబైకు చెందిన పవన విద్యుదుత్పాదన కంపెనీ యజమాని నుంచి పెద్ద మొత్తాన్ని రాబట్టుకునేందుకు ప్రయత్నించాడు. అయితే అతని ప్రయత్నానికి ధైర్యవంతుడైన బీడ్ గ్రామ సర్పంచ్ అడ్డుపడ్డాడు. దీంతో తమకు ఎలాంటి అడ్డు లేకుండా ఆ సర్పంచ్‌ను హతమార్చారు. ఒక మంత్రి అండదండలు లేకుండా నిందితులు నిర్భయంగా అటువంటి దుర్మార్గానికి పాల్పడగలరా? మంత్రి వారిని నియంత్రిస్తున్నాడా లేక ఆ ముఠా స్వంత్రంగా వ్యవహరించిందా?

ఘటన పూర్వాపరాలు చూద్దాం. బీడ్ జిల్లా మహారాష్ట్రలోనే కాదు, దేశంలోనే బాగా వెనుక బడిన ప్రాంతాలలో ఒకటి. తరచు కరువు కాటకాలతో సతమతమవుతుండే మరఠ్వాడా ప్రాంతంలో భాగమైన బీడ్, సంపద్వంతమైన దక్షిణ మహారాష్ట్రలోని చెరుకు తోటలు, చక్కెర పరిశ్రమలకు అవసరమైన కూలీలలో 70శాతం మందిని సమకూరుస్తోంది. కోతలు, నూర్పిళ్ల తరుణంలో బీడ్ ప్రాంతానికి చెందిన వ్యవసాయకూలీ కుటుంబాలు వలసపోతుంటాయి. ఆదాయ అవకాశాలు అస్తు బిస్తుగా ఉండడంతో అప్పులు–పేదరికం విష వలయంలో బీడ్ ప్రజలు నిత్యం నలిగిపోతుంటారు. ఆ బాధాకర పరిస్థితి నుంచి విముక్తమవడం వారికి సాధ్యం కావడం లేదు. దీంతో నిరుద్యోగ యువతకు నేర కార్యకలాపాలు డబ్బు ఆర్జనకు ఒక ప్రత్యామ్నాయమై పోయాయి. గత కొద్ది సంవత్సరాలుగా బీడ్ జిల్లాలో అటువంటి రాజకీయ హత్యలు ఎన్నో జరిగాయని ఔరంగాబాద్ కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఒకరు నాకు చెప్పారు.

గత మూడుదశాబ్దాలుగా బీడ్ రాజకీయాలు ముండే కుటుంబం నియంత్రణలో ఉన్నాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నుంచి ప్రభవించిన బీజేపీ నాయకుడు గోపీనాథ్ ముండే బీడ్‌ను తమ కుటుంబానికి కంచుకోటగా చేశారు. రాజకీయంగా శక్తిమంతులు అయిన మరాఠాలతో నేరుగా పోటీ దుతున్న ఓబీసీ సమూహమైన వంజారీ కులానికి చెందిన భూమిపుత్రుడు గోపీనాథ్‌ముండే. మహారాష్ట్రలో బీజేపీ అగ్రనాయకుడు స్వర్గీయ ప్రమోద్ మహాజన్ ఆయన బావమరిది. బీజేపీ ఓబీసీ ముఖంగా ప్రభవించిన గోపీనాథ్ 1995లో బీజేపీ–శివసేన సంకీర్ణ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. 2014లో నరేంద్ర మోదీ మొదటి ప్రభుత్వంలో కూడా ఆయన కేబినెట్ మంత్రిగా నియమితులయ్యారు. దురదృష్టవశాత్తు కేంద్ర మంత్రి అయిన కొద్ది వారాలకే ఒక కారు ప్రమాదంలో గోపీనాథ్ మరణించారు.

ఆయన వారసత్వం కోసం సోదరుని కుమారుడు ధనంజయ్ ముండే, గోపీనాథ్ కుమార్తె పంకజ మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. 49ఏళ్ల ధనంజయ్ బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడుగా పని చేశారు. 2013లో బీజేపీ నుంచి వైదొలిగి ఎన్‌సిపిలో చేరారు. బీడ్ జిల్లాలోని పర్లి నియోజక వర్గంలో పంకజపై పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత పలు వివాదాలకు ధనంజయ్ కేంద్రమయ్యాడు. 2021లో ఒక యువతి ఆయనపై అత్యాచార ఆరోపణ చేసింది. అయితే ఫిర్యాదీదారు సోదరితో తనకు సంబంధాలు ఉన్నాయని, తమకు ఇద్దరు బిడ్డలు కూడా ఉన్నారని ధనంజయ్ ఆ ఆరోపణను కొట్టి వేస్తూ చెప్పాడు. ఆ అత్యాచార ఆరోపణ కోర్టు విచారణలో నిలవలేదు. 2023లో అజిత్ పవార్ వైపు మొగ్గిన ధనంజయ్ మహాయుతి ప్రభుత్వంలో మంత్రి అయ్యాడు. ఇప్పుడు బీడ్‌లో సంభవించిన సర్పంచ్ హత్య ఉదంతంకు సంబంధించిన ఆరోపణలతో ధనంజయ్‌ముండే రాజీనామా చేయడం అనివార్యమయింది. సర్పంచ్ హత్యలో ప్రధాన నిందితుడు వాల్మీక్ కరాడ్ ధనంజయ్ నియోజక వర్గం వ్యవహారాలను చూస్తుండే వ్యక్తి. ఇరువురూ పలు వ్యాపారాలలో భాగస్వాములు కూడా.

ధనంజయ్ ముండే వ్యవహారం, ఒక విధంగా మారుతున్న మహారాష్ట్ర రాజకీయాల తీరుతెన్నులకు ఒక మచ్చుతునక. ఒకప్పుడు సంస్కరణవాద అభినివేశంతో ప్రగతిశీలంగా వర్థిల్లిన మహారాష్ట్ర రాజకీయాలు ఇప్పుడు ఎలాగైనా సరే అధికారాన్ని కైవసం చేసుకోవడమే పరమ లక్ష్యంగా, ఎటువంటి మినహాయింపులకూ తావులేని నైతిక భ్రష్టత్వంతో నడుస్తున్నాయి. కుల తత్వ, అస్తిత్వవాద రాజకీయాల ముసుగులో నగదు, నేరాలు, అవినీతి కలసికట్టుగా ఒక విషపూరిత వాతావరణాన్ని సృష్టించాయి. సైద్ధాంతిక దివాలా కోరుతనంతో నిండిపోయిన ఈ రాజకీయ ఆవరణంలో అధికార లాలస, స్వీయాధిపత్యమే సమస్తమైపోయాయి. సంఘ్ పరివార్ శ్రేణుల నుంచి ప్రభవించిన గోపీనాథ్ ముండే చిత్త శుద్ధితో సంపూర్ణంగా భారతీయ జనతా పార్టీకి నిబద్ధమై ఉండేవారు. పార్టీ నిర్ణయాలను మనసా, వాచా కర్మణా ఔదలదాల్చే వారు. మహారాష్ట్రలోని విలక్షణ రాజకీయ పార్టీ వ్యవస్థను ధ్వంసం చేసిన చీలికల, ఫిరాయింపుల అవకాశవాద రాజకీయాల నుంచి గోపీనాథ్ మేనల్లుడు ధనంజయ్ అపారంగా లబ్ధి పొందారు. మరి ఈ మహాశయుని సన్నిహితులు, అనుయాయులు బహిరంగంగా క్రూర హత్యకు పాల్పడుతూ కూడా తాము చట్టం బారిన పడకుండా తప్పించుకోగలమని విర్రవీగడం పట్ల విస్మయం చెందాల్సిన అవసరమేముంది? పచ్చి స్వార్థం, నైతిక దుర్నీతి రాజకీయమయినప్పుడు ఆమోదయోగ్యం కాని ప్రవర్తనను, అవాంఛనీయమైన తీరు తెన్నులను ఆక్షేపించేదెవరు? ఆక్షేపించగలవారు ఎందరు?

ఈ కారణంగానే బీడ్ లో సంభవించిన 'మహా–నేరం' మహారాష్ట్రకే కాదు, యావద్భారతదేశానికి మరొక మేలుకొలుపు అయితీరాలి. నేరమయ రాజకీయాలతో మనం ఇప్పటికే ఎంతగా హతాశమవుతున్నాం! వాటికి వ్యతిరేకంగా జాగృతమవ్వాలిసిన అవసరం ఎంతగా ఉన్నదో బీడ్ బర్బరత్వం మనకు మరోసారి గుర్తు చేసింది. నేరపూరితమైన రాజకీయాలతో ఒక 'మ్యాగ్నిటిక్ మహారాష్ట్ర'ను లేదా ఒక 'వికసిత భారతం'ను ఎలా నిర్మించుకోగలం? అసాధ్యం. అసంభవం. కనుక వెన్వెంటనే మేల్కోవాలి. సాహసించాలి. అయితే మీడియాలో సమస్తంగా ఉన్న ప్రభుత్వ వందిమాగదులు ఢిల్లీ ప్రభువుల ' 5 ట్రిలియన్ ఎకానమీ' నినాదానికి పరవశించి పోతున్నారు. ఆ ఆశంసాపూర్వక ఐశ్వర్య మెరుపుల మాటున ఉన్న దరిద్రాల మాలిన్యాన్ని కనీసంగా అయినా లోకం దృష్టికి తీసుకువెళ్లడానికి మీడియా మహాశయులు శ్రద్ధ చూపడం లేదు. బీడ్ ఒక ప్రదేశం మాత్రమే కాదు, మన వాస్తవ భారతావనికి అదొక ప్రతీక. కటిక పేదరికం, దిగ్భ్రాంతి గొలిపే నేరాలు, కర్కశ అధికార రాజకీయాలు, చేష్టలుడిగిపోయిన సదా పాలకుల పక్షాన ఉండే పోలీసు యంత్రాంగంతో కునారిల్లుతున్న వెనుకబడిన ప్రాంతం. స్థానిక నేరగాళ్ల ముఠాలు, వారి రాజకీయ బాస్‌లు తమ నిర్ణయాలతో పరిస్థితులను నిర్దేశించే ప్రదేశమది. మరింత స్పష్టంగా చెప్పాలంటే చట్టబద్ధ పాలన బీడుపట్టి పోయిన భూమి అది. ఇటువంటి చట్టబద్ధ పాలనారాహిత్య బీడు భూములు మన విశాల భారతంలో చాలా ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో నిపుణ కార్మికుల, వృత్తి ఉద్యోగుల నేరస్థ చర్యలు అధునాతనంగా ఉంటాయి. అయితే వర్షాభావంతో ఎడారి సీమగా మారిపోయిన బీడ్‌లో పెత్తందారులదే రాజ్యం. వారిమాటే తుది నిర్ణయం. కాదన్నందుకే ఒక గ్రామ సర్పంచ్ భారీ మూల్యం చెల్లించుకున్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు మహానగరాలలో ఇన్వెస్ట్‌మెంట్‌సమ్మిట్స్ నిర్వహిస్తున్న మన ప్రభుత్వాలు తొలుత ప్రతి జిల్లా కేంద్రంలో శాంతి భద్రతల సమావేశాలు నిర్వహించి తీరాలి. చట్టాలను ఉల్లంఘిస్తే ఏ మాత్రం సహించే ప్రసక్తే లేదన్న స్పష్టమైన సందేశాన్ని పంపాలి.

తాజాకలం: ముంబై మెరైన్ డ్రైవ్ లో ఉదయం నడకలో ఉండగా పరిచయస్తుడైన విశ్రాంత ఐపీఎస్ అధికారి ఒకరు ఎదురయ్యారు. బీడ్ లో సంభవించిన దుర్మార్గం పట్ల తానేమీ ఆశ్చర్య పోవడం లేదని అన్నారు. ఎందుకని? గతంలో రాజకీయ వేత్తలు నేరగాళ్లతో సంబంధాలు కలిగి ఉండేవారు. ఇప్పుడు నేరస్థులే రాజకీయాలలోచక్రం తిప్పుతూ అధికారం చెలాయిస్తున్నారని ఆయన సమాధానమిచ్చారు. నిజం కాదూ?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

శ్రుతిమించుతున్న ట్రంపరితనం!



ట్రంప్ ఒకవైపు అమెరికాను అగ్రరాజ్యం అన్న బాధ్యత నుంచి తప్పించదలిచాడు. అదే సమయంలో తన సుంకాల బీభత్సానికి దేశ దేశాలు తలవంచేలా చేయదలిచాడు. కలిసి నడవడం కంటే, ప్రపంచ చుక్కానిగా ఉండడం కంటే, స్వప్రయోజనాలే ప్రధానంగా అడుగులు వేయాలని ట్రంప్ అమెరికా ఆశిస్తున్నది.

ప్రస్తుత ప్రపంచ నియమాల పట్ల తనకు గౌరవం బొత్తిగా లేదని డొనాల్డ్ ట్రంప్ నిర్లజ్జగా చాటి చెపుతున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని చర్చలకు పిలిచి అవి ఫలించకపోడంతో ప్రపంచ మీడియా ముందే అతడిని గెంటివేసిన ట్రంప్ తన అమానవీయతకు హద్దు లేదని స్పష్టం చేశారు. ట్రంప్‌ను నిర్భయంగా నీళ్ల నమలకుండా ఎదుర్కొన్న జకదేకవీరుడనే ఖ్యాతి జెలెన్ స్కీని వరించింది. ఇంకొకవైపు ట్రంప్‌కు దాసోహం చెప్పి వచ్చినట్టుగా ప్రధాని మోదీని ఇండియాలోని కొన్ని వర్గాలు ఖండిస్తున్నాయి.

జో బైడెన్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు అమెరికా పూర్తి అండదండలు ఇచ్చింది. అమెరికా, యూరప్‌లు జెలెన్ స్కీకి సైనిక ఆర్థిక సహాయాన్ని దండిగా అందించాయి. అది ఉక్రెయిన్ – రష్యా యుద్ధంగా కాకుండా రష్యా – అమెరికా కూటమి మధ్య సమరంగా సాగింది. ఇందులో ఉక్రెయిన్ అప్పుడప్పుడూ అక్కడక్కడా కొద్ది విజయాలు సాధించినప్పటికీ మొత్తం మీద రష్యాదే పైచేయి అయింది. ఆంక్షలు రష్యాను ఏమీ చేయలేకపోయాయి. దీనితో ట్రంప్ యుద్ధానికి తెరదించాలని నిర్ణయించాడు. 2022 ఫిబ్రవరిలో మొదలైన ఉక్రెయిన్ యుద్ధం మూడేళ్ల దాటి కొనసాగుతూ వచ్చింది. యుద్ధం వల్ల ఆహారం, ఇంధనం తదితరాల ధరలు పెరిగిపోయి మానవాళి తీవ్ర అశాంతికి గురి అవుతున్నది. అందుచేత ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన యుద్ధవిరమణ ఘట్టాన్ని స్వహస్తాలతో ఆవిష్కరిస్తున్నాడనే ఖ్యాతి ట్రంప్ ఖాతాలో చేరుతున్నది. ఆయన ఉక్రెయిన్ యుద్ధం నుంచి అమెరికా సేనలను ఉపసంహరించారు. రష్యాపై ఆంక్షల ఉపసంహరణకు చర్యలు చేపట్టారు.

ఒకవైపు యుద్ధంలో ఉక్రెయిన్‌కు మద్దతు కొనసాగిస్తామంటూనే అమెరికా మద్దతు లేకపోతే అభాసుపాలు అవుతామని యూరపు దేశాలూ గ్రహించాయి. అవి సొంత రక్షణ బడ్జెట్లను పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. జెలెన్ స్కీతో కలిసి శాంతి ఒప్పందం ముసాయిదాను సిద్ధం చేసి అమెరికా ముందు ఉంచాలని భావిస్తున్నాయి. అయితే ఆ ప్రతిపాదనను ట్రంప్ గాని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గాని అంగీకరిస్తారా? జెలెన్ స్కీ తాము కోల్పోయిన భూభాగాలను తిరిగి తమకు అప్పగించాలని కోరుతాడు. అంతే కాదు, భవిష్యత్తులో ఉక్రెయిన్ భద్రతకు అమెరికా, యూరప్‌లు హామీ ఇవ్వాలని కూడా జెలెన్ స్కీ అర్థిస్తున్నాడు, నాటోలో సభ్యత్వమూ కావాలంటున్నాడు. అందుకు ట్రంప్ నిరాకరించాడు. అందుచేత అది అయ్యే పని కాదు. ఉక్రెయిన్‌కి సభ్యత్వం ఇచ్చి నాటో తన గుమ్మం వద్ద తిష్ట వేసుకోవడం నచ్చకనే పుతిన్ యుద్ధాన్ని మొదలుపెట్టాడు. తాము ఆక్రమించుకున్న 20శాతం ఉక్రెయిన్ భూభాగంలో అరంగుళమైనా ఇచ్చేది లేదని పుతిన్ తెగేసి చెపుతాడు. పుతిన్ తన మాట కాదనడనే ధీమాలో ట్రంప్ ఉన్నాడు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తాజాగా శాంతి చర్చల్లో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నట్టు, భవిష్యత్తులో అమెరికా మద్దతు కోసం అవసరమైన ఒప్పందంపై సంతకం చేయదలచినట్టు తనకు లేఖ రాశాడని ట్రంప్ తాజాగా పార్లమెంటులో ప్రకటించాడు.

ఉక్రెయిన్ యుద్ధానికి తెర దించడానికి ట్రంప్ సిద్ధం చేసుకున్న శాంతి వ్యూహంలో రెండు భాగాలున్నాయి. ఉక్రెయిన్‌లోని అత్యంత అరుదైన ఖనిజాలను తవ్వి తీసుకుపోవడానికి జెలెన్ స్కీ సమ్మతి తీసుకుంటూ ఒప్పందాన్ని కుదుర్చుకోడం అందులో ఒకటి. తాను ఆక్రమించుకున్న ఉక్రెయిన్ భూభాగాల్లోని విలువైన ఖనిజాలను తవ్వి తీయడానికి కూడా అమెరికాను అనుమతిస్తానని పుతిన్ ప్రకటించాడు. ప్రపంచంలో అత్యంత అరుదైన ఖనిజాల్లో 5 శాతం మేరకు ఉక్రెయిన్‌లోనే ఉన్నాయి. ఎలక్ట్రిక్ కార్లు తదితర విద్యుత్ వాహనాల బ్యాటరీల్లో ఉపయోగించే గ్రాఫైట్ నిల్వలు 19 మిలియన్ టన్నుల వరకు ఉన్నాయి. ఇవి భారీగా ఉన్న అయిదు దేశాల్లో ఉక్రెయిన్ ఒకటి. విమానాలు, విద్యుత్ కేంద్రాల వంటి నిర్మాణాల్లో ఉపయోగించే టైటానియం; బ్యాటరీల తయారీలో కీలక ముడిసరకు లిథియం; అణు ఆయుధాలు, రియాక్టర్లలో ఉపయోగించే బెరిల్లియం, యురేనియం నిక్షేపాలు ఉక్రెయిన్‌లో ఉన్నాయి. అణ్వాయుధాలు, విండ్ టర్బైన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తదితర ఆధునిక సాధనాల్లో ఉపయోగించే 17 అపురూప ఖనిజాల నిల్వలు అక్కడ ఉన్నాయి. ఈ ఖనిజాల సంపదలో 75 శాతంతో చైనా ప్రపంచాధిపత్యాన్ని వహించి ఉంది. దానిని దెబ్బతీయడం కోసం ఉక్రెయిన్‌పై ట్రంప్ కన్నేశాడు. వాస్తవానికి రష్యాను జయించడానికి ఉక్రెయిన్‌ను అడ్డం పెట్టుకుని అమెరికా, యూరప్‌లు జెలెన్ స్కీకి సైన్యాన్ని, ఆయుధాలను సరఫరా చేశాయి. వాటిని అప్పుగా ఇవ్వలేదు. కానీ ఇప్పుడు ట్రంప్ దాన్ని అప్పు ఖాతాగా రాసి ఉక్రెయిన్ ఖనిజాలను దోచుకోదలచుకున్నట్టు అర్థమవుతున్నది.

ట్రంప్ హయాంలో అమెరికా ప్రపంచ ప్రజాస్వామ్య గురువు పాత్ర నుంచి తప్పుకుంటున్నదా అన్నది నేటి కీలక ప్రశ్న. అంతర్జాతీయంగా కరడుగట్టిన సామ్రాజ్యవాదిగా, నియంతగా ఉన్నప్పటికీ దేశీయంగా ప్రజాస్వామ్య మర్యాదలు పాటిస్తూ వచ్చిన అమెరికా ఇప్పుడు దానిని కూడా వదులుకుంటున్నది. అక్రమ వలసల పేరుతో విదేశీయులను తరిమేయడం, కనీసావసర ఖర్చుల కోసం క్యాంపస్ బైట చిన్నాచితకా ఉద్యోగాలు చేసుకుంటూ వచ్చిన విదేశీ విద్యార్థులకు ఆ సౌకర్యాన్ని సైతం తొలగించడం ట్రంప్ అమెరికా దిగజారుడుతనాన్ని చాటుతున్నది. ట్రంప్‌ను ఎన్నుకున్న మెజారిటీ ఓటర్లు అమెరికా తన ధనాన్ని అంతర్జాతీయ కర్తవ్యాల కింద దుర్వినియోగం చేస్తున్నదనే ట్రంప్ ప్రచారాన్ని నమ్మి ఆయనకు ఓట్లు వేశారు. ట్రంప్ ఆధిపత్యం తాత్కాలికమే కావచ్చు, అమెరికన్ ఓటర్లలోని తిరోగమన ధోరణి ఒకంతట పోయేది కాదు.

డాలర్ ద్వారా కాకుండా సొంత కరెన్సీలతో విదేశీ వాణిజ్య లావాదేవీలు జరిపితే చూస్తూ ఊరుకోబోమని బ్రిక్స్ (బ్రెజిల్, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) దేశాలను ట్రంప్ బెదిరించాడు. అంటే బలప్రయోగంతో డాలర్ ఆధిపత్యాన్ని కొనసాగింపజేయాలన్నది ట్రంప్ ఆంతర్యంగా బోధపడుతున్నది. ఇండియాతో అమెరికా వాణిజ్య లోటు కేవలం 45 బిలియన్ డాలర్లే. ఈ మాత్రం భాగ్యానికి ఇండియా టారిఫ్‌లు దారుణమైనవని ట్రంప్ భూతద్దంలో చూపిస్తున్నాడు. చైనాతో దానికున్న వాణిజ్య లోటు 300 బిలియన్ డాలర్లు. అమెరికా మొత్తం వాణిజ్య లోటు 1.2 ట్రిలియన్ డాలర్లు. చైనాతో అమెరికాకు గల లోటు అందులో నాలుగో వంతు. ట్రంప్ తన ప్రతీకార సుంకాల విధానంతో ఈ అగ్రరాజ్య మర్యాదను మంచితనాన్ని బూడిదపాలు చేస్తున్నాడు. ట్రంప్‌ను సంతృప్తిపరచడానికి ఇండియా కొన్ని రాయితీలను ప్రకటించింది. ట్రంప్ ఒకవైపు అమెరికాను ప్రపంచ దేశాలకు అగ్రరాజ్యం అన్న బాధ్యత నుంచి తప్పించదలిచాడు. అదే సమయంలో తన సుంకాల బీభత్సానికి దేశ దేశాలు తల వంచేలా చేయదలిచాడు. ట్రంప్ సుంకాలు, వాటికి ప్రతీకార సుంకాలు ధరలను విపరీతంగా పెంచివేస్తాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కమిషన్, పారిస్ వాతావరణ ఒప్పందం వంటి సంస్థల నుంచి అమెరికా మళ్ళీ ఉపసంహరించుకుంటున్నది. అమెరికా భాగస్వామిగా ఉన్న అన్ని అంతర్జాతీయ సంస్థలపై ఆరు నెలల్లో నివేదిక ఇవ్వాలని ట్రంప్ ఆదేశించాడు. కలిసి నడవడం కంటే, ప్రపంచ చుక్కానిగా ఉండడం కంటే జాతీయ ప్రయోజనాలే ప్రధానంగా అడుగులు వేయాలని ట్రంప్ అమెరికా ఆశిస్తున్నది. పాలస్తీనా మీద అమానుష అనైతిక నిప్పుల వర్షం కురిపిస్తూ నిరాయుధులైన అమాయక జనాన్ని ఊచకోత కోస్తున్న ఇజ్రాయెల్‌ను ఎవరైనా వెనకేసుకుని రాగలరా? అటువంటి ఇజ్రాయెల్‌కు వ్యతిరేక వైఖరి తీసుకున్నందుకు, "తన దృష్టిలో" మానవ హక్కులను ఉల్లంఘిస్తున్న దేశాలైన చైనా, వెనెజులా, క్యూబా, సౌదీ అరేబియాలను చేర్చుకున్నందుకు, ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కమిషన్ నుంచి అమెరికా తప్పుకున్నట్టు బోధపడుతున్నది. ట్రంప్ మొదటి పాలన సందర్భంగా 2018లో మొదటిసారి, ఇప్పుడు రెండోసారి ఈ కమిషన్ నుంచి అమెరికా వైదొలగింది. ప్రపంచంలో మానవహక్కుల పరిరక్షణ తన దృష్టి కోణం నుంచి జరగాలని ట్రంప్ కోరుతున్నాడు! స్త్రీ బాల వృద్ధులనే విచక్షణ లేకుండా దాదాపు ఏభై వేల మంది గాజా వాసులను హతమార్చడం ఆయన దృష్టిలో మానవ హక్కుల ఉల్లంఘన కాదు.

ఇంతవరకూ అంతర్జాతీయ సహాయ కార్యక్రమాలకు తమ వంతు వాటా ఇస్తూనే అప్రతిహత ఆధిపత్యాన్ని చలాయించిన అమెరికా ఇప్పుడు దేనికీ పైసా ఇవ్వకుండా రౌడీయిజాన్ని ప్రదర్శించబోతున్నది. తనకున్న అపారమైన సైనిక శక్తితో నియంతృత్వాన్ని అమలు చేయదలచింది. ఇది ట్రంపరితనం! ఐక్యరాజ్య సమితి, ఆరోగ్య సంస్థ వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి అమెరికా తప్పుకున్న మేర దాని స్థానాన్ని చైనా వంటి దేశాలు నెమ్మదిగా భర్తీ చేసే అవకాశాలు లేకపోలేదు. ట్రంప్ దూకుడుకు అడ్డుకట్ట వేయలేక, ఆయనను ఎదిరించనూ లేక ప్రధాని మోదీ అభాసుపాలవుతున్నారు. ట్రంప్‌తో ఇలాగే కలిసి నడిస్తే అంతర్జాతీయంగా మనం మరింత చులకన అయిపోతాము.

• గార శ్రీరామమూర్తి
సీనియర్ పాత్రికేయులు

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శుక్రవారం సా.. 6.31 గం॥
సహర్ : శనివారం ఉ..5.02 గం॥


రంగులు చల్లే పైపులను కొనుగోలు చేస్తున్న చిన్నారులు

హోలీ ఆనందాలు తేవాలి..

- సామగ్రి అమ్మకాలతో మార్కెట్లు కళకళ
- ఫాల్గుణ పౌర్ణమి వేళ ప్రత్యేక పూజలు, హోమాలు

నేడు రంగుల పండుగ
వాడవాడలా కామ దహనాలు

వసంతరుతువు ఆగమనంతో వచ్చే ఆనందాల హోలీ పండుగకు అంతా సిద్ధమయ్యారు. చిన్నపెద్దా తేడా లేకుండా తమ అనుబంధాలను, ఆత్మీయతను, స్నేహాన్ని రంగులలో రంగరించి ఒకరిపై ఒకరు చల్లుకుని తమ జీవితాల్లో ఆనందాన్ని నింపాలని కోరుకోనున్నారు. గురువారం రాత్రి వాడవాడలా కాముడి దహనాలు నిర్వహించి.. శుక్రవారం రంగుల పండుగను జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇక ఫాల్గుణ పౌర్ణమి వేళ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించనున్నారు. అలాగే హోలీ పర్వదినాన్ని సంతోషకరమైన రోజుగా భావించి చిన్నారులకు బహుమానంగా బిస్కెట్లతో తయారు చేసిన మాలలను అందజేస్తారు. ఈ హోలీ పండుగ రంగులు, పూజాసామగ్రి కొనుగోలుతో మార్కెట్లలో సందడి వాతావరణం కనిపించింది.

- వరంగల్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

6

మాయమాటలకు మోసపోవద్దు



ఫోన్‌ఇన్‌లో సందేహాలను నివృత్తి చేస్తున్న సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్

- తెలియని యాప్‌లు, ఫోన్ కాల్స్, లింక్‌లకు స్పందించొద్దు
- సైబర్ క్రైం జరగగానే 1930 కాల్ చేయాలి
- స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు కావాలి
- సైబర్ క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్

7

'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన

నిబంధనలు పాటించని ఆస్పత్రులపై చర్యలు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య హెచ్చరించారు. కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ఆస్పత్రులలో స్పెషల్ డ్రైవ్‌ను గురువారం నిర్వహించారు. రాష్ట్రంలో సిజేరియన్ ఎక్కువ ఉంది కాబట్టి తప్పనిసరిగా ఇండికేషన్స్ ఉన్న కేసులకు మాత్రమే సి సెక్షన్ కాన్పులు చేయాలన్నారు. అనవసరంగా ఇండికేషన్ లేకుండా సి సెక్షన్ కాన్పులు చేస్తే వైద్య అధికారులు కేసు ఆడిట్ చేసి చర్యలు తీసుకుంటారన్నారు. అర్హత లేని డాక్టర్లు అబార్షన్స్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌లకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపైనా చర్యలు తీసుకుంటాని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరి, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మంజుల, డాక్టర్ జమున, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ తనిఖీ

ఉద్యోగులు, పాత్రికేయులు, పెన్షనర్ల వెల్‌నెస్ సెంటర్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య తనిఖీ చేశారు. వారికి అందుతున్న సేవలు, కావాల్సిన సదుపాయాల కల్పన గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రిటైర్ అయిన ఉద్యోగులను ఓపికతో పరీక్షించాలన్నారు. సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.



హస్తంలో.. ఐక్యత సాధ్యమేనా?

ఓరుగల్లు నేతల సఖ్యతపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి



- మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య విభేదాలను రూపుమాపే పనిలో పార్టీ పెద్దలు
- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభావం ఉండొద్దంటూ సీఎం సూచన
- మంత్రి సీతక్క నివాసంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలకు విందు
- పరస్పర కుశల ప్రశ్నలు, పలకరింపులతో సాగిన భేటీ
- ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైన 'విందు రాజకీయం'

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

తొలి నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య సఖ్యత అంతంతమాత్రమేనన్న విషయం అందరికీ తెలిసిందే. ఎమ్మెల్యేలు, మంత్రులు మధ్య విభేదాలు రచ్చకెక్కిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. నేతల మధ్య పెరిగిన ఈ దూరం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతుందనే ఆందోళనలో ఉన్న పార్టీ అధిష్ఠానం.. చొరవ తీసుకుని సఖ్యత కుదిర్చే పనిలో పడింది. ఈ నేపథ్యంలో మంత్రులే చొరవ తీసుకుని ఎమ్మెల్యేలతో కలిసి వెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో సూచించినట్లు సమాచారం. దీంతో మంత్రి సీతక్క ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు హైదరాబాద్‌లో విందు ఇచ్చారు. ఇప్పుడీ విషయం ఓరుగల్లు పాలిటిక్స్‌లో చర్చనీయాంశమైంది. ఇలా ఓరుగల్లు కాంగ్రెస్ నేతల మధ్య ఐక్యత తేవడంపై అధిష్ఠానం దృష్టి పెట్టగా.. నేతల మధ్య ఐక్యతపై కొమ్మాలలో జరుగనున్న జాతర ప్రభ బండ్ల బల ప్రదర్శనతో స్పష్టత రానుందన్న చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో అధిష్ఠానం ప్రయత్నాలు ఫలిస్తాయా? నేతల మధ్య ఐక్యత సాధ్యమవుతుందా? అన్న ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది.

మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలు..

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కొండా సురేఖ, సీతక్కలకు మంత్రులుగా అవకాశం లభించింది. వీరితో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రిగా నియమించారు. అయితే మొదటి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య గ్యాప్ తీవ్రంగా ఉంది. మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మధ్య రాజకీయ వైరం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. అంతేకాకుండా నామినేటెడ్ పదవుల విషయంలోనూ మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య వైరం ఏఐసీసీ వరకు వెళ్లింది. భద్రకాళి చెరువు పూడికతీత విషయంలోనూ ఓ మంత్రితో కొంతమంది ఎమ్మెల్యేలకు దూరం పెరిగిందనే టాక్ వినిపించింది. చివరకు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒకరికి పదవి రాకుండా మరోకరు అధిష్ఠానం వద్ద ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వినిపించాయి. మొత్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య గ్యాప్ తీవ్రంగా ఉందనే విషయాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

ఎన్నికల్లో ప్రభావంపై ఆందోళన

ఉమ్మడి జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య పెరుగుతున్న దూరం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం పడే ఛాన్స్ ఉందని కాంగ్రెస్ అధిష్ఠానంతో పాటు శ్రేణులు కూడా ఆందోళనలో ఉన్నాయి. వరంగల్‌కు టెక్స్‌టైల్ పార్కు, ఐటీ సెక్టార్, ఎయిర్‌పోర్టు, భూగర్భ డ్రెయినేజీ తదితర వాటితో వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తుంటే.. నేతల మధ్య వచ్చిన గ్యాప్ క్యాడర్‌ను అయోమయానికి గురి చేస్తుందని అధిష్ఠానం భావిస్తోంది. టీపీసీసీలో పదవులతో పాటు

మిగతా 7వ పేజీలో...

కొమ్మాలలో బలప్రదర్శనకు రెడీ

కాంగ్రెస్‌లో ఐక్యతకు శుక్రవారం వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగే కొమ్మాల జాతరలో తేలనుందనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అనుచరులు ప్రభబండ్లు ఏర్పాటు చేస్తుండగా, వారికి దీటుగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ అనుచరులు భారీ ఎత్తున ప్రభబండ్లతో బలప్రదర్శనకు సిద్ధమవుతున్నారనే చర్చ ఉంది. రేవూరి వర్గం నుంచి కొందరు కీలక నేతలు కొండా వర్గంలో చేరటంతో రెండు వర్గాల మధ్య వార్ ము దురుతోంది. దీంతో బందోబస్తుకు 500మందికి పైగా పోలీసులను మోహరించారు. ఇక్కడే జరిగే ప్రభబండ్ల ప్రదర్శన కాంగ్రెస్‌లో నేతల ఐక్యతపై ప్రభావం పడనుందనే చర్చ జరుగుతోంది.


బిషప్‌కు స్వాగతం పలుకుతున్న క్రైస్తవులు

ప్రపంచ శాంతికి ప్రతీ ఒక్కరు ప్రార్థించాలి

- క్రైస్తవులు ప్రార్థనా జీవితం గడపాలి
- వరంగల్ బిషప్ డాక్టర్ ఉడుమల బాల
- ముగిసిన ఫాతిమామాత మహోత్సవం
- భారీగా హాజరైన క్రైస్తవులు

7

దశదిన కర్మకు వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్ల మృతి
- ఐనపల్లి వద్ద టైరు పగిలి పల్టీ కొట్టిన కారు


యశోద (ఫైల్)


మాణిక్యమ్మ(ఫైల్)

ఖానాపురం/ఖిలా వరంగల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కారు టైరు పగిలి పల్టీ కొట్టడంతో ఇద్దరు వృద్ధురాళ్లు మృతి చెందారు. ఈ సంఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని బుధరావుపేట శివారు ఐనపల్లి పెట్రోలు బంకు వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రఘుపతి, బాధితుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా ఖిలావరంగల్ 37వ డివిజన్ తూర్పుకోట ప్రాంతానికి చెందిన అక్కాచెల్లెల్లు ఏసీరెడ్డి యశోద(80), బొలుగొడ్డు మాణిక్యమ్మ(78)లు వారి పిల్లలతో కలిసి మహబూబాబాద్ జిల్లాలోని కురవిలోని తమ బంధువు దశదిన కర్మకాండలకు కారులో వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో ఐనపల్లి శివారులోని హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద 365జాతీయ రహదారిపై కారు ముందు టైరు పగలిపోవడంతో అదుపు తప్పి కుడివైపునకు దూసుకెళ్లిన కారు పల్టీ కొట్టింది. దీంతో కారులో వెనుక సీటులో ఉన్న యశోద, మాణిక్యమ్మలు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. యశోద కుమారుడు రమేష్ కారు నడుపుతుండగా, మాణిక్యమ్మ కుమారుడు హరీష్, కూతురు అనితలు కారులోనే ఉన్నారు. స్వల్పగాయాలతో బయటపడ్డారు. రమేష్, హరీష్‌లు ఖిలావరంగల్‌లోనే ఉంటూ వ్యవసాయం, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. మృతురాలు యశోదకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మాణిక్యమ్మకు సైతం ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఖిలావరంగల్ తూర్పుకోటకు చెందిన బొలుగోడ్డు మాణిక్యమ్మకు భర్త మోహన్ గతంలో మృతి చెందారు.

మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. అలాగే ఏసీరెడ్డి యశోదకు భర్త జనార్ధన్‌తో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. దీంతో ఖిలావరంగల్ తూర్పుకోటలోని మృతుల కుటుంబసభ్యుల రోదనలతో వారి ఇళ్లలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వార్షిక పరీక్షలలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్, 10వ తరగతి వార్షిక పరీక్షలలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల(ధర్మసాగర్)ను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గురువారం సందర్శించారు. ఇంటర్మీడియట్, 10వ తరగతి పరీక్షలు ఎలా రాస్తున్నారు? నీట్, ఎంసెట్‌లకు దరఖాస్తులు చేశారా? అని కలెక్టర్ ఈ సందర్భంగా విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. 8, 9వ తరగతి విద్యార్థినులతో కలెక్టర్ కొద్దిసేపు మాట్లాడారు. వార్షిక పరీక్షల సన్నద్ధత గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాన్ని సందర్శించి అందులో ఉన్న వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాల గురించి తెలుసుకున్నారు. ఎంసెట్, నీట్ పరీక్షల పుస్తకాలను కళాశాల విద్యార్థినులకు కలెక్టర్ అందజేశారు. వంట గది, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేశారు. విద్యార్థినులకు వండిన భోజనాన్ని, కూరలను తనిఖీ చేశారు. అనంతరం 10వ తరగతి విద్యార్థినులకు కలెక్టర్ ప్రావీణ్య పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, ఇతర పరీక్షా సామగ్రి అందజేశారు. 10వ తరగతి పరీక్షల హాల్‌టికెట్లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ హోలీ శుభాకంక్షలు

జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య హోలీ శుభాకాంక్షలు తెలిపారు. రాగద్వేషాలకు అతీతంగా అందరినీ ఒక్కచోట చేర్చే ఈ హోలీ వేడుక ప్రజలందరి జీవితాలలో సంతోషపు వెలుగులు నింపాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. సహజ రంగులను వినియోగిస్తూ సంప్రదాయబద్ధంగా గురువారం హోలీ నిర్వహించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు.



సీపీని కలిసిన కలెక్టర్

వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన సన్‌ప్రీత్‌సింగ్‌ను గురువారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీని కలిసిన కలెక్టర్ ప్రావీణ్య పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

భర్త హత్యకు భార్య సుపారీ

- రెండేళ్లుగా విడిగా ఉంటున్న భార్యాభర్తలు
- కోపంతో భర్తను చంపించేందుకు ప్లాన్
- భార్యతో పాటు నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

7

హోలీ.. ఆనందాలు తేవాలి


పిన్నవారి వీధిలో హోలీ సామగ్రి కొనుగోలు చేస్తున్న పట్టణ వాసులు


వరంగల్ చౌరస్తాలో రంగులు విక్రయిస్తున్న దృశ్యం


రంగులు చల్లుకొనే వివిధ రకాల పైప్‌ట్యూబ్‌లు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న బిస్కెట్ల దండలు

నేడు రంగుల పండుగ
సామగ్రి అమ్మకాలతో మార్కెట్లు కళకళ
ఫాల్గుణ పౌర్ణమి వేళ ప్రత్యేక పూజలు, హోమాలు
వాడవాడలా కామ దహనాలు

వరంగల్ కల్చరల్/జనగామ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రంగుల పండుగకు అంతా సిద్ధమయ్యారు. కేరింతలు కొడుతూ తమ జీవితాల్లో ఆనందాలు తేవాలి అని కోరుకుంటూ వయసు తారతమ్యం లేకుండా ఫాల్గుణ మాసం పౌర్ణమి రోజున ఉమ్మడి జిల్లా వాసులు హోలీ పండుగను జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేసు కున్నారు. వయసుతో తారతమ్యం లేకుండా వివిధ రకాల రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ సంబరాలు చేసుకోనున్నారు. ఇక హోలీ ముందు రోజున కామ దహనం కార్యక్రమాన్ని నిర్వహించడం సంప్రదాయబద్ధంగా వస్తోంది. గురువారం సాయంత్రం నగరంలో కామ దహనాన్ని పలు సెంటర్లలో నిర్వహించారు. కట్టెలన్నీ ఒక చోట వేసి అందులో పిడకలు, కర్పూరం, నెయ్యి లాంటి పదార్థాలను వేసి అగ్నిని వెలిగించి అగ్ని చుట్టూరా నీళ్లను పోస్తూ ప్రదక్షిణ చేసి నమస్కరిస్తారు. కామ దహనాన్ని రామన్నపేటలోని మోక్షారామం అమ్మ ఒడి వద్ద, రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద, చమన్, పిన్నవారి వీధి, అండర్‌బ్రిడ్జి, గిర్మాజీపేట, లక్ష్మీటాకీస్, కాశిబుగ్గ, కరీమాబాద్, శివనగర్, రంగశాయిపేట, ఓసిటీ, దేశాయిపేట, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో కామ దహనాలు నిర్వహించారు.


రంగులు చల్లే పైపులను కొనుగోలు చేస్తున్న చిన్నారులు

పురాణం

ఫాల్గుణ పౌర్ణమిని హోలీ పర్వదినంగా నిర్వహిస్తారు. ఈ హోలీ పర్వదినం రోజున పురాణాల కాలం నుంచి పలు కథనాలు వాడుకలో ఉన్నాయి. క్షీరసాగర మథనంలో ఫాల్గుణ పౌర్ణమి రోజున మహాలక్ష్మి ఉద్భవించిందని హిరణ్యకషపుడు తన కూతురు హోలీకాదేవి కుమారుడు ప్రహ్లాదుడిని విష్ణుదేవుడిని పూజించకుండా అగ్ని ప్రవేశం చేయాలని ఆదేశించగా అగ్ని నుంచి ప్రహ్లాదుడు బయటకు రావడం హోలీకాదేవి ఆహుతి కాగా అప్పటి నుంచి రంగులు చల్లుకునే సంప్రదాయం ప్రారంభమైనట్లు చెబుతారు. రాధాదేవికి రంగులు పూయాలని కృష్ణుడికి యశోదాదేవి తెలపడంతో ఫాల్గుణ పౌర్ణమి రోజున రాధాకృష్ణుడు రంగులు చల్లుకొని వసంతోత్సవం నిర్వహించుకుంటారు. అప్పటి నుంచి హోలీ రోజున ఉత్సవాలను జరుపుతున్నట్లు ప్రతీతి.


వసంతోత్సవాలు, డోలోత్సవాలు

హోలీ సందర్భంగా పలు దేవాలయాల్లో వసంతోత్సవాలు, డోలోత్సవాలు అనగా రంగులను దేవ తామూర్తులకు చల్లే పూజా కార్యక్రమం హోమాలు నిర్వహించడం చేస్తారు. అలాగే హోలీ పర్వ దినం రోజున సంతోషకరమైన రోజుగా భావించి తమ ఇంట్లోని చిన్నారులకు కుటుంబ సభ్యుల్లో ఉన్న చిన్నారులకు బహుమానంగా సంతో షంతో బిస్కెట్లతో తయా రు చేసిన మాలలను అందిస్తారు.

రంగుల అమ్మకాలు

హోలీ పండుగ సందర్భంగా రంగులు అమ్మే దుకాణాలు పెద్ద సంఖ్యలో వెలిశాయి. రెండు రోజుల నుంచి నగరంలో, జిల్లాలోని మండల కేంద్రాల్లో రంగుల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. వరంగల్ నగరంలోని బట్టల బజార్, చౌరస్తా, పిన్నవారి వీధి, స్టేషన్‌రోడ్డు, పోస్టాఫీస్ సెంటర్, కాశిబుగ్గ, చమన్, పోచమ్మమైదాన్, అండర్‌బ్రిడ్జి, రంగశాయిపేట, కరీమాబాద్ తదితర ప్రాంతాల్లో రంగులు అమ్మే దుకాణాలు వెలిశాయి.

రాయపర్తి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : హోలీ అంటేనే ఆనందాల పండుగ. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ రంగుల్లో మునిగి తేలుతుంటారు. అయితే నాటి తరం జరుపుకున్న వేడుకలకు, నేటి తరం యువత చేసుకుంటున్న సంబరాలకు పోలికే లేకుండా పోయింది. గతంలో సహజ రంగులతో ఎంతో హుందాగా జరుపుకుంటే, నేడు రసాయనాలతో తయారు చేసిన రంగులు పూసుకుంటున్నారు. అప్పట్లో మోదుగు, తంగేడు, గోరింటాకు, వివిధ రకాల పండ్లతో రంగులు తయారు చేసుకునే వారు. అనంతరం స్నానం చేస్తే ఆ రంగులు పోయి శరీరం తాజాగా ఉండేది. ఇక హోలీ పండుగకు గోగుపూలకు విడదీయలేని బంధం ఉంది. గతంలో హోలీ వస్తుందంటే వారం రోజుల ముందుగానే పిల్లలు, యువకులు గోగుపూవులు తీసుకువచ్చి నీటిలో నానబెట్టేవారు. తర్వాత ఉడకబెటిడితే వచ్చే రంగు నీళ్లను సీసాల్లో, డబ్బాల్లో నింపుకుని హోలీ ఆడేవారు. ఈ సహజ సిద్ధ రంగు నీళ్లతో ఎలాంటి రోగాలు వచ్చేవి కావు. ఇప్పుడవన్నీ అంతరించిపోయాయి. రసాయన మిశ్రిత రంగుల వాడకం పెరిగింది. ప్రస్తుతం వాడుతున్న రంగుల్లో ప్రమాదకరమైన క్రోమియం, అల్యూమినియం, మెర్క్యురీ ఆక్సైడ్ లాంటివి ఉంటుండంతో పలు రకాల ఆరోగ్య, చర్మ సమస్యలు వస్తున్నాయి. ఈ క్రమంలో సురక్షిత రంగులతో ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా సంబరాలు చేసుకోవాలంటే పలు రకాల పూలు, పండ్లతో ఇళ్లలోనే సహజ సిద్ధమైన రంగులు తయారు చేసుకోవచ్చు. వీటితో చర్మానికి మేలు కలగడతో పాటు ఆరోగ్యంగా ఉంటారని పర్యావరణ వేత్తలు, వైద్యనిపుణులు చెబుతున్నారు. ఎర్ర గులాబీ, మందారం పూలు, ఎర్ర చందనం, టమాటా గుజ్జు, కార్యరెట్, బీట్‌రూట్‌తో ఎరువుపు రంగు తయారవుతుంది. అచ్చమైన పసుపు పొడి, తంగేడు, రేల, బంతి, చామంతి, తుమ్మ పూలతో పసుపు రంగు ద్రావకం సిద్ధమవుతుంది. వేసవిలో విరివిగా లభించే మోదుగ పూలతో కాషాయ రంగు తయారు చేయవచ్చు. ఎండిన గోరింటాకు పొడి లేదా పచ్చి గోరింటాకు, పాలకూర, పుదీనా, కొత్తిమీర లాంటి ఆకుకూరలతో ఆకుపచ్చ రంగు నీరు చేసుకోవచ్చు.


మోదుగు పూల చెట్టు

సహజ రంగులతోనే సురక్షితం

- రసాయన రంగులతో అనారోగ్య సమస్యలు
- కాలంతో పాటు మారుతున్న సంప్రదాయాలు

కృత్రిమ రంగులతో ఆరోగ్య సమస్యలు

డాక్టర్ రవీంద్ర నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో



హోలీ వేడుకల్లో కృత్రిమ రంగులు వాడడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఆ రంగులు కళ్లలలో పడితే కంటి వాపు, మసక బారిపోవడం లాంటి సమస్యలు వస్తాయి. ఇక చర్మంపై పడితే పొడి బారడం, దురదలు వచ్చే ప్రమాదం ఉంది. ముక్కు, నోటి ద్వారా శరీరంలోకి వెళ్తే శ్వాస, జీర్ణ సమస్యలు వస్తాయని, హోలీలో సహజ రంగులనే వాడడం మంచిది.

సహజ రంగులనే వాడాలి

రావుల భాస్కర్ రావు, పర్యావరణ వేత్త



హోలీకి సహజ రంగులనే వాడాలి. మార్కెట్‌లో లభిస్తున్న రంగుల్లో రసాయనాలు కలుస్తున్నాయి. ఇవి కళ్లలో పడితే కంటి చూపునకే ప్రమాదం. అందుకే హోలీలో సహజ రంగులు వాడాలి. కండ్లకు అద్దాలు ధరించాలి. కళ్లల్లో రంగు పడితే వెంటనే కడుక్కోవాలి. ఇబ్బందిగా మారితే వైద్యుడిని సంప్రదించాలి. దీనికి తోడు శరీరంపై రసాయనిక రంగులు చల్లుకోవడం వలన చర్మం పై దద్దుర్లు ఏర్పడడం, దురద వంటి సమస్యలు ఎక్కువగా వస్తాయి.

సంప్రదాయ పద్ధతుల్లో

హోలీ జరుపుకోవాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ పద్ధతుల్లో హోలీ జరుపుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. హోలీ నేపథ్యంలో ప్రజలకు సీపీ సలహాలు, సూచనలు చేశారు. సహజ రంగులను వినియోగించి ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడపొద్దని, హోలీ అనంతరం యువత స్నానాల కోసం శివారు ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దని, వెళ్లాల్సి వస్తే తగు జాగ్రత్తలతో వెళ్లాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో అనుమతులు లేకుండా మహిళలు, ఇతర వ్యక్తులపై రంగులు చల్లడం, బైకులు, కార్లపై గుంపులుగా తిరుగుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హోలీ ప్రశాంతంగా జరుపుకునేందుకు కమిషనరేట్‌లో ముమ్మర పెట్రోలింగ్ ఉంటుందని, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై ప్రత్యేక దృష్టి ఉంటుందన్నారు.

వాగ్దేవిలో ముగిసిన వర్క్‌షాపు


ప్రొఫెసర్లతో విద్యార్థులు

హనుమకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని సరైన దిశలో ఉపయోగిస్తే గొప్పవాళ్లుగా తయారవుతారని ఐఐసీటీ ప్రొఫెసర్ రాజిరెడ్డి అన్నారు. జాయింట్ ఇండియన్ అకాడమీ సైన్సెస్ ఈ నెల, 12, 13 తేదీల్లో 'జీవ రసాయన, సంశ్లేషణ, ఔషధ రసాయన శాస్త్రం, అండ్ స్పెక్ట్రల్ విశ్లేషణలో తాజా పురోగతులు' అనే అంశంపై అకాడమీ లెక్చర్ వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం నిర్వహించగా, ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సమకాలీన శాస్త్రీయ పురోగతాలపై మార్చి 12న యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ రామాచారి, ఐఐసీటీ ప్రొఫెసర్ రవి శంకర్, మార్చి 13న జరిగిన సెషన్‌లో వర్క్‌షాపు కన్వీనర్ ఐఐసీటీ ప్రొఫెసర్ రాజిరెడ్డి, హైదరాబాద్ బిట్స్ ప్రొఫెసర్ మహిపాల్ రెడ్డి ప్రసంగించారు. ముగింపు సమావేశంలో కేయూ బీఓఎస్ చైర్‌పర్సన్ సబితా జ్యోత్స్న, కేయూ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మమత, కళాశాల సంస్థాపకుడు డాక్టర్ సీహెచ్ దేవేందర్ రెడ్డి, డాక్టర్ సీహెచ్ వాహినీ దేవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శేషాచలరం, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హరేందర్‌రెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రసాయన శాస్త్ర విభాగం అధిపతులు గోవిందరావు, రజిత, రసాయన అధ్యాపకులు ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, లైఫ్ సైన్సెస్ డీన్ డాక్టర్ విక్రం తదితరులు పాల్గొన్నారు.

కొత్త పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయండి

డీజీపీని కోరిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


డీజీపీకి లేఖను అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కొత్త పోలీస్‌స్టేషన్‌లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర డీజీపీ జితేందర్‌రెడ్డిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో డీజీపీని ఎమ్మెల్యే నాయిని కలిసి కొత్త పోలీస్‌స్టేషన్‌ల అవసరాన్ని వివరించి లేఖను అందజేశారు. నియోజకవర్గ పరిధిలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా ప్రజల భద్రత కోసం వడ్డెపల్లి, న్యూశాయంపేట ప్రాంతాల్లో పోలీస్‌స్టేషన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ ప్రజా రవాణా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కేయూ పీఎస్ పరిధిలో ట్రాఫిక్ పీఎస్‌లు ఏర్పాటు కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలని డీజీపీకి అందించిన లేఖలో కోరారు. కమిషనరేట్ పరిధిలో నూతన పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని డీజీపీకి నాయిని వివరించారు.

మహిళపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాస్

చెన్నారావుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన వింతంతువు మహిళపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు నెక్కొండ సీఐ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన ఆకుల అశోక్ బుధవారం ఉదయం ఓ మహిళ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో మహిళ తీవ్ర మనస్తాపంతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు మహిళను నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. నిందితుడు గ్రామం నుంచి పరారయ్యాడు. గురువారం అమీనాబాద్ గ్రామశివారులో నిందితుడు తిరుగుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. మహిళ బంధువుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి కోర్టులో రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేష్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీకేఎం ఆస్పత్రి ఆర్‌ఎంవోగా మురళి



గిర్మాజీపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్‌గా (ఆర్‌ఎంవో) డాక్టర్ కె.మురళి బుధవారం సాయంత్రం విధుల్లో చేరారు. గురువారం ఆయన ఆస్పత్రి ఇన్‌పేషంట్ వార్డులు, రిజిస్ట్రేషన్ కౌంటర్, లేబర్ రూం ప్రాంగణం, అవుట్‌పేషంట్ బ్లాక్‌ను సందర్శించి రోగుల వైద్య సేవల్లో నిర్లక్ష్యం ఉండరాదని సూచించారు. వైద్యులు, అన్ని రకాల సిబ్బంది సమయపాలన పాటించాలని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా, గత జూలై నుంచి ఆస్పత్రి ఆర్‌ఎంవో పోస్టు ఖాళీగా ఉండటంతో పాలనా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటాన్ని ఆస్పత్రి సందర్శనలో గమనించిన కలెక్టర్.. ఎంజీఎం ఆర్‌ఎంవోగా పనిచేసిన డాక్టర్ కె.మురళిని సీకేఎం ఆస్పత్రికి నియమించినట్లు తెలిసింది. గురువారం వైద్యులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ భవన నమూనా


జఫర్‌గఢ్‌లో స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్యే శ్రీహరి (ఫైల్)

సమీకృత గురుకులం.. విద్యా ప్రగతికి సోపానం

సందర్భం

- కార్పొరేట్, అంతర్జాతీయ స్థాయి విద్య
- ఐదు నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమం
- స్కూల్ భవనాల నిర్మాణానికి రూ.200 కోట్లు
- జఫర్‌గఢ్ మండలంలో గురుకులం ఏర్పాటు
- 16న స్కూల్ నిర్మాణానికి సీఎం రేవంత్ శంకుస్థాపన

జఫర్‌గడ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోంది. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సామాజిక అంతరాలు లేని అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్న సదాశయంతో ప్రభుత్వం రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున తొలి విడత 55 చోట్ల ఏర్పాటుకు యంగ్ ఇండియాఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. ఇందులో భాగంగా జనగామ జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి మంజూరైన ఈ సమీకృత గురుకులాన్ని ఆధునాతన వసతులు, అన్ని రకాలైన మౌలిక సదుపాయాలతో జఫర్‌గడ్ మండలంలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గురుకుల పాఠశాలకు రూ.200 కోట్లు పరిపాలనా అనుమతులతో నిధులు మంజూరు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 16న సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గ పర్యటన సందర్భంగా స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

జఫర్‌గడ్ మండలంలో ఏర్పాటు..

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను జఫర్‌గడ్ మండలంలో నిర్మించనున్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ చూపి పాఠశాలను స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏర్పాటుకు విశేష కృషి చేశారు. 2,560 మంది విద్యార్థులు ఒకే చోట చదువుకునేందుకు వీలుగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాన్ని జఫర్‌గడ్ మండలం తిమ్మంపేట- జఫర్‌గడ్ ప్రధాన రహదారి పక్కన గల కోనాయిచలం పరిధిలోని 21ఎకరాల సువిశాల ప్రభుత్వ స్థలంలో నిర్మించనున్నారు.

5 నుంచి ఇంటర్ వరకు..

ఈ సమీకృత గురుకులంలో అన్ని వర్గాలకు ఒకే చోట ప్రవేశాలు కల్పిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ ప్రతీ ఒక్కరు 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవచ్చు. వీరికి ఉచిత వసతితో పాటు నాణ్యమైన భోజనం అందిస్తారు. అయితే వీటిలో ప్రవేశాలు పోటీ పరీక్ష ద్వారానా.. లేక దరఖాస్తు చేసుకుంటే ప్రవేశాలు కల్పిస్తారా..? అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని అధికారులు చెబుతున్నారు. సమీకృత పాఠశాల అందుబాటులోకి వస్తే పేద విద్యార్థుల వసతి కష్టాలు దూరమవుతాయి.

క్రీడలు, కళలకు ప్రాధాన్యం..

గురుకులంలో ఇన్నోవేటివ్ బోధనా విధానం ఉంటుంది. సహజ సిద్ధంగా వెలుతురు వచ్చేలా భవనాలను నిర్మిస్తారు. గ్రీన్ క్యాంపస్, సోలార్, విండ్ ఎనర్జీ సదుపాయాలు కల్పిస్తారు. దివ్యాంగులకు అనుకూలమైన సౌకర్యాల కల్పనతో పాటు వర్షపు నీటి సంరక్షణ, సాంస్కృతిక, విద్యా కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రత్యేక ఆడిటోరియం నిర్మించ నున్నారు. క్యాంపస్‌లో చదువుతోపాటు క్రీడలు, కళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తరగతి గదులు, ల్యాబొరేటరీలు కాకుండా కంప్యూటర్ సెంటర్, గ్రంథాలయం, ఆడిటోరియం, ఇండోర్ స్పోర్ట్స్, క్రికెట్, ఫుట్‌బాల్ మైదానాలు, బాస్కెట్ బాల్, వాలీబాల్, టెన్నీస్ కోర్టులు, ఔట్‌డోర్ జిమ్, థియేటర్, ల్యాండ్ స్కేప్ కోర్టులు వంటి సౌకర్యాలు ఉండనున్నాయి.

ప్రత్యేకతలు ఇవే..

- ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల సొసైటీలకు చెందిన నాలుగు పాఠశాలలు ఈ భవనంలో ఉంటాయి.
- ఒక్కో పాఠశాలలో 640 మంది విద్యార్థులు
- ప్రతీ పాఠశాలలకు వేరు వేరు బ్లాక్‌లు.
- ప్రతీ పాఠశాలలో 30మంది చొప్పున ఉపాధ్యాయులు
- గ్రంథాలయంలో 5వేల పుస్తకాలు, కంప్యూటర్ కేంద్రంలో 60 కంప్యూటర్లు అందుబాటులో ఉంటాయి.
- అన్ని తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఉంటాయి.
- 900 మంది ఒకేసారి కూర్చుని భోజనం చేసేలా డైనింగ్ హాలు
- ఇష్టమైన రంగాల్లో రాణించేలా శిక్షణ. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా బోధన. విద్యార్థులను చదువుల యంత్రం మాదిరిగా కాకుండా వివేకవంతులుగా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠాలు. విద్యార్థుల అభిరుచికి తగ్గట్టుగా ఇష్టమైన రంగంలో రాణించేలా శిక్షణ ఇచ్చేలా పాఠశాలలను అభివృద్ధి చేయనున్నారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు ద్వారా పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందుతుంది. నియోజకవర్గానికి మంజూరైన ఈ రెసిడెన్షియల్ పాఠశాలను ఆధునాతన వసతి సౌకర్యాలతో జఫర్‌గడ్ మండలం కోనాయిచలం పరిధిలో విశాలమైన స్థలంలో నిర్మించడం జరుగుతుంది. ఈ మేరకు ప్రభుత్వం రూ.200 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నా. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు అనేది విప్లవాత్మకమైన నిర్ణయం. పేద విద్యార్థులకు ఓ వరం. 16న సీఎం శంకుస్థాపన చేస్తారు.

ఆల్ ఇన్ వన్.. అల్లాపురం

» రంగుల ప్రపంచంలో వరంగల్ కుర్రాడి ప్రతిభ
» నటుడిగానే కాకుండా పలు విభాగాల్లో రాణిస్తున్న దామోదర్
» కథా, పాటల రచయితగానూ సత్తా
» ఏడీఆర్ ఫిలిం ఫ్యాక్టరీతో ఔత్సాహికులకు నటనలో శిక్షణ


'రైతన్న మేలుకో' షూటింగ్ స్టిల్ (ఫైల్)

వరంగల్ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కళలకు పుట్టినిల్లు.. కాకతీయులు ఏలిన వరంగల్ గడ్డపై పుట్టిన అల్లాపురం దామోదర్ రంగుల ప్రపంచంలో ప్రతిభ చాటుతున్నారు. ఆరోతరగతి చదువుతున్నపుడే 'ఆడది అబలకాదు.. జగతికే మూలమైన ఆదిపరాశక్తిరా..' అంటూ రాసిన కవితతో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల ప్రశంసలు అందుకున్న దామోదర్‌ను.. సరదాగా రాసిన కవితలు, పాడిన పాటలు రచయితగా, గాయకుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, నటుడిగా వెండి, బుల్లి తెరపై కళామతల్లి ఒడిలో కూర్చోబెట్టాయి. స్వశక్తితో వెండి తెరకు పరిచయమై ఓ వెలుగు వెలుగుతున్న వరంగల్ కళాకారుల జాబితాలో దామోదర్ కూడా స్థానం సంపాదించుకున్నారు. ప్రస్తుతం దామోదర్ ఓదెల 2, హస్తినాపురం సినిమాల్లో నటిస్తున్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు దంపతులు అల్లాపురం రాజయ్య, కనుకబాయికి మూడో సంతానంగా 1977లో జన్మించిన దామోదర్.. డిగ్రీ వరకు చదివారు. 1999లో తాను రాసిన పాటలు పదిమందికి తెలియాలనే ఉద్దేశంతో సొంత డబ్బులతో గాయకులు దీకొండ సారంగపాణి, అశోక్, సునిత ఆలపించిన ప్రేమాంజలి ఆడియో క్యాసెట్‌తో తనకళామయ జీవితానికి శ్రీకారం చుట్టారు. ఆ తరువాత పాటలు రాయడం, సినిమా, షార్ట్ ఫిలిమ్స్‌కు కథలు అందించడం, స్ర్కీన్‌ప్లే, నటిచడం, నిర్మాతగా, దర్శకుడిగా సినిమాలు, షార్ట్‌ఫిలిమ్స్ రూపొందించారు. అలాగే పాన్ ఇండియా సినిమా లాగానే 'అనుకున్నానే ఆనాడు' అనే పాటను తెలుగులో రాసి.. ఆ తర్వాత దానిని కన్నడ,తవిళ్, మళయాళం, హిందీ, మరాఠీ, బంజారా ఏడు భాషల్లో రాయించి వీడియో చిత్రీకించి చేసి విడుదల చేశారు.


హీరో విజయ్ దేవరకొండతో దామోదర్

యూట్యూబ్‌లో ఆదరణ

నటుడిగా, కథకుడిగా, పాటల రచయితగా, స్ర్కీన్‌ప్లే, నిర్మాతగా, దర్శకుడిగా అల్లాపురం దామోదర్ చేతిలో రూపుదిద్దుకున్న పలు పాటలు, షార్ట్‌ఫిలిమ్స్ యూట్యూబ్, ఇన్‌స్ర్టాలో ఆదరణ పొందాయి. వాటిలో రైతుల కష్టాలను చూపే కన్నీటిధార, విలువలను తెలిపే గుండెలపై మోసే నాన్న, ఊరిడిసిన కొడుకు కథ (సాంగ్), ఎంతపని చేస్తివే ఓటమ్మ పాటలతో పాటు కేస్ క్లోజ్ షార్ట్‌ఫిలిం, తోడబుట్టిన తోడు, గల్లగురిగి, లవ్ ట్రావెల్ ఇండిపెండెంట్, ఇల్లరికం అల్లుడు, ఆర్‌ఎస్‌నంద వంట మనిషి కామెడీ షార్ట్‌ఫిలిమ్స్ లక్షల్లో వ్యూస్ సంపాదించాయి. వీటితో పాటు ఏడీఆర్ ఫిలిం ఫ్యాక్టరీ నుంచి సుమారు 50 షార్ట్‌ఫిలిమ్స్, 30 వీడియో సాంగ్స్ తీశారు. రచయితగా, దర్శకుడిగా ప్రస్తుతం రైతన్న మేలుకో షూటింగ్ జరుగుతోంది. ప్రయాణంలో పరిచయం, గున్నమామిడి కొమ్మమీద రెండు సినిమాలకు దామోదర్ కథ, స్ర్కీన్‌ప్లే, దర్శకత్వం వహించారు. యూట్యూబ్‌లో పెట్టిన సినిమాలు, షార్ట్‌ఫిలిమ్స్, వీడియో సాంగ్స్ వల్ల దామోదర్‌కు నెలకు 30 నుంచి 40 వేల వరకు ఆదాయం వస్తోంది.

స్వయం కృషినే నమ్ముకున్న దామోదర్

1999లో ప్రేమాంజలితో మొదలైన ప్రయాణం అంచలంచలుగా ఎదుగుతూ వచ్చారు. పాటలు, కథా, రచనలను తీసుకుని దామోదర్ హైదరబాద్‌లోని ప్రముఖ నిర్మాతలను, నటులను, దర్శకులను కలిసిన పలితం కనిపించేదు.దీంతో దామోదర్ స్వశక్తిని నమ్ముకున్నారు. తన మిత్రులు, పరిచయస్తులతో కలిసి ప్రయాణంలో పరిచయం, గున్నమామిడి కొమ్మమీద లాంటి


కెమెరామెన్‌కు సూచనలు ఇస్తున్న దామోదర్ (ఫైల్)

సినిమాలకు కథ, స్ర్కీన్‌ప్లే, దర్శకత్వం వహించారు. అవి అనుకున్నంత హిట్ కాలేదు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా తక్కువ బడ్జెట్‌తో షార్ట్ ఫిలిమ్స్‌ను నిర్మిస్తూ వస్తున్నారు. కొన్ని తన (ఏడీఆర్) బ్యానర్‌లో నిర్మిస్తుండగా, కొన్ని వేరే వాళ్ల బ్యానర్‌లో నిర్మించే వాటికి నటుడిగా, కథ, స్ర్కీన్‌ప్లే, దర్శకత్వం బాధ్యతలను చూస్తున్నారు. మరోపక్క హనుమకొండలోని బాలసముద్రంలో ఏడీఆర్ ఫిలిం ఫ్యాక్టరీని స్థాపించి ఔత్సాహిక కళాకారులకు నటనలో శిక్షణ ఇస్తున్నారు.

వరంగల్‌ను షూటింగ్‌లకు వేదిక చేయడమే లక్ష్యం : అల్లాపురం దామోదర్



కళలకు పుట్టినిల్లు ఓరుగల్లు. ఇక్కడ కళాకారులకు కొదువలేదు. లొకేషన్లకు కొదువలేదు. కావాల్సిందల్లా.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని లొకేషన్లు అద్భుత కళాఖండాలు. వాటిని సద్వినియోగం చేసుకుంటే నిర్మాతలకు రూ.కోట్లు ఖర్చు తప్పుతుంది. మంచి మంచి కళాకారులు కూడా ఉన్నారు. కావాల్సిందల్లా 24 క్రాఫ్ట్స్ సంబంధించిన సినీ, టీవీ, నాటక కళాకారులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడం. అదే జరిగితే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వర్క్ షేరింగ్‌తో సినిమాలు రూపొందించవచ్చు. ప్రభుత్వ సహకారంతో పాటు కళాకారులంతా సహకరిస్తే స్టూడియో కూడా ఏర్పాటు చేసుకుని సినిమా షూటింగ్‌లకు వరంగల్‌ను వేదికగా చేయాలనేదే సంకల్పం.

ప్రపంచ శాంతి కోసం ప్రార్థించాలి

• వరంగల్ బిషప్ ఉడుమల బాల • ముగిసిన ఫాతిమామాత మహోత్సవం


సందేశమిస్తున్న బిషప్


హాజరైన క్రైస్తవులు

కాజీపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ ప్రార్థించాలని, క్రైస్తవులు పశ్చాతాపం, పరివర్తన, ప్రార్థనా జీవితంతోనే జీవించాలని వరంగల్ బిషప్, విశాఖ అగ్ర పీఠాధిపతి డాక్టర్ ఉడుమల బాల క్రైస్తవులకు పిలుపునిచ్చారు. రెండు రోజులుగా కాజీపేట ఫాతిమానగర్ కెథడ్రల్ చర్చిలో జరుగుతున్న ఫాతిమామాత ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గురువారం ఉదయం బిషప్ హౌస్ నుంచి కెథడ్రల్ చర్చి వరకు ఓపెన్‌టాప్ వాహనంలో వచ్చిన బిషప్‌కు క్రైస్తవులు ఘన స్వాగతం పలికారు. చర్చికి చేరుకున్న బిషప్ సమష్టి దివ్య బలిపూజ సమర్పించారు. అనంతరం బిషప్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. మొదటి ప్రపంచ యుద్ధాన్ని నిలిపివేసింది ఫాతిమా మాతే అన్నారు. ఈ జూబ్లీ ఏడాదిలో పండుగను జరుపుకోవడం ప్రపంచ శాంతి నెలకొన్న నేపథ్యంతో అన్నారు. పోర్చుగల్ దేశంలో ముగ్గురు చిన్నారులకు ఫాతిమా మాత కనిపించి ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలని చెప్పిందని గుర్తు చేశారు. అంతకుముందు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు బెంగళూరు అగ్రపీఠం ఫాదర్ మెన్సీ గ్నేర్ ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు చేశారు. కాజీపేట విచారణ గాయక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక గీతాలు ఆలపించారు. క్రైస్తవులు పెద్దఎత్తున కెథడ్రల్ చర్చి, మరియమాత గుహ వద్దకు చేరుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం విశాఖ అగ్రపీఠాధిపతిగా ఎన్నికైన డాక్టర్ ఉడుముల బాలను వరంగల్ డయాసిస్ కౌన్సిల్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫాతిమా కెథడ్రల్ విచారణ కౌన్సిల్ అధ్యక్షుడు బొక్క దయాసాగర్, మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ రాజయ్య, 49 డివిజన్ కార్పొరేటర్ మానస రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలకు మోసపోవద్దు

తెలియని యాప్‌లు, ఫోన్ కాల్స్, లింక్‌లకు స్పందించొద్దు

» సైబర్ క్రైం జరగగానే 1930 కాల్ చేయాలి
» స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు కావాలి
» సైబర్ క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్
» 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన

వరంగల్ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): 'సాంకేతికంగా వస్తున్న మార్పులను సైబర్ నేరస్థులు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వారు చెప్పే మాయమాటలకు అత్యాశకు పోతున్న వారు కొందరు, అమాయక ప్రజలు కొందరు మోసపోతున్నారు. సైబర్ నేరస్థుల వలలో చిక్కి విలవిలలాడుతున్నారు' అని వరంగల్ కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల సైబర్‌మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను గురువారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు ఫోన్ చేసి ఏసీపీ ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ క్రమంలో ఏసీపీ ప్రజలకు పలు సలహాలు ఇచ్చారు. తెలియని వ్యక్తులను నమ్మి, ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడులు పెట్టడం, ఆన్‌లైన్ యాప్‌ల నుంచి రుణాలు తీసుకోవద్దని, భౌతికంగా చూడని విషయాలను అసలు నమ్మొద్దన్నారు. ఆన్‌లైన్ మోసానికి గురైనట్టు అనుమానం రాగానే క్షణాల్లో (గోల్డెన్ అవర్) ఆలస్యం చేయకుండా 1930కు ఫోన్‌చేస్తే డబ్బులు డ్రా చేయకుండా ఆపొచ్చన్నారు. ఒకసారి సైబర్ నేరస్థులు డబ్బులు డ్రా చేసుకుంటే డబ్బులు రికవరీ చేసే ఆవకాశం ఉండదని వివరించారు. 1930 ద్వారానే సైబర్ క్రైంకు సత్వర పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. రూ.10లక్షల లోపు అయితే స్థానిక పోలీస్‌స్టేషన్, రూ.10లక్షలకు పైగా ఉంటే కమిషనరేట్ కార్యాలయంలోని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఫోన్‌ఇన్‌కు వచ్చిన కాల్స్‌లో కొన్ని..

● లోన్‌యాప్‌లో రుణాన్ని చెల్లించినా గుర్తుతెలియని వ్యక్తులు నాతో పాటు నా సంబంధికులకు ఫోన్లు చేసి వేధిస్తున్నారు. ఏం చేయాలి?

- శివ, వరంగల్

ఏసీపీ : లోన్‌యాప్‌ల జోలికి వెళ్లొద్దు. మీ సంబంధీకులకు ఫోన్ చేస్తే ఎవరూ పరిగణలోకి తీసుకోవద్దని చెప్పండి. కొద్ది రోజులు ఫోన్ స్విచ్చాఫ్ చేసి పెట్టండి. సెల్‌ఫోన్‌లో యాప్ తీసేయాలి. లేదంటే కమిషనరేట్‌లోని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌కు వస్తే ఫోన్ రీసెట్ చేసి ఇస్తాం.

● ఇన్వెస్ట్‌మెంట్ పేరిట ఓ ఖాతాకు రూ.2,72,000 డబ్బులు వేసి మోసపోయాం. 1930కు ఫోన్ చేసినా ఇప్పటి వరకు డబ్బులు రికవరీ కాలేదు.

-షాకీర్, పరకాల

ఏసీపీ : 1930 ఫోన్ చేసి వదిలేస్తే సరిపోదు. వివరాలన్నీ చెప్పిన తర్వాత ఫిర్యాదులో చెప్పింది వాస్తవమేనని మీ ఫోన్ నెంబర్‌కు ధ్రువీకరణ మెసేజ్ వస్తుంది. దాని ఆధారంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి. ఆ తర్వాత ఫ్రీజింగ్ అయిన డబ్బులు మీ ఖాతాలోకి వస్తాయి. కేవలం మెసేజ్ ఒక్కటే వచ్చి కేసు నమోదు కాకపోతే డబ్బులు జమ కావు.

● మార్టిగేజ్ లోన్‌లో ఒక కిస్తీ చెల్లించనందుకు నా ఫోన్ హ్యాక్ చేసి నగరంలోని ఓ ప్రముఖ కంపెనీ వేధిస్తోంది.

- సంపత్‌కుమార్, మెడికల్ షాపు నిర్వాహకుడు

ఏసీపీ : లోన్ కిస్తీ చెల్లించనందుకు ఫోన్ చేసి వేధించడం నేరం. మీకు లేదా మీకు ష్యూరిటీ పెట్టిన వారికి లీగల్ నోటీసులు ఇవ్వాలి. ఓ ప్రముఖ కంపెనీ ఈ విధంగా వ్యవహరించడం సరికాదు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయసహాయం పొందండి. ఆఫ్‌లైన్‌లో రుణం తీసుకున్నందున సైబర్ క్రైంతో దీనికి ఎలాంటి సంబంధం ఉండదు.

● ప్రకృతి విలేజ్ మార్ట్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయాం. తిరిగి డబ్బులు ఎలా పొందాలి..?

- భాస్కర్, వరంగల్

ఏసీపీ : భౌతికంగా వ్యక్తులతో మాట్లాడి నమ్మకంతో పెట్టుబడి పెట్టారు కనుక ఇది సైబర్ క్రైం కిందికి రాదు. చీటింగ్ కేసు కిందికి వస్తుంది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం పొందొచ్చు.

● తరచుగా ఏపీకే ఫైల్స్ రావడం, అనవసరమైన ఫోన్ వస్తున్నాయి. ఆపడం ఎలా..?

- కామిడి సతీష్‌రెడ్డి, భూపాలపల్లి

ఏసీపీ : తెలియని వారి నుంచి వచ్చిన ఏపీకే ఫైల్స్, యుఆర్ఎల్ లింక్‌లను ఓపెన్ చేయకూడదు. దాని ద్వారా ఫోన్లు హ్యాక్ అయ్యే ప్రమాదం ఉంది. అన్ వాంటెడ్ ఫోన్ కాల్ వచ్చిన వెంటనే ఫోన్‌కు మెసేజ్‌లు వస్తుంటాయి. మళ్లీ కాల్ చేయాలా.. వద్దా.. అని దానికి నో అని బదులు ఇవ్వాలి. ఫోన్ సెట్టింగ్స్‌లలో ఆప్షన్స్ ఉంటాయి వాటిలోనైనా అన్ వాంటెడ్ మెసేజ్‌లు, ఫోన్స్ రాకుండా సెలెక్ట్ చేసుకోవచ్చు. మాల్‌వేర్ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ అయినా ఇదే విధంగా ఏపీకే ఫైల్స్, కుప్పలు, కుప్పలుగా మెసేజ్‌లు వస్తుంటాయి. మా దగ్గరికి వచ్చినా, లేదా భూపాలపల్లిలో ఉన్న జిల్లా సైబర్ క్రైం కో-ఆర్డినేషన్ సెంటర్‌కు వెళ్లినా మీ ఫోన్‌ను క్లీన్ చేసి ఇస్తారు.

● ఫేస్‌బుక్‌లో సిమెంట్ డీలర్‌షిప్ ఇస్తారన్న ప్రకటన చూసి రూ.2,12,000 చెల్లించి మోసపోయాం. ఏమి చేయాలి ?

- రమేశ్, ధర్మసాగర్

ఏసీపీ : ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు చూసి మోసపోవద్దు. వ్యక్తులను ప్రత్యక్షంగా కలిసి వాస్తవమేనని నమ్మకం కలిగిన తర్వాతే పెట్టుబడి పెట్టాలి. ముందుగా 1930కు ఫిర్యాదు చేసి తర్వాత స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించండి. డబ్బులు ఫ్రీజ్ అయితే అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ అవుతుంది. లేదంటే వ్యక్తి పట్టుబడ్డపుడు మీరు పెట్టిన కేసు ద్వారా నిందితుడిని జైలుకు తరలించవచ్చు.




ఫోన్‌ఇన్‌లో సందేహాలను నివృత్తి చేస్తున్న సైబర్ క్రైం ఏసీపీ విజయ్ కుమార్

హస్తంలో.. ఐక్యత సాధ్యమేనా?

(5వ పేజీ తరువాయి)

నామినేటెడ్ పదవుల భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికే విభేదాలతో ఎమ్మెల్సీ సీటు చేజార్చుకున్న ఓరుగల్లు నేత మధ్య విభేదాలు ఇలాగే కొనసాగితే.. టీపీసీసీలో కూడా పదవులు రావటం కష్టమే అనే చర్చ జరుగుతోంది. దీంతో వరంగల్ నేతల మధ్య ఉన్న విభేదాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని అగ్రనేతలు మంత్రులకు సూచనలు చేస్తున్నట్టు సమాచారం. ఇటీవల జరిగిన క్యాబి నెట్ సమావేశంలో స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌తో పాటు మరో మూడు ఉమ్మడి జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఉన్న విభేదాలను ప్రస్తావించినట్లుగా సమాచారం. ఎమ్మెల్యేలను కలుపకపోవాల్సిన బాధ్యత మం త్రులపైనే ఉందని సీఎం సూచించినట్టు సమాచారం. తొలుత ఎమ్మెల్యేలతో విందు, మరోసారి ఎమ్మెల్యేలకు సంబంధించిన పెండింగ్ పనులు, బిల్లులు, ఇతర వాటిపై దృష్టిపెట్టాలని అధిష్టానం నుంచి కూడా ఆదేశాలు వచ్చినట్లుగా సమాచారం. సీఎంతో పాటు కాంగ్రెస్ హైకమాండ్ నుంచి వస్తున్న ఆదేశాలతో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఇన్‌చార్జ్ మంత్రులు రంగంలోకి దిగినట్టు ప్రచారం జరుగుతోంది.

ఎమ్మెల్యేలకు మంత్రి సీతక్క విందు..

హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రి సీతక్క ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలకు బుధవారం రాత్రి విందు ఏర్పాటు చేశారు. ఆమె ఆహ్వానం అందుకున్న ఎమ్మెల్యేలు, నేతలు ఆలోచనలో పడ్డారని, కొందరు ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా విందుకు వెళ్లినట్టుగా సమాచారం. అయితే ఈ విందులో పార్టీపదవులు, నామినేటెడ్ పదవుల పరమైన ఎలాంటి చర్చ జరగనప్పటికి అధికారంలోకి వచ్చిన ఏడాది తరువాత మంత్రి సీతక్క విందు ఏర్పాటు చేయటంపై ఎమ్మెల్యేల్లో చర్చ జరిగినట్టు సమాచారం. "మంత్రి విందుకు పిలిచింది వాస్తవమే.. భోజనం చేసినం.. సంప్రదాయం ప్రకారం దుస్తులు కూడా పెట్టారు. అంతే రాజకీయాలు ఏం మాట్లాడుకోలేదు." అని ఓ ఎమ్మెల్యే 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కాగా, విభేదాలు ఉన్న ఎమ్మెల్యేలు కూడా పరస్పరం అభివాదం చేసుకుని, మాట్లాడుకోవటం కాంగ్రెస్‌లో ఐక్యతకు ఈ విందు ఎంతో కొంత ఉపయోగపడుతుందనే అంచనాల్లో కాంగ్రెస్ అగ్రనేతలున్నారు. మరో మంత్రి కొండా సురేఖ కూడా త్వరలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలకు విందు ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్టు సమాచారం. మొత్తంగా అధిష్టానం ఆదేశాలతో రంగంలోకి దిగిన మంత్రులు ఎమ్మెల్యేలతో సత్సంబధాలు కొనసాగిస్తూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా అభ్యర్థుల ఎంపికతో పాటు విజయం వరకు ఐక్యంగా.. సమష్టిగా కృషి చేసేలా కాంగ్రెస్ అధిష్టానం ప్రయత్నాలు చేస్తోంది. ఈ విందు రాజకీయాలు ఎంత వరకు విజయవంతమవుతాయోననే చర్చ కూడా జరుగుతోంది.

భర్త హత్యకు భార్య సుపారీ

» రెండేళ్లుగా విడిగా ఉంటున్న భార్యాభర్తలు
» కోపంతో భర్తను చంపించేందుకు ప్లాన్
» ముఠాగా ఏర్పడి రెక్కీ నిర్వహించిన నిందితులు
» బాధితుడికి బెదిరింపు కాల్‌తో బెడిసి కొట్టిన స్కెచ్
» భార్యతో పాటు నలుగురిని అరెస్టు చేసిన నర్సంపేట పోలీసులు

నర్సంపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భర్త హత్యకు భార్య సుపారీ ఇచ్చింది. గొడవలతో రెండేళ్లుగా విడిగా ఉంటున్న భర్త.. తనను పట్టించుకోవడం లేదని కోపం పెంచుకుని ఈ దారుణానికి ఒడిగట్టింది. వరంగల్ నగరంలో ఇటీవల డాక్టర్‌ను అతడి భార్య సుపారి ఇచ్చి హత్య చేయించిన సంఘటన మరువక ముందే ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న భర్తను హతమార్చేందుకు భార్య పన్నిన కుట్ర కలకలం రేపుతోంది. హత్యకు సుపారీ తీసుకున్న వారిలో ఒకరు అత్యాశతో బాధితుడికి బెదిరింపు కాల్ చేయడంతో ప్లాన్ బెడిసికొట్టి సూత్రధారులు, పాత్రధారులంతా కటకటాలపాలయ్యారు. ఈ ఘటన నర్సంపేట మండలంలో గురువారం వెలుగు చూసింది. నర్సంపేట ఎస్సై జి. అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..

నర్సంపేట మండలం ఆకులతండాకు చెందిన ధారావత్ సుమన్‌కు ఇదే మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన మంజులతో 2018లో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కూతురు ఉంది. సుమన్ హైదరాబాద్‌లోని ఐడీబీఎల్ బ్యాంకులో మేనేజర్ పనిచేస్తున్నాడు. అయితే భార్యాభర్తలు తరచూ గొడవపడడం, మనస్పర్థలతో రెండేళ్ల నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. పంచాయితీకి పిలిస్తే భర్త రావడం లేదని, కలిసి కాపురం చేయడం లేదన్న అక్కసుతో భర్తపై మంజుల కక్ష పెంచుకుంది. భర్తను ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకుంది. పది రోజుల కిందట ఆకులతండాలోని తనకు దగ్గరి పరిచయస్తుడైన మూడు గోపితో హోలీ పండుగ లోపు తన భర్త హత్య చేయాలని, ఇందుకోసం ఎన్ని డబ్బులైనా ఇస్తానని మంజుల ఒప్పందం కుదుర్చుకుంది. ముందుగా ఖర్చుల కోసం రూ.30వేలు ముట్టచెప్పింది. దీంతో గోపి తనకు తెలిసిన క్యాబ్ డ్రైవర్లు మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన మల్లేష్, వరంగల్ జిల్లాలోని రాయపర్తికి చెందిన బానోత్ నరేష్, మంజులకు బావ వరుసైన ములుగు జిల్లా అన్నంపల్లికి చెందిన మోతీలాల్ ముఠాగా ఏర్పడ్డారు. సుమన్‌ను హత్య చేయడం కోసం మొదట హైదరాబాద్‌లో పని చేసే బ్యాంకు వద్ద ఆరా తీశారు. అతడు ఎప్పుడు వెళ్తాడు..? ఎప్పుడు ఇంటికి వస్తాడు..? అనే విషయాలపై రెక్కీ నిర్వహించి ఆ తర్వాత హతమార్చాలనుకున్నారు.

ఇలా హత్యకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్న క్రమంలోనే ముఠాలోని ఒకరు బానోత్ నరేష్ డబ్బులు వసూలు చేయాలన్న అత్యాశతో సుమన్‌కు ఈ నెల 4న ఫోన్ చేశాడు. నువ్వు డబ్బులిస్తే నీకు సంబంధించిన ఒక ముఖ్యమైన విషయం చెబుతానని, లేదంటే నిన్ను చంపేస్తామంటూ బెదిరించాడు. కంగారు పడిన సుమన్ తనకు ఫోన్ చేసిన వ్యక్తి గురించి ఆరా తీసినా ఫలితం లేకుండా పోయింది. ఈ నెల 9న నర్సంపేట పోలీసులకు జరిగిన విషయంపై ఫిర్యాదు చేశాడు. సుమన్‌కు చేసిన ఫోన్‌కాల్‌తో పోలీసులు బానోత్ నరేష్‌ను పట్టుకొని విచారించి హత్య కుట్రను ఛేదించారు. నరేష్ ద్వారా కుట్ర సూత్రధారి మంజుల, మూడు గోపి, మల్లేష్, మోతీలాల్‌ను బుధవారం అరెస్టు చేసి విచారించగా హత్య కుట్రను ఒప్పుకున్నారు. ఇదే రోజు రాత్రి నిందితులైన ఐదుగురిని కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ వివరించారు.

అనాథలకు అండగా..

» ఆశ్రయం కల్పిస్తున్న మాతృభూమి చారిటబుల్ ట్రస్టు
» పెంచి, చదివిస్తున్న నిర్వాహకులు
» ఇటీవల ఇద్దరు యువతులకు వివాహాలు
» ఆదర్శంగా నిలుస్తున్న మోహన్‌రావు దంపతులు


అనాథల ఆలనాపాలన చూస్తున్న డాక్టర్ మోహన్‌రావు, వినోద దంపతులు

నర్సంపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : చిన్న వయస్సులోనే కన్న తల్లిదండ్రులను కోల్పోయి.. అయిన వారు లేక అనాథలైన ఇద్దరు చిన్నారులను చేరదీసి ఆశ్రయం కల్పించి.. తల్లిదండ్రుల్లా సాకి.. ఓనమాలు దిద్దించి.. ఉన్నత చదువులు చదివించి.. వారికి వివాహాలు చేసి.. ఆదర్శంగా నిలిచారు ఆ దంపతులు. నర్సంపేటలో మాతృభూమి ఛారిటబుల్ ట్రస్టు పేరుతో ఆశ్రమం ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు నర్సంపేట పట్టణానికి చెందిన డాక్టర్ అర్శనపెల్లి మోహన్‌రావు, వినోద దంపతులు. ఎన్ఆర్ఐ రవిచందర్ సహకారంతో పట్టణంలోని అంగడికి సమీపంలో 2006లో మాతృభూమి చారిటబుల్ ట్రస్టు అనాథాశ్రమాన్ని నెలకొల్పారు. మొదట వృద్ధులకు ఆశ్రయం కల్పించి చేరదీసిన నిర్వాహకులు ఆ తర్వాత అనారోగ్యంతోనో మరే ఇతర కారణాలతో తల్లిదండ్రులు మరణించడం, అయినవారు కూడా లేక అనాథలుగా మిగిలిన చిన్నారులను చేరదేసి పెంచడంతో పాటు వారికి అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఆశ్రమంలోని అనేక మంది విద్యార్థులు బీటెక్, ఎంబీబీఎస్ విద్యనభ్యసిస్తున్నారు. కొందరు బీటెక్ పూర్తిచేసి ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు ట్రస్టు నిర్వాహకులు.

ఇద్దరి వివాహాలు చేసిన దంపతులు

అనాథలైన రోజా, నాగరాణిలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పించిన మోహన్‌రావు, వినోద దంపతులు వారికంటూ ఓ జీవితాన్నిచ్చేందుకు ఈనెల 12న ఆదర్శ వివాహాన్ని దగ్గరుండి జరిపించారు. నర్సంపేట మండలం బోజ్యనాయక్‌తండాకు చెందిన పాపవత్ బిచ్చునాయక్, బుల్లెమ్మ దంపతులు మరణించడంతో వారి సంతానమైన 9ఏళ్ల రోజా ఆమె చెల్లెలు, సోదరుడికి 2007లో ఆశ్రయం కల్పించారు. 1వ తరగతి నుంచి బీటెక్ వరకు చదివించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో రోజా ఉద్యోగం సాధించింది. తన దూరపు బంధువులు చూసిన బోడ గణేష్‌తో వివాహం నిశ్చయం కావడంతో వారికి తమ సొంత ఖర్చులతో ట్రస్టు నిర్వాహకులే వివాహం జరిపించారు. అలాగే 2009లో ఆశ్రమంలో చేరిన చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి నాగరాణిని బీఎస్సీ వరకు చదివించగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో తాను ప్రేమించిన నర్సంపేట పట్టణానికి చెందిన నిమ్మల రాకేష్‌తో ఆదర్శ వివాహం జరిపించారు. ఈ క్రమంలో మోహన్‌రావు, వినోద దంపతులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సమాజంలోని ప్రతీ ఒక్కరు అనాథలకు అండగా నిలవాలన్నారు. తాము సంపాదించే దానిలో కొంత సమాజ సేవకు ఉపయోగించాలనే లక్ష్యంతోనే అనాథ యువతలకు అండగా ఉంటూ వారి వివాహాలను జరిపిస్తున్నామన్నారు.


యువతులు రోజా, నాగరాణి

మాజీ ప్రిన్సిపాల్ రణధీర్‌రెడ్డి, రమేశ్‌పై కేసు నమోదు చేయాలి

కేయూ క్యాంపస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రణధీర్‌రెడ్డి, అధ్యాపకుడు పోరిక రమేశ్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి ఉద్యోగాల నుంచి వెంటనే తొలగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కేయూ ఇన్‌చార్జి అరెగంటి నాగరాజు గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రణధీర్‌రెడ్డి, రమేశ్‌లపై గురువారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను తన చాంబర్‌లో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాగరాజుగౌడ్ మాట్లాడుతూ.. కేయూ ఎడ్యుకేషన్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ రణధీర్‌రెడ్డి, పోరిక రమేశ్‌లు ఎడ్యుకేషన్ విభాగంలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. బీవోఎస్‌గా ఉన్న రణధీర్‌రెడ్డి రూ.8.15 లక్షలు వర్సిటీ సొమ్మును తన సొంతానికి వాడుకున్నారని తెలిపారు. రణధీర్‌రెడ్డి అనుచరుడైన రమేశ్ గతంలో విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించాడని, పేపర్ లీకేజీలకు పాల్పడ్డారని షోకాజ్ నోటీసులు జారీ చేశారని అన్నారు. వీరిద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విచారణ కమిటీ ఏర్పాటు చేసి నిజ నిర్ధారణ చేపట్టాలని అన్నారు.

వర్సిటీలకు అధిక నిధులు కేటాయించాలి

కేయూ క్యాంపస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో వర్సిటీలకు అధిక నిధులు కేటాయించాలని తెలంగాణ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డాక్టర్ శ్రీధర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీధర్‌కుమార్ లోథ్ మాట్లాడారు. కేంద్రం వర్సిటీలకు సరైన నిధులు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఈఏడాదికి ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో వర్సిటీలకు, విద్యా రంగానికి 20 శాతం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

18 నుంచి కేయూలో జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ నేతృత్వంలో మార్చి 18, 19 తేదీల్లో '75 ఏళ్ల భారత రాజ్యాంగం-ప్రగతి, సమస్యలు-సవాళ్లు' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ సంచాలకుడు, సదస్సు డైరెక్టర్ డాక్టర్ తుమ్మల రాజమణి తెలిపారు. మార్చి 18న జరిగే ప్రారంభ సదస్సుకు హైకోర్టు మాజీ జడ్జి, ప్రస్తుత మహాదాయి వాటర్ ట్రిబ్యూనల్ జడ్జి జస్టిస్ పీఎస్ నారాయణ, తెలంగాణ హ్యూమన్ రైట్స్ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య, కేయూ వైస్ చాన్స్‌లర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం హాజరుకానున్నట్లు వెల్లడించారు. సదస్సును విజయవంతం చేయాలని డైరెక్టర్ కోరారు. ఐ

ఏఐసీడబ్ల్యూసీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రవీణ్



హనుమకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వినియోగదారుల సంక్షేమ మండలి (ఏఐసీడబ్ల్యూసీ) తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా చిలువేరు ప్రవీణ్ నియమితులయ్యారు. మండలి జాతీయ చైర్మన్ విఖ్యాత్ షేనాయ్, జాతీయ ప్రిన్సిపల్ జనరల్ సెక్రెటరీ దేవేంద్ర తివారి ఈ మేరకు నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఏసీడబ్ల్యూసీ ద్వారా వినియోగదారుల సంక్షేమాన్ని, తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ స్థాయి వరకు ప్రవీణ్ తీసుకువెళ్లగలరన్న విశ్వాసాన్ని వారు అందులో వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, వినియోగదారుల సంఘంనాయకులు పల్లెపాడు దామోదర్, మొగిలిచర్ల సుదర్శన్‌కు ప్రవీణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ కాశిబుగ్గలో మహిళా వినియోగదారుల చైతన్య సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు.

వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చూడాలి

మడికొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మడికొండలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం విద్యుత్ వినియోగదారుల ఫోరం ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారల సదస్సు నిర్వహించారు. ఫోరం చైర్‌పర్సన్ వేణుగోపాలాచారి, సెక్రటరీ చరణ్‌దాస్ విద్యుత్ సమస్యలపై వినియోగదారులను అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరా, లోవోల్టేజ్, విద్యుత్ పునరుద్ధరణ తదితర సమస్యలపై వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులకు సిబ్బంది వెంటనే స్పందించి నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఈ సాంబరెడ్డి, ఏడీఈ సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, మడికొండ ఏఈ వాలునాయక్, ఏఈవో మల్లయ్య, శ్రీధర్, రాములు, లైన్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య, లైన్‌మెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక నిబ్బరంతో వ్యాధులను జయించొచ్చు

కేయూ క్యాంపస్ మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్నా.. మానసికమైన నిబ్బరంతో శారీరక వ్యాధులను జయించొచ్చని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పేర్కొన్నారు. కేయూ జంతు శాస్త్ర విభాగ సెమినార్ హాల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు ముగింపు సమావేశం జరిగింది. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ.. సైకాలజీ, ఇమ్యూనాలజీ కలిసి పని చేస్తే మానసికంగా ధైర్యంగా ఉండే వ్యక్తుల్లో వ్యాధులను ఎదుర్కొనే శక్తి పెరుగుతోందని మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారని అన్నారు. ఈ సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య మాట్లాడుతూ.. రెండు రోజుల సదస్సుకు అనేక వర్సిటీలు, సంస్థల నుంచి పరిశోధకులు, శాస్త్రవేత్తలు హాజరైనట్లు పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లపల్లి మనోహర్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ బి.సురేశ్‌లాల్, యూజీసీ కోఆర్డినేటర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, జువాలజీ విభాగం బీవోఎస్ చైర్మన్ ఈసం నారాయణ, సెమినార్ డైరెక్టర్ శమిత, మామిడాల ఇస్తారీతో జంతుశాస్త్ర విభాగం అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిపై మాదిగల తిరుగుబాటు తప్పదు

హనుమకొండ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మాదిగలకు రిజర్వేషన్లలో ద్రోహం చేస్తూ మాలల పక్షపాతిగా మారిన సీఎం రేవంత్‌రెడ్డిపై మాదిగల తిరుబాటు తప్పదని మాదిగ యువసేన జాతీయ నాయకుడు చాతల్ల శివ మాదిగ హెచ్చరించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లలో వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారానికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శివ మాదిగ హాజరై దీక్షకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు జన్ను దినేష్ మాదిగ, మంద రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, మంద స్వరాజ్ మాదిగ, పూర్ణచందర్, దిలీప్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలి

- రాష్ట్ర సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి
- రాష్ట్ర మున్సిపల్ కమిషనర్‌లతో టెలీ కాన్ఫరెన్స్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలని హైదరాబాద్ సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి రాష్ట్ర మున్సిపల్ కమిషనర్‌లతో టెలీ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి తగు సూచనలు చేశారు. టెలీ కాన్ఫరెన్స్‌ద్వారా అధికారులతో మాట్లాడి పన్నుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. మార్చి 31 వరకు పన్నుల వసూళ్లు వంద శాతం పూర్తి చేయాలన్నారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి పన్నులు వసూలు చేయడంలో విజయం సాధించాలని అన్నారు. ప్రస్తుతం 25శాతం రుసుములో తగ్గింపు ఉందని ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అంతేకాకుండా ఈనెల ముగిసిన తర్వాత యథావిధంగా పన్నులు వసూలు చేయాలని, అప్పుడు ఎలాంటి తగ్గింపులు, సబ్సిడీలు ఉండవన్నారు.

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. ఇప్పటి వరకు వరంగల్ నగరంలో పన్నులు వసూలు వేగవంతంగా జరుగుతోందన్నారు. సుదీర్ఘకాలం పాటు బల్దియాకు పన్నులు చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. ఇండ్లు, షాపింగ్ మాల్స్, రెసిడెన్షియల్ కాంపెక్స్‌ల యజమానులు పన్నులు చెల్లించకుంటే రెడ్ నోటీసులు ఇస్తారని, 48 గంటల్లో స్పందించకపోతే అక్కడి సామగ్రిని జప్తు చేస్తామని హెచ్చరిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్దియా నుంచి డిప్యూటీ కమిషనర్‌లు ప్రసన్నరెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో శానిటేషన్ పనులు సక్రమంగా నిర్వర్తించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు, సిబ్బందికి సూచించారు. గురువారం వరంగల్ నగరంలో 7వ డివిజన్‌లో శానిటేషన్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హనుమకొండ మెయిన్ రోడ్డు, బస్టాండ్ ప్రాంతంలో పర్యటిస్తూ రోడ్లు శుభ్రం చేస్తున్న శానిటేషన్ కార్మికులతో మాట్లాడారు. శానిటేషన్ పనులతో పాటు కార్మికుల సమస్యలు, బాగోగులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుధ్య సిబ్బంది గ్యాంగ్ వర్క్‌లు, రోడ్ల శుభ్రత, డ్రైనేజీ క్లీనింగ్ విధులకు హాజరవుతున్న సమయంలో తప్పకుండా ఇండ్ల యజమానులతో లాగ్‌బుక్‌లో సంతకాలు తీసుకోవాలని అన్నారు. అంతేకాకుండా వారి మొబైల్ నెంబర్ తీసుకోవాలన్నారు. స్వచ్ఛ ఆటో యజమానులు, డ్రైవర్లు పిన్‌పాయింట్ బుక్‌ను నిర్వహించాలని అన్నారు. చెత్త సేకరణకు సంబంధించిన పూర్తిసమాచారాన్ని లాగ్‌బుక్‌లో రాయాలని అన్నారు. కార్మికులు షెడ్యూల్ ప్రకారం చేస్తున్న పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్‌తో పాటు జవాన్లు పాల్గొన్నారు.



శానిటేషన్ కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్

మదర్ థెరిస్సా స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

కేయూ క్యాంపస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మదర్ థెరిస్సా స్ఫూర్తితో నిరాశ్రయులకు, పేదలకు మంద కొమురమ్మ-కొమురయ్య సేవా సమితి పనిచేస్తోందని ఎంఎంకేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద శ్యాంసన్ అన్నారు. గురువారం వర్సిటీ సమీపంలోని లార్డ్ పట్టణ నిరాశ్రయుల ఆశ్రమంలో మంద కొమురమ్మ 11వ వర్థంతిని పురస్కరించుకుని పేదలకు, నిరాశ్రయులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎంకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంద సికిందర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్బన్ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా అశ్విన్ రాథోడ్



కేయూ క్యాంపస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : అర్బన్ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా అశ్విన్ రాథోడ్ నియమితులయ్యారు. ఈ మేరకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ ద్వివేది, సయ్యద్ ఖాలీద్‌ల ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి నియామక పత్రాన్ని జారీ చేశారు. ఈసందర్భంగా అశ్విన్ రాథోడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడుతానని తెలిపారు.

వ్యాపార సంస్థలు మార్పులను అవగతం చేసుకోవాలి

- కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ వెంకటరత్నం

కేయూ క్యాంపస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అధునిక యుగంలో వ్యాపార సంస్థలు మార్పులను అవగతం చేసుకోవాలని కాకతీయ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బొడ వెంకటరత్నం ఉద్బోధించారు. గురువారం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో 'న్యూ హరిజోన్స్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డ్యూరింగ్ 21 సెంచరీ-చాలెంజెస్ అండ్ అపర్చునిటీస్' అనే అంశంపై జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు ముగిసింది. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ.. టెక్నాలజీ మార్పులను స్వాగతించినప్పుడే వ్యాపార సంస్థల మనుగడ సాధ్యం అవుతుందని స్పష్టం చేశారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. డిజిటల్ మార్కెటింగ్ విస్తృత అవకాశాలను అందిస్తోందన్నారు. సదస్సుకు అధ్యక్షులుగా అమర వేణి వ్యవహరించగా, మోడరేటర్‌గా డాక్టర్లు రాజు, సాయి శరణ, ఎం.కనుకయ్య, టి.గోపి, ప్రొఫెసర్లు పి.వరలక్ష్మి, ఎస్.నరసింహచారి, కట్ల రాజేందర్, రిటైర్డు ప్రొఫెసర్లు పి.కృష్ణమాచారి, కె.రాజిరెడ్డిలు పాల్గొన్నారు. బి.నిరంజన్ శ్రీనివాస్ స్వాగతం పలకగా, ఎం.గిరిప్రసాద్ వందన సమర్పణ చేశారు.



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న కేయూ మాజీ వీసీ వెంకటరత్నం

21న ప్రపంచ కవితా దినోత్సవం

వడ్డెపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న హనుమకొండ మెయిన్ రోడ్డులోని అశోక హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బహుభాషా కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రపంచ శాంతి పండుగ సంస్థ ప్రతినిధులు ఆచార్య వెల్దండి రవికుమార్, మహ్మద్ సిరాజుద్దీన్ తెలిపారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కవి సమ్మేళనంలో తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషలకు చెందిన పటిష్ఠమైన 25 లైన్లకు మించకుండా ఉండే కవితలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. కవితలను ఈనెల 19లోపు పంపించాలన్నారు. వివరాలకు సెల్ నంబర్లు : 98488 93198 / 99497 10085 లలో సంప్రదించాలని వారు కోరారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు విప్పనపల్లి రవికుమార్, ప్రగళ్లపాటి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దాసోజు శ్రావణ్‌కు వినయ్‌భాస్కర్ శుభాకాంక్షలు



హనుమకొండ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : భారత రాష్ట్ర సమితి పార్టీ శాసనసభ్యుల కోటా నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేసి ప్రమాణ స్వీకారం చేసిన దాసోజు శ్రావణ్‌కు గురువారం హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

దమ్ముంటే నగరాభివృద్ధిపై చర్చకు రండి

- కేసీఆర్ ఇచ్చిన హామీలేమయ్యాయి..?
- జీడబ్ల్యూఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న

హనుమకొండ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నాయకులకు దమ్ముంటే వరంగల్ నగరాభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని జీడబ్ల్యూఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న సవాల్ విసిరారు. గురువారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల పాలనలో అభివృద్ధి జరిపినప్పుడు చర్చకు రావడానికి ఎందుకు జంకుతున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ వరంగల్ నగరంలో నాలుగు రోజులు పర్యటించి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నగరానికి యేటా ప్రకటించిన రూ.300 కోట్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, స్మార్ట్‌సిటీ తదితర హామీలు ఎందుకు అమలు చేయలేదో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని సూచించారు. బీఆర్ఎస్ అభివృద్ధిచేసి ఉంటే ప్రజలు ఎందుకు ఓడించారో వారే చెప్పాలన్నారు. రాజేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పట్టాలెక్కిందన్నారు. మరోసారి రాజేందర్‌రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదన్నారు.

మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు ద్రోహం చేసిన చరిత్ర కేసీఆర్‌కు దక్కిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను గౌరవించిందని, కోదండరామ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడం, గద్దర్ పేరిట అవార్డులు ప్రకటించడం ఇందుకు నిదర్శనమన్నారు. మానుకోట ఘటనను బీఆర్ఎస్ జిల్లా నేతలు ప్రస్తావించడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ సమయంలో ఉన్న కౌశిక్‌రెడ్డి, మాలోతు కవితను బీఆర్ఎస్‌లోకి ఎలా తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, పశ్చిమ బ్లాక్ ప్రెసిడెంట్ అంకూస్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు వరంగల్‌లో సభ పెట్టుకుంటే ఎవరికీ అభ్యంతరం లేదన్నారు. కానీ, సభ పేరుతో మాయ మాటలు చెబుతూ కాంగ్రెస్‌పై బురద చల్లే రాజకీయాలకు ఒడిగడితే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ, ఆర్‌టీఏ సభ్యులు పల్లంకొండ సతీశ్, కార్పొరేటర్లు మామిండ్ల రాజు, జక్కుల రవీందర్, మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, నెక్కొండ కిషన్, చీకటి ఆనంద్, రాకేశ్, కుమార్ యాదవ్, నలుబోల సతీశ్, రవీందర్, నాగరాజు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తోట వెంకన్న, బోడ డిన్నా

నేటి నుంచి ఎర్రగట్టు జాతర

- శ్రీవారి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి



గర్భగుడిలో ఏర్పాటు చేసిన ఉత్సవమూర్తులు (ఫైల్)

హసన్‌పర్తి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగట్టు వెంకన్న జాతర శుక్రవారం ప్రారంభం కానుంది. శుక్రవారం నుంచి మంగళవారం వరకు ఐదు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వహణ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శ్రీవారి కల్యాణంలో పాల్గొనేందుకు భక్తులకు ప్రత్యేకంగా టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో వెంకట్రావ్ తెలిపారు. కల్యాణ మండపంలో శ్రీవారి కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో హాజరవుతారని కల్యాణ మండపంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జాతరలో విద్యుత్ కోత లేకుండా ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

14 మందితో ఎర్రగట్టు జాతర ఉత్సవ కమిటీ

మండలంలో ఐదు రోజుల పాటు నిర్వహించే ఎర్రగట్టు వెంకన్న జాతర ఉత్సవ కమిటీని నియమించినట్టు గురువారం వెంకటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా 14 మందిని ఆలయ ధర్మకర్తలుగా నియమిస్తూ తెలంగాణ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. వీరిలో ఆరెల్లి వెంకటస్వామి, శీలం రమేష్, కనపర్తి రాజు, పోలరాజు శ్యామల, చింతల రమేష్, బిగుళ్ల సురేష్, మానుపాటి విజెందర్, శాగంటి సదానందం, తోట శ్రీనివాస్, కొండమీది సంతోష్, అటికం శ్రీనాథ్ గౌడ్, సంగాల ప్రశాంత్‌కుమార్, వేదాంతం పార్థసారథాచార్యులు, ఆరుట్ల శ్రీధరాచార్యులు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరిగే ఎర్రగట్టు వెంకన్న జాతర ఉత్సవ కమిటీ ధర్మకర్తలుగా కొనసాగుతారని ఈవో వెంకట్రావు తెలిపారు.

ఏకశిలలో హోలీ సంబురాలు

రాంనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కేయూ రోడ్డులోని ఏకశిల హైస్కూల్‌లో గురువారం విద్యార్థులు హోలీ సంబురాలు సహజ రంగులతో జరుపుకున్నారు. సహజ రంగులను, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకరిపై ఒకరు చల్లుకుంటూ కేరింతల మధ్య కోలాహలంగా గడిపారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతిలో అందాలన్నీ ఆవిష్కరించే వసంత రుతువు ప్రవేశించిన తర్వాత జరుపుకునే తొలి పండుగ హోలీ అన్నారు. హానికరమైన రంగులతో కాకుండా సహజమైన రంగులను వినియోగించి ఆరోగ్యకమైన వాతావరణంలో హోలీ జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బేతి శైలజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏకశిల హైస్కూల్‌లో హోలీ జరుపుకుంటున్న విద్యార్థులు

మహిళా ప్రాంగణంలో..

మడికొండ (ఆంధ్రజ్యోతి): మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం(మహిళా ప్రాంగణం)లో గురువారం ప్రాంగణం డీఎం జయశ్రీ ఆధ్వర్యంలో హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. శిక్షణ పొందుతున్న మహిళలు, సిబ్బంది ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని ఉత్సాహంగా గడిపారు. ఈసందర్భంగా డీఎం మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా రంగులు, ప్రేమ పండుగగా వసంత కాలంలో జరుపుకొనే ప్రధాన హిందూ పండగ హోలీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులో శిక్షణ పొందుతున్న విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

మడికొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కాజీపేట మండలం భట్టుపల్లిలో చోటు చేసుకుంది. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన రాపోలు శ్రీనివాస్(46), అతడి భార్య రమాదేవితో కలిసి వ్యక్తిగత పనులపై వరంగల్‌కు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. శ్రీనివాస్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటికి వెళ్తూ మార్గమధ్యలో భట్టుపల్లి మూడు చింతల వద్ద ఆటో ఆపి పక్కన నిలబడి కూల్‌డ్రింక్స్ తాగుతున్నారు. అదే సమయంలో నెంబరు ప్లేట్ లేని కారు వేగంగా వచ్చి ఆటోతో సహా శ్రీనివాస్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య రమాదేవికి గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ గాయపడిన రమాదేవిని ఎంజీఎంకు, శ్రీనివాస్ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కారును తరాలపల్లి వద్ద గమనించి అందులో మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా దామెర మండలం పులుకుర్తికి చెందిన గుర్రాల దినేష్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. శ్రీనివాస్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలి



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఎంఎస్ఎఫ్ నేతలు

కేయూ క్యాంపస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో వెంటనే ఎస్సీ వర్గీకరణ చట్టాన్నితెచ్చి ఉద్యోగాల భర్తీ చేపట్టాలని ఎంఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వర్సిటీ దూరవిద్య కేంద్రం వద్ద గల అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎంఎస్ఎఫ్ నేతృత్వంలో నిరసన చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ లేకుండానే 11వేల టీచర్ పోస్టులు, గ్రూప్స్ ఉద్యోగాల భర్తీ చేపట్టారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి, కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, ఇన్‌చార్జ్ డాక్టర్ వడ్డెపల్లి మధు, నాయకులు పాల్గొన్నారు.

జియాలజీ విద్యార్థులకు విస్తృత ఉద్యోగ అవకాశాలు

- కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జియాలజీ విద్యార్థులకు విస్తృతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోధించారు. గురువారం కేయూ జియాలజీ విభాగంలో విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి అధ్యక్షతన వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. జియాలజీలో అనాలిటికల్ టెక్నిక్స్‌కు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన నేషనల్ జియోగ్రాఫికల్ రిసెర్చ్ ఇన్సిస్టిట్యూట్(ఎన్‌జీఆర్ఐ) జియోలజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ)లు కేయూ పరిశోధకులు, విద్యార్థులకు సేవలందిస్తూ, సహాయపడుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. జియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి వర్క్‌షాప్ ఉద్దేశాలను వివరించారు. వర్క్‌షాప్‌లో హైదరాబాద్ ఎన్‌జీఆర్ఐ చీఫ్ సైంటిస్టు డాక్టర్ వివి శేషాసాయి, జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ ఎ.వాసంతిలు పాల్గొని జియాలజీ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులను విశ్లేషణాత్మకంగా చెప్పారు. కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతులు మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన విషయాలను తెలుసుకుని సబ్జెక్టుపై పట్టుపెంచుకోవాలని సూచించారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి
నవ్య నివేదన
శుక్రవారం • 14 మార్చి 2025

హరేకృష్ణ



భక్తి చైతన్యమూర్తి

మానవులు మంచి దారిలో పయనించాలి. ధర్మబద్ధంగా జీవించాలి. అందుకు మార్గదర్శకులుగా నిలిచిన మహానుభావుల్లో ప్రముఖుడు శ్రీ చైతన్య మహాప్రభువు. సుమారు 500 ఏళ్ళ క్రితం పశ్చిమ బెంగాల్‌లోని నవద్వీపంలో జన్మించిన ఆయన భగవన్నామ సంకీర్తనమనే మార్గాన్ని ముక్తి మార్గంగా బోధించారు. కలియుగంలో సాక్షాత్తూ శ్రీకృష్ణుడి అవతారంగా ఆయనను భావిస్తారు. ప్రామాణికమైన శాస్త్రాధారాలు లేనిదే ఎవరినీ భగవంతుడి అవతారంగా అంగీకరించకూడదు. ప్రస్తుత కలియుగంలో భగవంతుడు అవతరించడం అనేది చాలా విశిష్టమైన విషయమే. అయితే ఈ అవతార స్వరూపం గురించిన పరిజ్ఞానం లోకంలో చాలా అరుదు. అటువంటి అవతారమూర్తి అయిన శ్రీ చైతన్య మహా ప్రభువు గురించి అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. ఆయనను 'గౌర హరి', 'గౌరంగ', 'గౌర సుందర' అని కూడా సంబోధిస్తారు.

శ్రీ చైతన్యుల అవతార ప్రస్తావన 'శ్రీమద్భాగవతం', 'మహా భారతం', 'వాయుపురాణం', 'నృసింహ పురాణం', 'చైతన్యోపనిషత్తు' (అధర్వవేదం) తదితర గ్రంథాలలో ఉంది. "కలియుగంలో ఆవిర్భవించి, సదా కృష్ణ నామ గానాన్ని చేసే భగవదవతార మూర్తిని మేధో సంపత్తి ఉన్న మనుజులు సామూహిక సంకీర్తనలతో ఆరాధిస్తారు. ఆయనది నలుపు రంగు కాకపోయినా సాక్షాత్తూ శ్రీకృష్ణుడే. ఆయన సంకీర్తనోద్యమాన్ని స్థాపించడానికి తన అనుచరులతో కలిసి భువిపై అవతరిస్తారు" అని 'శ్రీమద్భాగవతం'లో ఉంది. అలాగే 'శ్రీ విష్ణు సహస్రనామం'లోని 'సువర్ణ వర్ణో హేమాంగో...' అనే శ్లోకం "మేలిమి బంగారు వర్ణఛాయతో అవతరించి, ముందుగా గృహస్థుడిగా పలు లీలలు చేస్తారు. అత్యంత సుందరమైన శరీర అవయవాలపై చందన లేపనంతో... సువర్ణ శోభతో ప్రకాశిస్తారు. ఆ తరువాత సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించి, నిష్ఠాపరుడై, శాంత స్వభావంతో మెలగుతారు. భక్తి, సామరస్యాలకు తానే ఒక దివ్య సన్నిధానం అవుతారు" అని చెబుతోంది. దీనికి శ్రీల ప్రభుపాదులు వివరణనిస్తూ... "శ్రీల బలదేవ విద్యాభూషణులు 'నామార్థ సుధ' అనే పేరుతో 'శ్రీవిష్ణు సహస్రనామా'నికి భాష్యం రాశారు. పై శ్లోకం ఆధారంగా, ఉపనిషత్తులే సాక్ష్యంగా, ఆధారంగా శ్రీ చైతన్య మహాప్రభువు దేవాదిదేవుని అవతారమని నిర్ధారించారు" అంటూ సవివరంగా తెలిపారు.

అలా సాక్షాత్తూ శ్రీకృష్ణుడి అవతారమైన శ్రీ చైతన్య మహాప్రభువు... ఫాల్గుణ పౌర్ణమి రోజున జన్మించారు. కలియుగంలో భక్తులు ముక్తి పొందడం కోసం... హరినామ సంకీర్తనను బోధిస్తూ... 'హరే కృష్ణ' మహా మంత్రాన్ని మనకు అందించారు. ఆయన పుట్టిన రోజైన ఫాల్గుణ పౌర్ణమి నాడు చంద్రోదయం వరకూ ఉపవాసం, తరువాత ధాన్యాలు లేని ఆహారం తీసుకోవడం, వీలైనన్ని సార్లు 'హరేకృష్ణ' మంత్రాన్ని, శ్రీకృష్ణుడి పవిత్ర నామాలను జపించడం, సమీపంలోని హరేకృష్ణ ఆలయ సందర్శన, హరినామ సంకీర్తనల్లో పాల్గొనడం, శ్రీమద్భాగవత పురాణ పఠనాన్ని ప్రారంభించడం, గోపోషణకు దానం చేయడం, అన్నదానం లాంటివి చేయడం వల్ల శ్రీ చైతన్య మహాప్రభువు అనుగ్రహం లభిస్తుంది.

శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభుజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984



సద్బోధ

కోరికలు, ఆందోళనలే ఆటంకాలు

ఒకప్పుడు బర్మాలో కొందరు వ్యక్తులు ఒక పెద్ద బౌద్ధాలయాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ఆలయం చాలా అందంగా, వైభవంగా ఉండాలనీ, మరీ ముఖ్యంగా ఆలయ ముఖద్వారం మనోహరంగా కనిపించాలని అనుకున్నారు. దానికోసం ఒక నమూనాను తయారు చేయాలనీ ఒక బౌద్ధ సన్న్యాసిని కోరారు. అతను ఎన్నో ఆలయాల నమూనాలు రూపొందించి పేరు ప్రఖ్యాతులు పొందాడు. పైగా ఆ రంగంలో చాలా నైపుణ్యం ఉన్న శిష్యుడు అతనికి ఉన్నాడు. ఆ ఆలయం కోసం పని చెయ్యడానికి ఆ సన్న్యాసి ఒప్పుకున్నాడు.

గురుశిష్యులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. గురువు ఒక నమూనా గీసి, శిష్యుడికి చూపించాడు. దాన్ని శిష్యుడు శ్రద్ధగా, నిశితంగా పరిశీలించి... ఆశించినంత గొప్పగా లేదన్నాడు. గురువు మరొకటి తయారు చేశాడు. శిష్యుడికి అదీ నచ్చలేదు. ఇలా సన్న్యాసి ఎన్ని తయారు చేసినా... అవి బాగోలేవని శిష్యుడు చెప్పడంతో... వాటిని అతను పక్కన పడేశాడు. ఇలా మూడు నెలలు గడిచాయి. ఒక రోజు మరొక నమూనాను గురువు తయారు చేస్తున్నాడు. ఈలోగా అతని కలంలోని సిరా చివరికి వచ్చేసింది. కాగితం మీద గీతలు సరిగ్గా పడడం లేదు. "బజారుకు వెళ్ళి సిరా తీసుకురా!" అని శిష్యుణ్ణి పంపాడు. తరువాత అతను కలంలో ఉన్న సిరాతోనే అక్కడక్కడా కొన్ని మార్పులు చేసి ఒక నమూనా రూపొందించాడు.

కొద్దిసేపటికి తిరిగి వచ్చిన శిష్యుడు దాన్ని చూసి ఆనందాశ్చర్యాలతో "గురువుగారూ! ఇది చాలా అద్భుతంగా ఉంది. ఆలయ నిర్మాతలు కూడా దీన్ని తప్పకుండా అంగీకరిస్తారు. ఇది ఎలా సాధ్యమయింది?" అని అడిగాడు.

అప్పుడు గురువు ఒక్క క్షణం ఆలోచించి "నువ్వు ఇక్కడే, నా సమక్షంలో ఉన్నంత సేపూ నువ్వు మెచ్చుకొనే విధంగా నమూనాను తయారు చేయాలనే కోరిక నాలో ఉండేది. 'అది జరగదేమో?' అనే ఆందోళన కూడా నా మనసులో ఉండేది. ఆ కోరిక, ఆందోళనలే సరైన నమూనా రూపొందించడంలో ఆటంకాలయ్యాయి. దాంతో అన్నీ వ్యర్థమయ్యాయి. నువ్వు బయటకు వెళ్ళాక... నీ గురించి పూర్తిగా మరచిపోయాను. నా సహజమైన తీరులో... ఎలా తోస్తే అలా గీశాను. కోరిక, ఆందోళన లేని మనసు చక్కటి దారిలో నా చేతిని నడిపించింది. అందుకే ఈ నమూనాలో ఆ అందం కనిపిస్తోంది" అని చెప్పాడు.

నాట్యం, గానం, చిత్రలేఖనం, గ్రంథపఠనం, ప్రసంగం... ఇలా ఏది చేస్తున్నా అందరి మెప్పు పొందాలనే కోరిక, ఎవరు ఎలా స్పందిస్తారోననే ఆందోళన, భయం ఉన్నప్పుడు... ఆ పనులను సవ్యంగా నిర్వహించలేం. "ఇదంతా 'నేను చేస్తున్నాను' అనే అహంకారం ఉంటే ఆ పనులు ఇంకా భ్రష్టుపడతాయి. ఇవేవీ లేకపోతే మనం చేసే పనులు అద్భుతంగా ఉంటాయి. సత్ఫలితాలను ఇస్తాయి. 'నేను' అనే భావన నీలో లేనప్పుడు... దైవం నీలో ప్రవేశించి, నిన్ను నడిపిస్తాడు" అంటారు స్వామి వివేకానంద. అలా చేసే కార్యం విజయవంతం కాకతప్పదు.

• రాచమడుగు శ్రీనివాసులు


గీతాసారం


నిస్వార్థంగా మెలగాలి

పనులను (కర్మలను) ఎలాంటి స్వార్థం లేకుండా ఆచరించడం అత్యుత్తమైన లక్షణమని, అటువంటి నిస్వార్థమైన కర్మలు సర్వోన్నతమైన శక్తిని కలిగి ఉంటాయని శ్రీకృష్ణుడు చెప్పాడు. నిస్వార్థమైన చర్యల గురించి వివరించడానికి వర్షాన్ని ఆయన ఉదాహరణగా తీసుకున్నాడు. వేడి కారణంగా నీరు ఆవిరై మేఘాలు ఏర్పడతాయి. అనుకూలమైన పరిస్థితుల్లో అది వర్షం రూపంలో తిరిగి భూమి మీదకు వస్తుంది. అంటే వర్షం అనేది ఒక ఆవృత్తి (సైకిల్)లో భాగం. నిస్వార్థ కర్మలను 'యజ్ఞం'గా శ్రీకృష్ణుడు పేర్కొన్నాడు. మహా సముద్రాలు నీటిని ఆవిరి చేసి, మేఘాలు ఏర్పడడానికి సహాయపడతాయి. వర్షంగా మారడం కోసం మేఘాలు కరుగుతాయి, తమనుతాము త్యాగం చేసుకుంటాయి. ఈ రెండూ యజ్ఞరూపమైన నిస్వార్థ కర్మలు. ఇవి అత్యంత శక్తిని గలిగి ఉంటాయనీ, ఆరంభంలో సృష్టికర్త ఈ శక్తిని ఉపయోగించి సృష్టిని చేశాడనీ, ప్రతి ఒక్కరూ దీన్ని ఉపయోగించుకొని పరమ శ్రేయస్సును పొందాలని సూచించాడనీ 'భగవద్గీత' మూడో అధ్యాయంలో శ్రీకృష్ణుడు వివరించాడు. ఇదంతా యజ్ఞరూపమైన నిస్వార్థ కర్మ ద్వారా మన అస్తిత్వంతో మనల్ని అనుసంధానించుకొని... దాని శక్తిని ఉపయోగించుకోవడమే.

వర్షానికి సంబంధించిన ఈ పరస్పర అనుసంధాన ప్రక్రియలో... మేఘాలు గర్వంతో నీటిని నిల్వ (జమ) చేసుకుంటే ఆ ఆవృత్తికి భంగం కలుగుతుంది. "ఇలా భంగం కలిగించేవారు దాచుకొనేవారు దొంగలు. వర్షం తాలూకు నిస్వార్థ కర్మ కొనసాగినప్పుడు... మేఘాలు మళ్ళీ, మళ్ళీ ఏర్పడుతూనే ఉంటాయి" అని శ్రీకృష్ణుడు చెబుతూ... పరస్పరం సహాయం చేసుకొనేవారిని దేవతలుగా సంబోధించాడు. సముద్రం వర్షం ద్వారా నీటిని తిరిగి పొందినట్టే... నిస్వార్థ కర్మలు ఎన్నిటినో తిరిగి ఇస్తాయి. కాబట్టి దాచుకోకుండా ఆవృత్తిలో భాగం కావాలనీ, అది అన్ని పాపాలనుంచి మిమ్మల్ని విముక్తి చేస్తుందనీ, దాచుకోవడమే అసలైన పాపం అని ఆయన స్పష్టం చేశాడు. స్వార్థ కర్మలు మనల్ని కర్మబంధనంలో బంధిస్తాయని హెచ్చరించాడు. అనుబంధం పెంచుకోకుండా కర్మలను యజ్ఞంలా నిర్వహించాలని సూచించాడు.

ఈ భౌతిక ప్రపంచంలో ఒకరిపై మరొకరు ఆధారపడడం తప్ప మరో మార్గం లేదు. ఇక్కడ ప్రతి వస్తువు, ప్రతి జీవి ఒక ఆవృత్తిలో లేదా మరొకదానిలో భాగం. అది మరో వస్తువు మీద లేదా మరొకరిమీద ఆధారపడి ఉంటుంది. మనలోని ఒక భాగం ఇతరులలో... ఇతరులలోని ఒక భాగం మనలో ఉంటుందనే అవగాహన కీలకం.





కె. శివప్రసాద్
ఐఏఎస్

సహజయోగ



హోలీ అంటేనే ఆనందం, ఆహ్లాదం కలగలిసిన ఉత్సవం. సామాజికమైన అంతరాలకు అతీతంగా అందరూ కలిసి చేసుకొనే సామూహిక వేడుక. భారతీయ సంప్రదాయంలో అనాదిగా భాగమైన ఈ రంగుల సంబరానికి ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యం ఉంది.

అఖండమైన ఆనందం కోసం

నేడు హోలీ

"హోలీ పండుగ అంటే హోలికా దహనం జరిగిన రోజు. దుష్టశక్తులు దహనమైన రోజు. నిజమైన యోగులు భగవంతుణ్ణి పరిపూర్ణంగా నమ్మిన భక్తులు జీవితంలో ఎటువంటి ప్రమాదం నుంచి అయినా బయపడగలరు. సంపూర్ణ రక్షణ పొందగలరు. ఎటువంటి దుష్టశక్తీ వారిని ఏమీ చేయలేదు. దీనికి ప్రహ్లాదుడి కథే తార్కాణం" అని పేర్కొంటూ... వివిధ సందర్భాల్లో హోలీ పండుగ ప్రాశస్త్యం గురించి శ్రీమాతాజీ నిర్మలాదేవి వెల్లడించారు.

ఈ వేడుక ఎలా ప్రారంభమయిందో తెలిపే ఒక కథ ఉంది దాని ప్రకారం... ప్రహ్లాదుణ్ణి అతని తండ్రి హిరణ్యకశిపుడు అనేక విధాలుగా హింసించేవాడు. అతణ్ణి చంపాలని హోలిక అనే రాక్షసిని హిరణ్యకశిపుడు ఆదేశించాడు. హోలికకు ఉన్న వరం వల్ల అగ్ని ఆమెను ఏమీ చేయలేదు. కాబట్టి బాలుడైన ప్రహ్లాదుణ్ణి పట్టుకొని, మండుతున్న చితిపై కూర్చోవాలని హోలికకు హిరణ్యకశిపుడు చెప్పాడు. అయితే ఆశ్చర్యకరంగా హోలిక అగ్నికి ఆహుతైపోయింది. ప్రహ్లాదుడు కనీసం చిన్న గాయమైనా కాకుండా సురక్షితంగా బయటకు వచ్చాడు. క్రూరత్వం ఎన్నడూ క్షేమార్థం కాదని నిరూపించే పౌరాణిక ఘట్టం ఇది. కాగా. ప్రహ్లాదుడితో కలిసి చితి మీద హోలిక కూర్చున్నప్పుడు... అగ్నిదేవుడికి ఒక సందిగ్ధం ఎదురయింది. 'ఆమెకు మరణం ఏ రూపంలోనైనా రావచ్చు కాని అగ్ని ద్వారా కాదనే వరం ఉంది. ఆమెను దగ్ధం చెయ్యనని నేను వాగ్దానం చేశాను. కానీ ఇటువైపు చూస్తే ప్రహ్లాదుడున్నాడు. అతను అమాయకత్వంతో నిండినవాడు. దైవాంశతో జన్మించినవాడు. అతడు నా శక్తులకు అతీతుడు. అతణ్ణి ఎలా దహించగలను? ఇప్పుడేంచెయ్యాలి? అని అగ్నిదేవుడు కలవరపడ్డాడు. ఇది కర్తవ్యానికి, ధర్మానికి మధ్య ఏర్పడిన సందిగ్ధత. ఇలాంటి పరిస్థితుల్లో కర్తవ్యం కన్నా ధర్మం గొప్పది. ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నెరవేర్చాల్సి వచ్చినప్పుడు... చిన్న లక్ష్యాన్ని వదులుకోవడానికి సిద్ధపడాలి. అగ్నిదేవుడు కూడా అదే చేశాడు. హోలికను దగ్ధం చేసి, ప్రహ్లాదుణ్ణి క్షేమంగా విడిచిపెట్టాడు.



మీరు మీ ఆత్మ వైపు మరలండి...

హోలీ పండుగ శ్రీకృష్ణుడి కాలంలో ఆరంభమయిందని కూడా అంటారు. "శ్రీకృష్ణుడు అవతరించే సమయానికి ధర్మాచరణ ఎంతో కఠినంగా ఉండేది. చాలా ఆచారాలు పాటించాల్సి వచ్చేది. దీనివల్ల ఇబ్బందిగా కూడా ఉండేది. ఒక చోట కాకుండా మరో చోట దీపం వెలిగిస్తే భగవంతుడు కోపిస్తాడు. ఎడమచేత్తో ఏదైనా చేస్తే మంచిది కాదు... ఇలాంటి విశ్వాసాలు చాలా ఉండేవి. దీనివల్ల ప్రజలు క్రమంగా ఛాందసులుగా మారారు. ప్రతిదీ మూఢంగా, అంధ విశ్వాసంతో ఆచరించడం ప్రారంభించారు. వారు చాలా కోపిష్టులుగా మారారు. వారిలో ఆనందం, ఉత్సాహం మాయమైపోయాయి. అతి ధర్మాచరణ వల్ల మనుషుల్లో కరువైన ఆనందాన్ని తిరిగి తేవాలనే ఆలోచనతో... శ్రీకృష్ణుడు రంగులతో హోలీ ఆడే సంప్రదాయాన్ని ప్రారంభించాడు. "ఇప్పుడు మీరు మీ ఆత్మ వైపు మరలండి. చిన్న చిన్న విషయాలలో మునిగిపోవాల్సిన అవసరం లేదు. మీ దృష్టిని ఉన్నతమైన విషయాల మీద మరల్చాలి" అని చెప్పాడు. మన సూక్ష్మ శరీరంలో కుడివైపు హృదయ చక్రంలో శ్రీరాముడు, గొంతు దగ్గర ఉండే విశుద్ధ చక్రంలో శ్రీకృష్ణుడు ఉంటారు. సామూహికత, ఆనందం, సంఘ శక్తి... ఇవన్నీ విశుద్ధ చక్రం ఆశీస్సులే. అలాగే మనలోని సూక్ష్మ శరీరంలో ఉండే ఏడు శక్తి కేంద్రాలు భిన్నమైన రంగులను కలిగి ఉంటాయి. మూలాధార చక్రం ఎర్రగా, స్వాధిష్ఠాన చక్రం పసుపుగా, మణిపూరక చక్రం ఆకుపచ్చగా, అనాహత చక్రం గులాబీ రంగులో, విశుద్ధ చక్రం నీలంగా, ఆజ్ఞా చక్రం తెల్లగా, సహస్రార చక్రం సప్తవర్ణాల సమ్మిళితంగా ఉంటాయి. "ఆ చక్రాల తాలూకు అన్ని రంగులను మీమీద చల్లుకోండి. ఆనందంతో, ఉత్సాహంతో, ఉల్లాసంతో ఆడుకోండి. అంత గంభీరంగా ఉండాల్సిన అవసరం ఏమిటి? మీరు భగవంతుణ్ణి చేరినట్టయితే సంతోషంగా ఎందుకులేరు?" అంటూ శ్రీకృష్ణుడు హోలీని ప్రోత్సహించాడు" అని నిర్మలాదేవి వెల్లడించారు.

సభ్యతగా, మర్యాదగా...

కాబట్టి హోలికా దహనం తరువాత జరుపుకొనే హోలీ... దీపావళిలా ఉండాలి. దాని ఆనందం అఖండంగా ఉండాలి. సాధారణ రోజుల్లో ఆర్థిక స్థాయిలు, హోదాల వల్ల కలవని వారు కూడా హోలీ రోజున కలిసిపోతారు. యజమానులు, సేవకులు, బీదా గొప్పా అనే తేడాలు లేకుండా అందరూ ఈ రంగుల ఉత్సవంలో సంతోషంగా పాల్గొంటారు. మన దేశంలో హోలీ అనే ఈ సామాజిక, సామూహిక వేడుక ఈ విధంగానే ప్రారంభమయింది. కాలక్రమేణా ఈ ఉత్సవాలలోనూ పెడధోరణులు చోటుచేసుకున్నాయి. 'సభ్యత, మర్యాద ఉండేదే అసలైన వేడుక' అని గుర్తుంచుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా సహజయోగులు హోలీ పండుగను కామ దహనానికి ప్రతీకగా జరుపుకొంటారు. అగ్ని దేవతను హోమ రూపంలో పూజిస్తారు.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి,
సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

సుభాషితం

స్థాయికి తగిన ప్రతిఫలం

స్నాయువసావశేష మలినమ్మగు
నెమ్ము గ్రహించి జాగిలం
బాయతమోదమందు జన దాకలి
దానికి జెంతనున్న గో
మాయువు దాని జూచి
పరిమార్చక సింగము దంతి
గూల్చు నీ
చాయల నెల్లవారు నిజసత్త్వ
సమాన ఫలార్థులే గదా!

భర్తృహరి తన 'నీతిశతకం'లో రచించిన 'స్వల్ప స్నాయు వసావసేక మలినం...' అనే శ్లోకాన్ని తెలుగువారికి ఏనుగు లక్ష్మణకవి ఈ పద్యం ద్వారా అందించారు.

భావం: అసహ్యమైన వాసన వేస్తున్న చిన్న ఎముక దొరికినా, దానిలో మాంసం లేకపోయినా... శునకం ఆ ఎముకను నాకుతూ సంతృప్తి పడుతుంది. కానీ దానివల్ల ఆ శునకం ఆకలి తీరదు. కానీ మృగరాజైన సింహం తన ఎదురుగా నక్కల్లాంటి జీవులు తిరుగుతున్నా వాటిని వదిలిపెట్టి, మదగజాన్ని వెతికి వేటాడుతుంది. జీవులన్నీ తమ శక్తి సామర్థ్యాలకు తగిన ఫలితాన్నే ఆశిస్తాయి. సమర్థత ఉన్నవారు తక్కువ ఫలితం కోసం పాకులాడకుండా తమ స్థాయికి తగిన ప్రతిఫలం కోసం ప్రయత్నిస్తారు.

పర్వదినం

అదే హోలీ సందేశం

ఆధ్యాత్మికతకు, ఆరాధనాతత్త్వానికి సమన్వయ స్వరూపమే హోలీ మహోత్సవ అంతరార్థం. ఊరూవాడా, చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకొనే పండుగ హోలీ. సర్వమానవ సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచే పర్వదినం. ఫాల్గుణ పూర్ణిమను హోలీ పూర్ణిమగా వ్యవహరిస్తారు. అలాగే 'కాముని పున్నమి', 'కామదహనం', 'ఫాల్గుణోత్సవం' అని కూడా పిలుస్తారు. ఈ పండుగ ప్రస్తావన వివిధ పురాణాలతో పాటు హాలుడి 'గాథా సప్తశతి', వాత్స్యాయనుడి 'కామసూత్రాలు', కాళిదాసు 'మాళవికాగ్నిమిత్రం', దండి 'దశకుమార చరిత్రం' తదితర కావ్యాల్లో విస్తారంగా ఉంది. విదేశీ యాత్రికులైన అల్ బిరూనీ, నికోలో కాంటే... భారతదేశంలో ప్రజలు ఆనందోత్సాహాలతో చేసుకొనే హోలీ వేడుకను 'వసంతోత్సవం'గా వర్ణించారు. హోలీ అనగానే మనలో ముందుగా మెదిలేది రాధా మాధవుల జీవాత్మ-పరమాత్మల సంయోగమే. బృందావనంలో వారిరువురి ప్రణయ జీవనాన్నీ కథలు కథలుగా చెప్పుకొంటున్నాం. వాటిలో హోలీ వైభవమంతా గోచరించి, మనల్ని తన్మయత్వంలో ముంచుతుంది. హిందువుల సంస్కృతీ సంప్రదాయాలకు, ధార్మికతకు, ఆధ్యాత్మిక వైభవానికి నిలువెత్తు దర్పణం.... హోలీ. వసంతకాల ఆగమనం, కొత్త పంటల రాక, శీతగాలులు తొలగి వెచ్చని కిరణాల సోయగంతో భానుడి ప్రకాశం, పున్నమి పవిత్రత, రంగుల విశిష్టత, అందరిమధ్యా సౌభ్రాతృత్వం వెల్లి విరియడం... ఇవన్నీ హోలీ పర్వంలో చూడగలం. హోలీ... వెలుగుకు మేలుకొలుపు. ఇది వ్యక్తిగత ఆకాంక్షలకు, ఆశయాలకు, సర్వ చైతన్య భావస్ఫూర్తికి ప్రతిబింబంగా గోచరిస్తుంది.



హోళికా పూర్ణిమకు సంబంధించిన ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. తారకాసుర సంహారానికి కుమారస్వామి జన్మించడానికి వెనుక మన్మథుణ్ణి శివుడు దహించాడు. రతీదేవి ప్రార్థనకు చలించిన శివుడు ఆమెకు వరాన్ని ప్రసాదించాడు. ఆ రోజు ఫాల్గుణ పూర్ణిమ. మరో కథ ప్రకారం... హోలిక అనే రాక్షసి మరణించిన రోజును హోలీగా పున్నమిగా నిర్వహించుకుంటున్నాం. ఆమె హిరణ్యకశిపుడి సోదరి అని కూడా కొన్ని గ్రంథాలు పేర్కొన్నాయి. ఇలా ఎన్నో కథలు ఉన్నప్పటికీ... ప్రధానంగా శ్రీకృష్ణుడితోనే హోలీ ఎక్కువగా ముడిపడి ఉంది. ఈ రోజున చిన్ని కృష్ణుణ్ణి ఊయలలో ఉంచి, ఉత్సవం నిర్వహిస్తారు. ఉత్కళ, వంగ రాష్ట్రాల్లో దీన్ని డోలోత్సవంగా జరుపుకొంటారు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకూర్మంలో కూడా ఈ ఉత్సవం వైభవంగా జరుగుతుంది.

హోలీ రంగులు మనిషి ధార్మిక జీవనానికి మార్గదర్శులు. సప్తవర్ణాల సమ్మేళనమే తెలుపు. ఇది శాంతికి, సౌజన్యానికి ప్రతీక. కాంతిని పెంచేది ఎరుపు, భాగ్యాన్ని అందించేది పసుపు. వీటి విలక్షణతను అవగాహన చేసుకొని, జగమంతా 'రంగులమయం, రసమయం' అనే భావాన్ని అందిపుచ్చుకోవాలి. ప్రకృతిలో సహజంగా ఉన్న అన్ని వర్ణాల సౌందర్యాన్ని ఆస్వాదించాలి. అదే హోలీ ఉత్సవంలోని సందేశం.

• ఆయపిళ్ళ రాజపాప








నాని నమ్మకం నిజమైంది

ప్రశాంతి తిపిర్నేని




'హిట్' సిరీస్ చిత్రాల నిర్మాత ప్రశాంతి తిపిర్నేని తాజా చిత్రం 'కోర్ట్'. వాల్ పోస్టర్ సినిమా పతాకంపై నాని సమర్పణలో ప్రియదర్శి కథానాయకుడిగా రామ్ జగదీశ్ తెరకెక్కించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా నిర్మాత ప్రశాంతి, సహ నిర్మాత దీప్తి మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ "ఈ కథను దర్శకుడు రామ్‌జగదీశ్ చాలా బాగా రాశారు. చాలా లేయర్స్ ఉన్న ఈ సినిమా స్ర్కీన్‌ప్లే అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. పెయిడ్ ప్రీమియర్స్‌కు అద్భుత స్పందన వస్తోంది. ముఖ్యంగా సెకండాఫ్‌ను ప్రేక్షకులు విపరీతంగా ఇష్టపడుతున్నారు. ప్రీమియర్స్‌కు వచ్చిన కొందరు లాయర్స్ సినిమా చాలా సహజంగా ఉందని మెచ్చుకున్నారు. సినిమాల విషయంలో నాని జడ్జిమెంట్ తప్పు కాదని కోర్ట్‌తో మరోసారి రుజువైంది. ఇందులో ప్రియదర్శి పాత్ర ఆయన కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచిపోతుంది. మంగపతిగా నటించిన శివాజీ పాత్రనూ ప్రేక్షకులు బాగా రిసీవ్ చేసుకున్నారు. 'హిట్ 3' విడుదల తర్వాత కొత్త ప్రాజెక్ట్స్‌ను ప్రకటిస్తాం" అని అన్నారు. సహ నిర్మాత దీప్తి మాట్లాడుతూ "రామ్ జగదీశ్ మంచి ప్రతిభావంతుడు. ఈ కోర్ట్ రూమ్ డ్రామాను చాలా ఆసక్తికరంగా మలిచాడు. సినిమాలోని ప్రతీ పాత్ర గుర్తుండిపోతుంది. సినిమా కచ్చితంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. భావోద్వేగాలు, కోర్ట్ సన్నివేశాలు, సంగీతం సినిమాకు ప్రధానాకర్షణ" అని చెప్పారు.

జీవితంలోనూ ఛాంపియన్



నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ నటిస్తున్న తాజా చిత్రం 'ఛాంపియన్'. ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాకు ప్రదీప్ అద్వైతం దర్శకుడు. ఇప్పటికే విడుదలైన చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. రోషన్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేశారు. ఇందులో ఫుట్‌బాల్ ఆటగాడిగా రోషన్‌ను పరిచయం చేశారు. బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా, ధైర్యంగా నిలబడడం ఆకట్టుకుంది. మైదానంలోనే కాదు జీవితంలో కూడా నిజమైన ఛాంపియన్‌గా ఎదగడానికి చేసే పోరాటంగా ఈ చిత్రం ఉండబోతోంది. మిక్కీ జే మేయర్ అందించిన నేపథ్య సంగీతం హైలైట్‌గా నిలిచింది. తోట తరణి కళా దర్శకత్వం ఈ చిత్రం గొప్పతనాన్ని మరింత పెంచుతుంది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ కాన్సెప్ట్ ఫిల్మ్ సంస్థలు నిర్మిస్తున్నాయి.

శక్తిమంతమైన లుక్‌లో...



తమిళ కథానాయకుడు విజయ్ ఆంటోని కథానాయకుడిగా నటిస్తూ, నిర్మిస్తున్న తాజా చిత్రం 'భద్రకాళి'. ఆయనకు ఇది 25వ చిత్రం కావడం విశేషం. అరుణ్ ప్రభు దర్శకుడు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. విజయ్ ఆంటోని ఇందులో ఫ్యామిలీ మ్యాన్‌గా, గ్యాంగ్‌స్టర్‌గా, ఉన్నతాధికారిగా పలు శక్తిమంతమైన లుక్స్‌లో కనిపించారు. సంభాషణలు, విజువల్స్ ఆకట్టుకున్నాయి. త్వరలోనే సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా విజయ్ కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచిపోతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: రేమండ్ డెరిక్ క్రాస్టా, సినిమాటోగ్రఫీ: షెల్లీ కాలిస్ట్, సంగీతం: విజయ్ ఆంటోని.

ఆమెతో డేటింగ్‌లో ఉన్నా



ఆమిర్‌ఖాన్

తన స్నేహితురాలు గౌరీ స్ప్రాట్‌తో ఏడాదిన్నరగా డేటింగ్‌లో ఉన్నట్లు బాలీవుడ్ హీరో ఆమిర్‌ఖాన్ వెల్లడించారు. ఆమెతో తనది పాతికేళ్ల పరిచయం అన్నారు. ప్రస్తుతం గౌరీ తన ప్రొడక్షన్ హౌస్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు. నేడు ఆమిర్‌ఖాన్ 60వ పుట్టిన రోజు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన పుట్టిన రోజు వేడుకల్లో ఆయన గౌరీ స్ప్రాట్‌తో తన అనుబంధాన్ని మీడియాతో పంచుకున్నారు. గౌరీ స్ప్రాట్ ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్నారనీ, ఆమెకు గతంలో పెళ్లైందనీ, ఆరేళ్ల కుమారుడు కూడా ఉన్నాడని చెప్పారు. నాతో పాటు మా కుటుంబ సభ్యులు కూడా ఆమెతో అనుబంధం పట్ల సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. పుట్టిన రోజు సందర్భంగా నా స్నేహితులు షారూఖ్‌ఖాన్, సల్మాన్‌ఖాన్‌కు ఇచ్చిన పార్టీకి కూడా గౌరి హాజరయినట్లు తెలిపారు. గతంలో రీనాదత్తా, కిరణ్‌రావును వివాహం చేసుకొన్న ఆమిర్ కొన్నాళ్ల తర్వాత విడాకులు తీసుకున్నారు.

చాలా బాగుంది శ్రుతీ





కథానాయికగా దక్షిణాదిన సత్తా చాటిన శ్రుతీహాసన్ కొన్ని హిందీ చిత్రాల్లోనూ కనిపించారు. 'ద ఐ' చిత్రంతో ఆమె హాలీవుడ్ అరంగేట్రం చేయబోతున్నారు. ఇటీవలే చిత్ర బృందం శ్రుతి పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ చిత్రం ట్రైలర్‌ను షేర్ చేసిన నయనతార 'చాలా బాగుంది శ్రుతీ' అంటూ ప్రశంసించారు. ట్రైలర్‌లో శ్రుతి నటన అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు. 'ద ఐ'తో హాలీవుడ్‌లో శ్రుతికి శుభారంభం దక్కాలని ఆకాంక్షించారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో 'ద ఐ' చిత్రాన్ని ప్రదర్శించారు. 'నా కెరీర్‌లో ఇదో డిఫరెంట్ మూవీ అవుతుంది' అని శ్రుతీహాసన్ పేర్కొన్నారు. డాఫ్నే ష్మోన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మార్క్‌రౌలీ కీలకపాత్ర పోషించారు. భర్త ఫెలిక్స్ కోసం అన్వేషిస్తూ సాగించే ప్రయాణం నేపథ్యంలో సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. ఇందులో శ్రుతి డయానా అనే పాత్ర పోషించారు. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ' చిత్రంలో ఆమె నటిస్తున్నారు.

ప్రేక్షకులతో విజిల్స్ వేయిస్తాం

కిరణ్ అబ్బవరం



కిరణ్ అబ్బవరం, రుక్సర్ ఢిల్లాన్ జంటగా నటించిన చిత్రం 'దిల్‌రూబా'. విశ్వకరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేశ్‌రెడ్డి, సారెగమ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "ప్రేమ, స్నేహంతో పాటు కుటుంబ విలువలు కలగలసిన అద్భుతమైన కథ ఇది. కథనం చాలా కొత్తగా ఉంటుంది. దర్శకుడు విశ్వ కరుణ్ సినిమాలో రాసిన డైలాగ్స్ సన్నివేశాలు ప్రేక్షకులతో విజిల్స్ వేయిస్తాయి. యూత్‌తో పాటు ఫ్యామిలీస్‌కు కనెక్ట్ అయ్యే చిత్రమిది. నటుడిగా నన్ను మరో మెట్టు ఎక్కించే ఈ చిత్రం నా కెరీర్‌లో ప్రత్యేకం. సినిమా తప్పకుండా అందరికీ మంచి వినోదాన్ని అందిస్తుంది. విజయంపై పూర్తి నమ్మకముంది" అని చెప్పారు. దర్శకుడు విశ్వకరుణ్ మాట్లాడుతూ "మనుషుల మధ్య తగ్గిపోయిన విలువలు, బంధాలను ఈ సినిమా తిరిగి గుర్తుచేస్తుంది. మంచి లవ్‌స్టోరీతో పాటు మాస్ ప్రేక్షకులను మెప్పించే ఫైట్స్ ఇందులో ఉన్నాయి. ఈ సినిమా ట్రైలర్ చూసిన దర్శకులు పూరి జగన్నాథ్, మెహర్ రమేశ్ ఫోన్ చేసి అభినందించారు. కిరణ్‌ను కొత్తగా చూపించే చిత్రమిది" అని అన్నారు. హీరోయిన్ క్యాతీ డేవిసన్ మాట్లాడుతూ "ఇందులో మ్యాగీ పాత్రను పోషించాను. ఇటువంటి మంచి రోల్ దక్కడం నా అదృష్టం. సినిమా చూసిన ప్రతీ ఒక్కరూ భావోద్వేగానికి లోనవుతారు" అని తెలిపారు.

కడుపుబ్బా నవ్వించే చిత్రం



కమెడియన్ సప్తగిరి కథానాయకుడిగా అభిలాశ్ రెడ్డి గోపిడి తెరకెక్కించిన వినోదాత్మక చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. దిల్‌రాజు సమర్పణలో కె.వై.బాబు, భానుప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్‌రెడ్డి ముత్యాల నిర్మించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతుంది. తాజాగా, ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. "36 ఏళ్లు వచ్చినా పెళ్లికాని ఓ వ్యక్తి కథ ఇది. సినిమా కడుపుబ్బా నవ్విస్తుంది. సప్తగిరి మార్క్ వినోదం గ్యారంటీ" అని మేకర్స్ తెలిపారు. శ్రీనివాస్, మురళీధర్ గౌడ్, లక్ష్మణ్, రోహిణి, ప్రియాంక శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: మధు, డీఓపీ: సుజాత సిద్ధార్థ్, సంగీతం: శేఖర్ చంద్ర.





బిజినెస్

వరంగల్ ● శుక్రవారం 14 మార్చి 2025



హల్దీరామ్స్‌లో టెమాసెక్‌కు 10% వాటా

- రూ.8,500 కోట్లకు కొనుగోలు
- దేశీయ ప్యాక్డ్ ఫుడ్ రంగంలో ఇప్పటివరకిదే అతిపెద్ద డీల్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద ప్యాక్డ్ స్నాక్ అండ్ స్వీట్స్ కంపెనీ, రెస్టారెంట్ల ఆపరేటర్ హల్దీరామ్ స్నాక్స్ ఫుడ్‌లో 10 శాతం వాటాను సింగపూర్ ప్రభుత్వ పెట్టుబడి సంస్థ టెమాసెక్ కొనుగోలు చేసినట్లు ఇండస్ట్రీ వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి ఇరువర్గాల మధ్య విధిగా కట్టుబడి ఉండే ఒప్పందం ఈ నెల 11న (మంగళవారం) కుదిరినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ఈ ఒప్పందంలో భాగంగా హల్దీరామ్ స్నాక్ ఫుడ్ మార్కెట్ విలువను 1,000 కోట్ల డాలర్లు (దాదాపు రూ.85,000 కోట్లు)గా లెక్కగట్టినట్లు సమాచారం. అంటే, సంస్థలో 10 శాతం వాటా కోసం టెమాసెక్ 100 కోట్ల డాలర్లు (రూ.8,500 కోట్లు) చెల్లించనుంది. దేశీయ ప్యాక్డ్ ఫుడ్ ఇండస్ట్రీలో ఇప్పటివరకిదే అతిపెద్ద వాటా కొనుగోలు ఒప్పందం. అంతేకాదు, హల్దీరామ్ ప్రమోటర్లైన అగర్వాల్ కుటుంబం ప్రస్తుతం సంస్థలో 100 శాతం వాటా కలిగి ఉంది. అగర్వాల్ కుటుంబం వాటా విక్రయించడం ఇదే తొలిసారి. వ్యాపార విస్తరణకు నిధులు సమీకరించేందుకు సంస్థలో వాటా విక్రయించాలని అగర్వాల్ ఫ్యామిలీ గత కొన్ని నెలలుగా బ్లాక్‌స్టోన్, ఆల్ఫావేవ్, బెయిన్ క్యాపిటల్ సహా పలు ఇన్వెస్టర్లతో సంప్రదింపులు సాగించింది. గతంలో మెజారిటీ వాటా విక్రయం కోసం ప్రయత్నించినప్పటికీ మైనారిటీ వాటా ఉపసంహరణతో సరిపెట్టుకుంది.

మరో 5 శాతం వాటా విక్రయం!?

అగర్వాల్ కుటుంబం కంపెనీలో మరో 5 శాతం వాటాను విక్రయించే యోచనలో ఉన్నదని, ఇందుకోసం ఇతర ఇన్వెస్టర్లతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్‌తో పాటు టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. అంతేకాదు, నిధుల సమీకరణ కోసం హల్దీరామ్ వచ్చే ఏడాది ఐపీఓకు సైతం వచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

1937లో ప్రారంభం: హల్దీరామ్స్ 1937లో రాజస్థాన్‌లోని బికనేర్‌లో కేవలం మిఠాయిలు, చిరుతిళ్ల విక్రయ కొట్టుగా ప్రారంభమైంది. గంగ బిషన్ అగర్వాల్ దీన్ని ప్రారంభించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి సంస్థగా అవతరించింది. హల్దీరామ్స్ ఉత్పత్తులను ప్రస్తుతం భారత్‌లోనే కాదు, 80కి పైగా దేశాల్లో విక్రయిస్తున్నారు. 2023-24లో కంపెనీ రూ.12,500 కోట్లకు పైగా ఆదాయం నమోదు చేసింది.

2028 నాటికి భారత్ @3

ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే చాన్స్ ● మోర్గాన్ స్టాన్లీ

న్యూఢిల్లీ: భారత్ 2028 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని, అప్పటికి భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం 5.7 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.495 లక్షల కోట్లు) చేరుతుందని అంతర్జాతీయ ఆర్థిక సర్వీసుల సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. 2023లో 3.5 లక్షల కోట్ల డాలర్లున్న భారత ఆర్థిక వ్యవస్థ 2026 నాటికి 4.7 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని, ఫలితంగా అమెరికా, చైనా, జర్మనీ తర్వాతి స్థానంలో నాలుగో పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుందని పేర్కొంది.

అత్యంత ఆకర్షణీయ వినియోగ మార్కెట్‌గా మారడం, ప్రపంచ ఉత్పాదకతలో తన వాటా పెంచుకోవడం, విధానపరమైన మద్దతుతో సాధించిన స్థూల ఆర్థిక స్థిరత్వం, మెరుగైన మౌలిక వసతులు ఇందుకు కారణమని తాజా నివేదికలో తేల్చి చెప్పింది. 1990లో 12వ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ 2000 నాటికి 13వ స్థానానికి దిగజారింది. ఆ తర్వాత తిరిగి పుంజుకుని 2020 నాటికి 9వ స్థానానికి, 2023 నాటికి ఐదో స్థానానికి చేరింది. ప్రపంచ జీడీపీలో భారత్ వాటా ప్రస్తుతం 3.5 శాతం ఉండగా 2029 నాటికి 4.5 శాతానికి చేరుతుందని తెలిపింది.



మరో పావు శాతం రెపో కోత ఖాయం

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) క్రమంగా ద్రవ్య విధానంపై పట్టు సడలిస్తోందని పేర్కొంటూ ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చినందు వల్ల ఏప్రిల్ సమీక్షలో రెపో రేటును మరో 0.25% తగ్గించవచ్చని పేర్కొంది. ఫిబ్రవరి సమీక్షలో ఆర్‌బీఐ రెపోరేటును ఒక పావు శాతం తగ్గించిన సంగతి తెలిసిందే.

వృద్ధి గమనంలో మూడు ధోరణులు

భారత వృద్ధి గమనాన్ని మూడు ధోరణులుగా మోర్గాన్ స్టాన్లీ వర్గీకరించింది. ఒకటి బేర్, రెండోది బేస్, మూడోది బుల్ దశ. బేర్ దశలో అయితే ప్రస్తుతం 3.65 లక్షల కోట్ల డాలర్లున్న ఆర్థిక వ్యవస్థ 2035 నాటికి 6.6 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుంది. అదే బేస్ దశలో అయితే 8.8 లక్షల కోట్ల డాలర్లకు, బుల్ దశలో అయితే 10.3 లక్షల కోట్ల డాలర్లకు చేరవచ్చని జోస్యం చెప్పింది. 2025లో 2,514 డాలర్లున్న తలసరి జీడీపీ సైతం బేర్ దశలో 4,247 డాలర్లకు, బేస్ దశలో 5,683 డాలర్లకు, బుల్ దశలో 6,706 డాలర్లకు చేరవచ్చని అంచనా వేసింది.

ఈ ఏడాది వృద్ధి 6.3%

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.3%, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.5% వృద్ధి సాధించవచ్చని అంచనా వేసింది. గత కొద్ది వారాల్లో ప్రధాన ఆర్థిక సూచీల కదలికలు మిశ్రమంగా ఉన్నప్పటికీ రెండు నెలల క్రితం పరిస్థితి కన్నా చాలా మెరుగ్గా ఉన్నట్టు పేర్కొంది. రాబోయే కాలంలో రికవరీ విస్తృత స్థాయిలో ఉంటుందని, బడ్జెట్లో ప్రకటించిన ఐటీ కోతలు పట్టణ డిమాండ్‌ను పెంచుతాయని పేర్కొంది. ప్రస్తుతం ప్రభుత్వ, గృహ రంగాల్లోని పెట్టుబడులు వృద్ధికి ఊతం ఇస్తున్నాయంటూ కార్పొరేట్ పెట్టుబడులు కూడా క్రమంగా పుంజుకుంటున్నట్టు తెలిపింది.

ట్రంప్ సుంకాలతో ఫార్మాలో అనిశ్చితి

అరబిందో ఫార్మా సీఎఫ్ఓ సంతానం సుబ్రమణియన్

హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలతో భారత ఫార్మా కంపెనీలూ బెదిరిపోతున్నాయి. ఈ హెచ్చరికలతో ఫార్మా రంగంలో ప్రస్తుతం ఔనన్నా కాదన్నా అనిశ్చితి నెలకొందని అరబిందో ఫార్మా సీఎఫ్ఓ సంతానం సుబ్రమణియన్ 'ఈటీ నౌ' బిజినెస్ న్యూస్ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే అమెరికాతో పాటు ఇతర దేశాల మార్కెట్లపైనా దృష్టి పెడుతున్నందున ఈ ప్రభావం తమ కంపెనీపై పెద్దగా ఉండకపోవచ్చన్నారు. తమ ఎగుమతుల్లోని టాప్ 10 ఔషధాల్లో అమెరికా వాటా 20 శాతానికి మించిలేదన్నారు. కాబట్టి ట్రంప్ సర్కార్ సుంకాలు పెంచినా ఆ ప్రభావం తమపై పెద్దగా ఉండక పోవచ్చన్నారు.

వృద్ధి ఒక్కటే లక్ష్యం కాదు: వృద్ధి ఒక్కటే తమ కంపెనీ లక్ష్యం కాదని సంతానం స్పష్టం చేశారు. వృద్ధితో పాటు సుస్థిర లాభాలు, టర్నోవర్‌పైనా ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. వ్యాపార విస్తరణ కోసం ఇంజెక్టబుల్స్, పెప్టైడ్స్, బయోసిమిలర్స్‌పైనా దృష్టి పెట్టినట్టు చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) రెండో త్రైమాసికంలోగా బయోసిమిలర్ ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభమవుతుందని సంతానం చెప్పారు.

జెనరేటివ్ ఏఐతో బ్యాంకింగ్‌కు మేలే

న్యూఢిల్లీ: జెనరేటివ్ ఏఐ (జెన్ ఏఐ) భారత బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాలను కూడా షేక్ చేస్తోంది. దీని వినియోగంతో 2030 నాటికి ఫైనాన్షియల్ రంగం ఉత్పాదకత 34 నుంచి 38 శాతం, బ్యాంకింగ్ రంగం ఉత్పాదక 46 శాతం మేర పెరగనుంది. ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ ఈవై గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. ఖర్చులు తగ్గించుకుని, ఉత్పాదకత పెంచుకునేందుకు అనేక ఆర్థిక సేవల కంపెనీలు ప్రస్తుతం పెద్దఎత్తున జెన్ ఏఐ బాట పడుతున్నాయి. దీంతో ఆ కంపెనీల కస్టమర్ ఎంగేజ్‌మెంట్, నిర్వహణా సామర్థ్యం, నష్ట భయం (రిస్క్) మదింపు సామర్థ్యాలు గణనీయంగా పెరిగాయి. ఆర్థిక సేవలు, రిటైల్, హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్, టెక్నాలజీ, ఆటోమోటివ్, పరిశ్రమలు, ఇంధన రంగాలకు చెందిన 125 మంది కీలక అధికారులను సంప్రదించి ఈవై ఈ నివేదిక రూపొందించింది.

రికార్డు గరిష్ఠానికి బంగారం

రూ.89,450కి పెరిగిన 10 గ్రాముల ధర

న్యూఢిల్లీ: దేశీయంగా పసిడి ధర గత రికార్డు గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.600 పెరుగుదలతో రూ.89,450కి చేరుకుంది. గత నెల 20న మేలిమి బంగారం ఇదే ధర పలికింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం విషయానికొస్తే, రూ.600 పెరిగి రూ.89,050కి ఎగబాకింది. ఇక కిలో వెండి మరో రూ.1,000 మేర ప్రియమై దాదాపు ఐదు నెలల నాటి గరిష్ఠ స్థాయి రూ.1,01,200కు చేరింది.

జానకి పులపర్తికి ఫోర్బ్స్ అండర్ 40 లీడర్స్ పురస్కారం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఏఐ ఆధారిత డ్రోన్ ఇన్నోవేషన్‌లో అగ్రగామిగా ఉన్న అకిన్ అనలిటిక్స్ వ్యవస్థాపకురాలు, సీఈఓ జానకి పులపర్తి 2025 సంవత్సరానికి ఫోర్బ్స్ 40 అండర్ 40 లీడర్స్ పురస్కారానికి ఎంపికయ్యారు. టెక్నాలజీ పట్ల ఆసక్తి గల బాలిక స్థాయి నుంచి డీప్ టెక్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆమె ఎదిగిన తీరుకు ఈ పురస్కారం ఒక గుర్తింపుగా భావించవచ్చు. 2022లో అకిన్ టెక్నాలజీస్‌ను ప్రారంభించిన ఆమె.. సైనికులను క్షేత్రస్థాయిలో అప్రమత్తం చేసే 125 గ్రాముల బరువుండే నానో రెకాన్ డ్రోన్‌ను అందించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ నమో డ్రోన్ దీదీ కార్యక్రమానికి ఉత్తేజితురాలై గ్రామీణ రైతులకు సహాయపడేందుకు ఏఐ ఆధారిత డ్రోన్ స్ప్రేయింగ్ వ్యవస్థను అందించారు.

సెన్సెక్స్ ఐదో రోజూ డౌన్

200 పాయింట్లు నష్టపోయిన సూచీ

ముంబై: స్టాక్ మార్కెట్లో నష్టాలు కొనసాగాయి. రియల్టీ, ఐటీ, ఆటో రంగ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణమయ్యాయి. గురువారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ మరో 200.85 పాయింట్లు కోల్పోయి 73,828.91 వద్దకు జారుకుంది. సూచీ నష్టపోవడం వరుసగా ఇది ఐదో రోజు. నిఫ్టీ విషయానికొస్తే, 73.30 పాయింట్లు క్షీణించి 22,397.20 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 8 రాణించగా.. 22 నష్టపోయాయి. జొమాటో షేరు 1.97 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. టాటా మోటార్స్, ఇండస్ఇండ్ బ్యాంక్ 1.95 శాతం వరకు తగ్గాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం అర శాతానికి పైగా పెరిగాయి.

ఎల్‌జీ రూ.15,000 కోట్ల ఐపీఓకు సెబీ ఆమోదం: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జీకి భారత అనుబంధ విభాగమైన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ప్రతిపాదనకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓ ద్వారా ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియాలో 15 శాతం వాటాకు సమానమైన 10.18 కోట్ల షేర్లను మాతృసంస్థ విక్రయించనుంది. తద్వారా రూ.15,000 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.

యూపీఎస్ఐ పరిధి పెంపు సెబీ

క్యాపిటల్ మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ.. షేర్ల ధరలను ప్రభావితం చేయగలిగే అప్రకటిత సమాచారం (యూపీఎస్ఐ) పరిధిని మరింత విస్తరించింది. ఇందుకు సంబంధించి ఈ నెల 11న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. ఏదైనా ప్రతిపాదిత నిధుల సమీకరణ కార్యకలాపాలు, ఈఎస్‌జీ రేటింగ్ మినహా ఇతర క్రెడిట్ రేటింగ్ సవరణ, యాజమాన్యం లేదా కంపెనీ నియంత్రణను ప్రభావితం చేసే ఒప్పందాలు, కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియలో పరిష్కార ప్రణాళికకు ఆమోదం, వన్‌టైం బ్యాంక్ సెటిల్‌మెంట్, రుణాల పునర్‌వ్యవస్థీకరణ, బ్యాంక్‌లు లేదా ఆర్థిక సంస్థల నుంచి రుణాల సేకరణ సమాచారం కూడా యూపీఎస్ఐ పరిధిలోకి వస్తాయి. కాబట్టి, కంపెనీలు ఈ సమాచారాన్ని స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెంటనే వెల్లడించాల్సి ఉంటుంది. కొత్త నిబంధనలు జూన్ 10 నుంచి అమలులోకి వస్తాయని సెబీ స్పష్టం చేసింది.

నేడు మార్కెట్లకు సెలవు

హోలీ పండగ సందర్భంగా శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. సోమవారం మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ



హైదరాబాద్	385	విజయవాడ	420
వరంగల్	387	గోదావరి	390
చిత్తూరు	443	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	78	విజయవాడ	85
వరంగల్	78	గుంటూరు	85
కరీంనగర్	78	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	78	చిత్తూరు	84
కర్నూలు	78	నెల్లూరు	89
విశాఖపట్నం	79	అనంతపురం	89
గోదావరి	85		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)




	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	88,580 ▲	81,200 ▲	1,10,000 ▲
విజయవాడ	89,500 ▲	84,500 ▲	1,01,000 ▲
విశాఖపట్నం	87,080 ▲	79,820 ▲	99,150 ▼
రాజమండ్రి	88,580 ▲	81,200 ▲	1,00,700 ▲
ప్రొద్దుటూరు	88,250 ▲	81,720 ▲	99,200 ▲
ముంబై	86,843 ▲	79,548 ▲	98,322 ▲

స్పోర్ట్స్

లక్ష్య సేన్ సంచలనం


క్వార్టర్స్‌కు గాయత్రి జోడీ



అలవోకగా క్వార్టర్స్‌కు
- వైదొలిగిన సాత్విక్ జంట
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్

బర్మింగ్‌హమ్: డిఫెండింగ్ చాంపియన్ జొనాథన్ క్రిస్టీకి షాకిచ్చిన భారత ఏస్ షట్లర్ లక్ష్య సేన్, గాయత్రి జోడీ ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్స్‌కు దూసుకెళ్లగా.. ఏడో సీడ్ సాత్విక్ సాయిరాజ్ జంట నిష్క్రమించింది. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో లక్ష్యసేన్ 21-13, 21-10తో వరల్డ్ నెం:2 జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై వరుస గేముల్లో సునాయాసంగా నెగ్గాడు. క్వార్టర్స్‌లో లి షి ఫెంగ్ (చైనా)తో సేన్ తలపడనున్నాడు. తొలి గేమ్ ఆరంభం నుంచే సేన్ ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించాడు. 4-0తో ముందంజ వేసిన భారత షట్లర్ చివరి వరకు అదే జోరుతో గేమ్‌ను దక్కించుకొన్నాడు. ఇక, రెండో గేమ్ ఆరంభంలో నువ్వానేనా అన్నట్టుగా సాగినా.. ఒక్కసారిగా పుంజుకొన్న సేన్ పదునైన స్మాష్‌లతో మ్యాచ్‌ను ముగించాడు. ఇక మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోడ్ 16-21, 13-21తో అకానె యమగూచి (జపాన్) చేతిలో ఓడింది. డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో చైనా జంట జి హో నన్-జంగ్ వి హన్‌తో మ్యాచ్‌లో 16-21, 2-2తో వెనుకంజలో ఉన్న సమయంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి ద్వయం వైదొలిగింది. చిరాగ్ షెట్టికి వెన్నునొప్పి తిరగబెట్టడంతో మధ్యలోనే భారత జంట రిటైరైంది. ట్రీసా జాలీ-గాయత్రి జోడీ 15-21, 21-18, 21-18తో కొరియాకు చెందిన కిమ్ హై జియాంగ్-కాంగ్ హి యంగ్‌పై గెలిచింది. మిక్స్‌డ్‌లో రోహన్ కపూర్-రుత్విక శివాని ద్వయం 10-21, 12-21తో చైనాకు చెందిన ఫెంగ్ యాన్ జీ-చి య జిన్ చేతిలో పరాజయం పాలైంది.

'హార్దిక్ గొప్ప ఆల్‌రౌండరేమీ కాదు'



న్యూఢిల్లీ: ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా భారత జట్టు విజయాలలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇటీవలి చాంపియన్స్ ట్రోఫీలోనూ బ్యాట్, బంతితో సత్తా చాటాడు. పాకిస్థాన్ మాజీ స్పీడ్‌స్టర్ షోయబ్ అక్తర్..హార్దిక్ నైపుణ్యాలను మెచ్చుకొంటూనే..అతడు మాల్కం మార్షల్, వకార్ యూనిస్ స్థాయి బౌలర్ కాదని అభిప్రాయపడ్డాడు. కాగా..హార్దిక్ కన్నా తమ ఆటగాడు అబ్దుల్ రజాక్ మెరుగైన ఆల్‌రౌండర్ అని మాజీ కెప్టెన్ మహ్మద్ హఫీజ్ అన్నాడు.

మతం మారనందుకే.. కెరీర్ నాశనం!

- పాక్ మాజీ క్రికెటర్ కనేరియా



న్యూయార్క్: పాకిస్థాన్ క్రికెట్ టీమ్‌లో తాను ఎదుర్కొన్న వివక్ష గురించి ఆదేశ మాజీ స్పిన్నర్ డానిష్ కనేరియా (44) సంచలన విషయాలు బయటపెట్టాడు. మతం మారనందుకే తన కెరీర్‌ను నాశనం చేశారని ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న కనేరియా వాపోయాడు. మైనారిటీగా పాక్‌లో ఎన్నో కష్టాలు, అవమానాలను ఎదుర్కొన్నానని చెప్పాడు. షాహిద్ అఫ్రీది కెప్టెన్‌గా ఉన్నప్పుడు తనను మతం మారమని తీవ్రంగా ఒత్తిడి చేసేవాడని తెలిపాడు. అయితే ఇంజమామ్ ఒక్కడే తనకు మద్దతుగా నిలిచాడన్నాడు. అఫ్రీది, షోయబ్ అక్తర్ ఎవరూ తనతో కలసి తినేవారు కూడా కాదన్నాడు. పాక్ తరఫున డానిష్ 61 టెస్టులు, 18 వన్డేలు ఆడాడు.

క్వార్టర్స్‌లో హైదరాబాద్

బీసీసీఐ మహిళల వన్డే ట్రోఫీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న బీసీసీఐ మహిళల అండర్-23 వన్డేట్రోఫీలో హైదరాబాద్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో హిమాచల్‌ప్రదేశ్‌పై హైదరాబాద్ 108 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 8 వికెట్లకు 205 రన్స్ చేసింది. కెప్టెన్ మమత అర్ధ శతకం (76)తో రాణించింది. ఛేదనలో స్పిన్నర్ ధ్రుతి కేసరి (4/23) చెలరేగింది. హిమాచల్‌ప్రదేశ్ 32.4 ఓవర్లలో 97 పరుగులకు ఆలౌటైంది. ఈనెల 21న గువాహటిలో క్వార్టర్స్ జరగనుంది.

పారా అథ్లెట్ రవికి కాంస్యం




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రీలో ఆంధ్రప్రదేశ్‌కు మూడో పతకం లభించింది. న్యూఢిల్లీలో జరుగుతున్న ఈ పోటీల్లో గురువారం ముగిసిన ఎఫ్ 40 విభాగం షాట్‌పుట్ పోటీల్లో అనకాపల్లి క్రీడాకారుడు ఆర్.రవి కాంస్యం సాధించాడు. డెనిస్ గ్నెజిడ్లోవ్ (రష్యా) స్వర్ణం, ఐయాల్ సివెట్సవ్ (అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ) రజతం నెగ్గారు.

నేటి నుంచి వైజాగ్ ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి స్పోర్ట్స్): సాగరతీరంలో ఐపీఎల్ సందడి మొదలైంది. ఈ ఐపీఎల్‌లో విశాఖపట్నం రెండు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుండడం తెలిసిందే. ఈనెల 24 రాత్రి 7.30 గంటలకు విశాఖలో జరగనున్న ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ)-లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మ్యాచ్ టిక్కెట్లను శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి జొమాటో డిస్ట్రిక్ట్ యాప్‌లో విక్రయించనున్నారు. ఈ సీజన్‌లో ఢిల్లీ తమ తొలి మ్యాచ్‌ను విశాఖలోనే ఆడనుంది. ఈనెల 30వ తేదీన ఢిల్లీ క్యాపిటల్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరగనున్న రెండో మ్యాచ్ టిక్కెట్లను ఎప్పటి నుంచి విక్రయించనున్నారో డీసీ నుంచి అధికారిక ప్రకటన రాలేదు.

భారత్.. ఒకేరోజు మూడు ఫార్మాట్లలో ఆడగలదు



సిడ్నీ: భారత క్రికెట్‌లో అద్భుత ఆటగాళ్లకు కొదవ లేదని ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ కొనియాడాడు. 'ఒకే రోజు ఆసీస్‌తో టెస్టును, ఇంగ్లండ్‌తో వన్డేను, దక్షిణాఫ్రికాతో టీ20 ఆడి పోటీనివ్వగల సత్తా భారత జట్టుకు ఉంది. ప్రపంచంలో మరే జట్టుకూ ఈ అవకాశంలేదు ఐపీఎల్ ద్వారా వారికి నైపుణ్యం కలిగిన క్రికెటర్లు లభిస్తున్నారు. అందుకే చాంపియన్స్ ట్రోఫీలో భారత్ విజేతగా నిలవడం నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. కానీ దుబాయ్‌లో వారికి లబ్ధి చేకూరిందని చెప్పలేం. ఎందుకంటే భారత్ మినహా ఇతర దేశాల ఆటగాళ్ల ప్రపంచంలోని అన్ని వేదికల్లో జరిగే లీగ్‌ల్లో ఆడతారు. కానీ భారత ప్లేయర్లు కేవలం ఐపీఎల్‌లో మాత్రమే కనిపిస్తారు' అని స్టార్క్ తేల్చాడు.

ఢిల్లీ.. కాచుకో

- ఫైనల్లో ముంబై ఇండియన్స్
- సివర్, మాథ్యూస్ హాఫ్ సెంచరీలు
- ఎలిమినేటర్‌లో గుజరాత్ చిత్తు
- మహిళల ప్రీమియర్ లీగ్



హేలీ మాథ్యూస్ (77 పరుగులు, 3 వికెట్లు)

నాట్ సివర్ (77)

ముంబై: అదిరే ఆటతో ముంబై ఇండియన్స్ మహిళల ప్రీమియర్ లీగ్ ఫైనల్లో ప్రవేశించింది. గురువారం గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన ఎలిమినేటర్‌లో విజృంభించిన హర్మన్ సేన 47 పరుగుల తేడాతో ఘనవిజయం అందుకుంది. దీంతో శనివారం జరిగే ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 4 వికెట్లకు 213 పరుగుల భారీ స్కోరు సాధించింది. నాట్ సివర్ బ్రంట్ (41 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 77), హేలీ మాథ్యూస్ (50 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 77), కెప్టెన్ హర్మన్ (12 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 36) తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. గిబ్సన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 19.2 ఓవర్లలో 166 పరుగులకు కుప్పకూలింది. గిబ్సన్ (34), లిచ్‌ఫీల్డ్ (31), భారతి (30) మాత్రమే రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ మాథ్యూస్‌కు మూడు, అమెలియాకు రెండు వికెట్లు దక్కాయి.

నిలకడలేమితో..: భారీ ఛేదనలో గుజరాత్ పూర్తిగా తేలిపోయింది. ముంబై బౌలర్ల జోరుకు ఓపెనర్ బెత్ మూనీ (6), హర్లీన్ (8), కెప్టెన్ గార్డ్‌నర్ (8) తొలి ఆరు ఓవర్లలోనే పెవిలియన్‌కు చేరడం ప్రభావం చూపింది. అయితే మరో ఓపెనర్ గిబ్సన్‌తో పాటు మిడిలార్డర్‌లో భారతి ఫుల్మలి, లిచ్‌ఫీల్డ్ వేగంగా ఆడే ప్రయత్నం చేశారు. కానీ సరైన సమయంలో వీరిని పెవిలియన్‌కు చేర్చడంలో ముంబై సఫలమైంది. 15వ ఓవర్‌లో సిమ్రన్ 4,4,6.. తర్వాతి ఓవర్‌లో ఫుల్మలి 4,4తో గుజరాత్ 8 బంతుల్లోనే 27 పరుగులు సాధించి కాస్త ఉత్కంఠ పెంచింది. కానీ ఫుల్మలిని మాథ్యూస్ అవుట్ చేయడంతో ఇక జెయింట్స్ కోలుకోలేదు.

బాదుడే బాదుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగింది. ఆరంభంలో ఓపెనర్ మాథ్యూస్-నాట్ సివర్ జోడీ.. చివర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఫినిషింగ్‌కు స్కోరు అవలీలగా 200 దాటేసింది. ప్రతీ బంతిని బాదడమే లక్ష్యంగా ఈత్రయం క్రీజులో కదం తొక్కడంతో జెయింట్స్ బౌలర్లు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. దీనికితోడు ప్రత్యర్థి ఫీల్డింగ్ వైఫల్యం కూడా ముంబైకి జత కలిసింది. ఓపెనర్ యాస్తిక (15) ఐదో ఓవర్‌లో వెనుదిరిగింది. ఇక ఐదు పరుగుల దగ్గర జీవనదానం లభించిన మాథ్యూస్ 8వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో బ్యాట్‌కు పనిజెప్పింది. 36 బంతుల్లోనే తను ఫిఫ్టీ పూర్తి చేయగా, సివర్ రెండు వరుస సిక్సర్లతో 29 బంతుల్లోనే ఈ ఫీట్ అందుకుంది. అలాగే 57 పరుగుల వద్ద మాథ్యూస్ రెండో క్యాచ్‌ను కూడా వదిలేశారు. ఈ చాన్స్‌తో తను 16వ ఓవర్‌లో వరుసగా 6,6,4తో 19 రన్స్ రాబట్టింది. తర్వాతి ఓవర్‌లోనే మాథ్యూస్‌ను కశ్వీ అవుట్ చేయగా, అప్పటికే రెండో వికెట్‌కు 71 బంతుల్లోనే 133 పరుగుల భాగస్వామ్యం జత చేరడం విశేషం. మరో ఎండ్‌లో హర్మన్ వచ్చీ రాగానే విరుచుకుపడింది. తనూజ ఓవర్‌లో 6,4,4,6తో ఏకంగా 22 రన్స్ సాధించింది. సివర్ 19వ ఓవర్‌లో వెనుదిరగ్గా, ఆఖరి ఓవర్‌లో హర్మన్ మరో రెండు సిక్సర్లతో 15 రన్స్ అందించి రనౌటైంది.

ముంబై ఇండియన్స్: 20 ఓవర్లలో 213/4. (సివర్ 77, హేలీ మాథ్యూస్ 77, హర్మన్‌ప్రీత్ 36; గిబ్సన్ 2/40)
గుజరాత్ జెయింట్స్: 19.2 ఓవర్లలో 166 ఆలౌట్ (గిబ్సన్ 34, లిచ్‌ఫీల్డ్ 31, భారతి 30; మాథ్యూస్ 3/31, అమెలియా 2/28)

1

డబ్ల్యూపీఎల్ ప్లేఆఫ్స్‌లో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా ముంబై ఇండియన్స్. ఓవరాల్‌గా లీగ్‌లో ఇది మూడో అత్యధిక స్కోరు.

ఒకే సీజన్‌లో ఎక్కువ హాఫ్ సెంచరీలు (5) చేసిన ప్లేయర్‌గా సివర్ బ్రంట్

కొకైన్ కేసులో మెక్‌గిల్ దోషి



సిడ్నీ: నిషేధిత కొకైన్ సరఫరా వ్యవహారంలో ఆస్ట్రేలియా మాజీ స్పిన్నర్ స్టువర్ట్ మెక్‌గిల్‌ను న్యూసౌత్‌వేల్స్ డిస్ట్రిక్ట్ కోర్టు దోషిగా తేల్చింది. 54 ఏళ్ల మెక్‌గిల్‌కు కొకైన్ సేవించే అలవాటు ఉంది. దాదాపు రూ.2 కోట్ల విలువైన కొకైన్ మార్పిడిలో మెక్‌గిల్ మధ్యవర్తిగా వ్యవహరించినట్టు ఆరోపణలున్నాయి. మరోవైపు వాటిని మాజీ స్పిన్నర్ ఖండించినప్పటికీ ప్రాసిక్యూషన్ తోసిపుచ్చింది. 2021నాటి ఈ కేసులో మెక్‌గిల్‌కు శిక్షను మేలో ఖరారు చేయనున్నారు.

540 కోట్ల మంది వీక్షించారు

జియో హాట్‌స్టార్ రికార్డు

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ వీక్షణలో డిజిటల్ ప్లాట్‌ఫామ్ జియో హాట్‌స్టార్ సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఓవరాల్‌గా టోర్నీని 540 కోట్ల మంది తిలకించినట్టు పేర్కొంది. అలాగే భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను ఏకంగా 124.2 కోట్ల మంది తిలకించారని జియోస్టార్ సీఈవో పేర్కొన్నారు.

బ్రూక్‌పై రెండేళ్ల నిషేధం



న్యూఢిల్లీ: ఈ సీజన్ ఐపీఎల్ నుంచి చివరి నిమిషంలో వైదొలగిన ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌పై బీసీసీఐ కఠిన చర్యలు చేపట్టింది. అతడు రెండేళ్లపాటు ఐపీఎల్ ఆడకుండా నిషేధం విధించింది. ఈ మేరకు తన నిర్ణయాన్ని బీసీసీఐ గురువారం ప్రకటించింది. అంతేకాదు..బ్రూక్‌పై చర్యల విషయాన్ని ఆ క్రికెటర్‌తోపాటు, ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డుకు కూడా తెలియజేసింది. గత ఏడాది నవంబరులో జరిగిన వేలంలో రూ. 6.25 కోట్ల ధరకు హ్యారీని ఢిల్లీ క్యాపిటల్ కొనుగోలు చేసిన విషయం విదితమే.

ఇచ్చిన వాగ్దానాల్లో సగం పూర్తి చేశాం

» శాసనభలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా తాము ఇచ్చిన వాగ్దానాల్లో సగం పూర్తి చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీలో గురువారం ఆయన మాట్లాడుతూ 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ప్రయాణం, రైతులకు రుణమాఫీ.. తదితర పథకాలను 15 నెలల్లో పూర్తి చేశామని, తమకు ఇంకా మూడున్నరేళ్ల సమయం ఉందని.. మిగతావీ పూర్తి చేసి చూపిస్తామని వ్యాఖ్యానించారు. దళితుడిని సీఎం చేయకపోతే మెడ మీద తలకాయ ఉండదన్నావు కదా.. నువ్వు ఇంప్లిమెంట్ చేశావా? దళితులకు మూడెకరాల భూమి ఇస్తానన్నావు కాదా.. ఇచ్చావా? దళితుడు ప్రతిపక్ష నాయకుడు ఉంటే... సంతలో పశువుల లెక్కన కొనుక్కొని దళిత వ్యతిరేకత చూపుకున్నవు. ఇంటికో ఉద్యోగం, డబుల్‌బెడ్ రూమ్, లక్ష అబద్ధాలు ఆడి... రెండు సార్లు అధికారంలోకి వచ్చావు" అని కేసీఆర్‌ను ఉద్దేశించి ధ్వజమెత్తారు.

అసెంబ్లీకి కేసీఆర్ గైర్హాజరు

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రెండో రోజు అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా బుధవారం ఆయన సభకు హాజరైన విషయం తెలిసిందే. కానీ, గురువారం మాత్రం ఆయన సభకు హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది.

వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి: అక్బరుద్దీన్



హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా 2025-26 జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని ప్రభుత్వాన్ని మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ కోరారు. ఫలితంగా నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు సరిపడా సమయం దొరుకుతుందన్నారు. శాసనసభలో బుధవారం ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల జారీలో ఆశించిన పురోగతి లేదని, దీనిపై సర్కారు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. సంక్రాంతి నుంచే రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించినా.. ఇప్పటికీ అమలులోకి రాలేదని గుర్తు చేశారు. చార్మినార్ వద్ద అభివృద్ధి ఇప్పటికీ పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. తాను యువకుడిగా ఉన్నప్పుడు అప్పటి స్పీకర్ చార్మినార్ ప్రాంతం మారబోతుందని చెప్పారని, ఇప్పుడు తన జుట్టు తెల్లబడినా ఎలాంటి మార్పు జరగలేదని పేర్కొన్నారు.

అధ్యక్షా.. నాకొక సూట్‌కేస్ కావాలి!

» మోదీ రూ.15 లక్షలిస్తే తీసుకెళ్లేందుకు..

» బీజేపీ నేతలు కేంద్రంతో కొట్లాడి.. నిధులు తేవాలి: పొన్నం



హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): 'మేం అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయ్యాయి. మాపై బీఆర్ఎస్, బీజేపీ కలిసి విమర్శలు గుప్పిస్తున్నాయి.. హామీలపై నిలదీస్తున్నాయి.. అయితే పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. సభలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గంటలకుపైగా మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదంటూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మధ్యలో జోక్యం చేసుకున్న పొన్నం.. 'అధ్యక్షా.. నాకొక సూట్‌కేస్ కావాలి. ప్రతీ పౌరుడికి రూ.15 లక్షల ఇస్తామని మోదీ 2014లో హామీ ఇచ్చారు. నా డబ్బులు మోదీ ఇస్తారేమో! ఇక్కడి బీజేపీ ఎమ్మెల్యేలు ఇప్పిస్తారేమో! డబ్బులు తీసుకునేందుకు సూట్‌కేస్ కావాలి' అని ఎద్దేవా చేశారు. ఏడాదికి 2 కోట్ల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ హామీ ఏమైందని ప్రశ్నించారు. 'ఇక్కడ మాట్లాడటం కాదు.. మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని మోటివేట్ చేయండి.. కేంద్రంతో కొట్లాడి.. మెట్రో, మూసీ, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టులకు నిధులు తీసుకురండి' అని బీజేపీ ఎమ్మెల్యేలను ఉద్దేశించి అన్నారు. 'బీజేపీ మిత్రపక్షంగా ఉన్న ఏపీకి ఇస్తున్న నిధులు ఎంత... తెలంగాణకు ఇచ్చినదెంత లెక్క చెప్పాల'ని కోరారు.

బీఆర్ఎస్ వైఫల్యాల వల్లే సమస్యలు: జీవన్‌రెడ్డి

» పదేళ్లలో 7.5 లక్షల కోట్లు అప్పులు చేశారు: మహేష్ గౌడ్

» 'ప్రాణహిత' కట్టి ఉంటే కాళేశ్వరం అక్కర్లేదు: సుభాష్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో గురువారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల వాదోపవాదాల మధ్య చర్చ కొనసాగింది. రాష్ట్రంలో అనేక సమస్యలకు గత బీఆర్ఎస్ పాలనా వైఫల్యాలే ప్రధాన కారణమని కాంగ్రెస్ సభ్యుడు టీ జీవన్‌రెడ్డి విమర్శించారు. ఆర్థికపరమైన పరిమితులున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో ఏడున్నర లక్షల కోట్లు అప్పులు చేశారని కాంగ్రెస్ సభ్యుడు మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. కమిషన్లకు కక్కుర్తి పడి లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుప్పకూలితే బాధ్యులెవరని ప్రశ్నించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించి ఉంటే కేసీఆర్ కాళేశ్వరం చేపట్టే అవసరం ఉండకపోయేదని బీఆర్ఎస్ సభ్యుడు శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. లోపభూయిష్ట విద్యా విధానంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని యూటీఎఫ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించినట్టు అబద్ధాలు ప్రచారం చేసుకుంటోందని బీఆర్ఎస్ సభ్యుడు తాతామధు ఆరోపించారు. దీన్ని మంత్రి పొన్నం ఖండిస్తూ రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణన సర్వే తప్పులను సరిచేసుకోవాలని తీన్మార్ మల్లన్న సూచించగా.. పొన్నం స్పందిస్తూ ఈ సర్వేను ఇతర సర్వేలతో సరిపోల్చవద్దని కోరారు.

నాకు మంత్రి పదవి వస్తే పార్టీ, ప్రజలకే లాభం

» నిద్రాహారాలు మాని భువనగిరి ఎంపీ సీటును గెలిపించా

» జగదీశ్‌రెడ్డి ప్రవర్తన సరికాదు: రాజగోపాల్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తనకు మంత్రి పదవి వస్తే కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకే లాభమని ఆ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్ సమావేశాల తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని చెబుతున్నారని, అయితే ఉంటుందా.. వాయిదా పడుతుందా అనేది తెలియదన్నారు. గురువారం అసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిద్రాహారాలు మాని లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరిలో పార్టీని గెలిపించానని చెప్పారు. తాను 2018 ఎన్నికల్లో మునుగోడు నుంచి కాంగ్రెస్ తరఫున గెలిచినప్పుడు బీజేపీకి డిపాజిట్ దక్కలేదని, ఆ తర్వాత బీజేపీలోకి వెళ్లి ఆ పార్టీ తరఫున పోటీ చేస్తే కాంగ్రెస్‌కూ డిపాజిట్ రాలేదన్నారు. మళ్లీ 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తే బీజేపీకి డిపాజిట్ దక్కలేదని గుర్తు చేశారు. అసెంబ్లీలో జగదీశ్‌రెడ్డి అతిగా ప్రవర్తించడం సరికాదన్నారు. స్పీకర్‌ను అవమానించినందునే ఆయనపై చర్యలు తీసుకున్నారని చెప్పారు.

రేలంగిపాడు ఎత్తిపోతల మరమ్మతులు చేపట్టండి

» మంత్రి ఉత్తమ్‌ను కోరిన గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గద్వాల నియోజకవర్గంలోని రేలంగిపాడు ఎత్తిపోతల పథకం మరమ్మతులు చేపట్టాలని సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. అసెంబ్లీలోని మంత్రి చాంబర్‌కు వెళ్లి ఆయన కలిశారు. రేలంగిపాడు ఎత్తిపోతలకు మరమ్మత్తులు చేపడితే కృష్ణా నీటిని నిల్వ చేసుకుని ఎద్దడి కాలంలో వాడుకోవచ్చని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇటు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కూడా ఉత్తమ్‌ను కలిశారు. బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి పంటలకు నీళ్లు వదలాలని మంత్రిని కోరారు.

బడ్జెట్‌లో.. ఆర్ఆర్ఆర్‌కు రూ.1,525 కోట్లు!

మెట్రో, మూసీ ప్రాజెక్టులకు కేటాయింపులు?

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ కేటాయింపుల్లో ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టులకు పెద్దపీట వేయాలని రేవంత్ సర్కారు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎప్పటిలాగే వ్యవసాయం, సంక్షేమం, విద్య, వైద్యం, విద్యుత్తు రంగాలకు భారీగా నిధులు కేటాయిస్తూనే.. ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్), మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, స్కిల్ యూనివర్సిటీ, మెట్రో రైలు రెండో దశ వంటి కీలక ప్రాజెక్టులపై దృష్టి సారించనున్నట్లు సమాచారం. ఖజానాకు భారంగా మారే రైతు రుణమాఫీ వంటి పథకాలు ఈసారి లేకపోవడంతో.. ఆ నిధులను ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టులకు మళ్లించనున్నట్లు తెలిసింది. ఆర్ఆర్ఆర్ అంచనా వ్యయం రూ.34,368 కోట్లు కాగా.. తాజా బడ్జెట్‌లో దీనికి రూ.1,525 కోట్లను కేటాయించనున్నట్లు సమాచారం. మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశ కింద మొత్తం 76.4 కిలో మీటర్ల పొడవుతో ఆరు కారిడార్లను నిర్మించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.! దీనికి రూ.24,269 కోట్లు అవసరమవుతాయని అంచనా. ఇందులో 30% నిధులను రాష్ట్రం నుంచి సర్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బడ్జెట్‌లో ఒకేసారి 30% ఇవ్వకుండా.. కొంత మేర నిధులను కేటాయించవచ్చని సమాచారం. ఔటర్ రింగ్‌రోడ్డు(ఓఆర్ఆర్), ఆర్ఆర్ఆర్ మధ్య రూ.45 వేల కోట్లతో రేడియల్ రోడ్లను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించగా.. ఈ ప్రాజెక్టులకూ తాజా బడ్జెట్‌లో కేటాయింపులు జరుగుతాయని తెలుస్తోంది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు రూ.14,100 కోట్లు.. గోదావరి-మూసీ అనుసంధాన ప్రాజెక్టుకు రూ.7,440 కోట్లు అంచనావ్యయం కాగా.. కొంత మేర నిధులను కేటాయించే అవకాశం ఉంది. స్కిల్ వర్సిటీకి కూడా బడ్జెట్‌లో కేటాయింపులుంటాయని సమాచారం.

మాట.. మంట

(మొదటి పేజీ తరువాయి)



చర్యలపై చర్చించేందుకు ఈ అంశాన్ని ఎథిక్స్ కమిటీకి సిఫారసు చేయాలని సభ నిర్ణయించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత అసెంబ్లీలో తొలి సస్పెన్షన్ ఇదే. గురువారం సభ ప్రారంభం కాగానే విప్ ఆది శ్రీనివాస్.. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమర్థించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా ఛిన్నాభిన్నం చేసిందని.. పదేళ్ల విధ్వంసాలతో గాయపడ్డ తెలంగాణ ఇప్పుడు కోలుకుంటోందని ఆది శ్రీనివాస్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. 'కమీషన్ ఫర్ ఫోర్ మెంబర్స్' అంటూ.. కేసీఆర్, కేటీఆర్ కవిత, హరీశ్ పేర్లను పరోక్షంగా ప్రస్తావించి, విమర్శించారు. 'గవర్నర్ ప్రసంగం కూడా వినలేని ప్రతిపక్షం అవసరమా?' అని ప్రజలు అనుకుంటున్నారని వేముల వీరేశం మండిపడ్డారు. వారి తర్వాత.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మాట్లాడారు. గవర్నర్ ప్రసంగంపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. ఆయన ప్రసంగాన్ని తాము విన్నామని, ఇంటికి పుస్తకాలు కూడా తీసుకెళ్లి చదివామని.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్ జీపీటీ వినియోగించి ప్రసంగం తయారు చేసినట్లుందని వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ ప్రసంగం 'డ్రై'గా, విజన్ లేకుండా ఉందని.. దాన్ని మనసుపెట్టి తయారు చేయలేదని.. మనసు కవి ఆత్రేయ బతికుంటే ఈ ప్రసంగం చూసి, ఆత్మహత్య చేసుకునేవారని విమర్శించారు. 'సభలో ఉండమంటే ఉంటాం... పొమ్మంటే పోతాం' అని ఆగ్రహంగా అన్నారు. ఆయన వ్యాఖ్యలపై శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించారు. "గతంలో మంత్రిగా పనిచేశారు. అనుభవం ఉన్న వ్యక్తి మీరు. స్పీకర్‌ను బెదిరించే ధోరణి వద్దు. ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోండి" అని సూచించారు. శ్రీధర్‌బాబు మాటలకు జగదీశ్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడ్డుతగులుతుండడంతో స్పీకర్ జోక్యం చేసుకుని.. "జగదీశ్ రెడ్డిగారూ అసహనానికి గురికాకండి" అన్నారు. దీనికి జగదీశ్ రెడ్డి.. "మేమా?" అని ప్రశ్నించగా.. "మీరే" అన్నారు స్పీకర్. సహనంతో మాట్లాడి, సభా సంప్రదాయాలను కాపాడాలని సూచించారు. దీనికి జగదీశ్ రెడ్డి.. తాను ఏ సభా సాంప్రదాయానికి విరుద్ధంగా మాట్లాడానో చెప్పాలన్నారు. అందుకు స్పీకర్.. "నన్ను ప్రశ్నించడమే సభా సాంప్రదాయాలకు విరుద్ధం" అని స్పష్టం చేశారు. "అసలే కాదు.. అసలే కాదు" అని జగదీశ్ రెడ్డి అనడంతో.. తనను ప్రశ్నించడమే సభా సంప్రదాయాలకు విరుద్ధమని స్పీకర్ మరోమారు తేల్చిచెప్పారు. అప్పుడు జగదీశ్ రెడ్డి.. "ఈ సభ మన అందరిదీ, ఈ సభపై మనందరికీ సమాన హక్కులున్నాయి. మా అందరి తరఫునే మీరు పెద్దమనిషిగా అక్కడ కూర్చున్నారు తప్ప.. ఈ సభ మీ సొంతం కాదు" అని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలు సభను అవమానించేలా ఉన్నాయని.. ఆయన తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని దుద్దిళ్ల అన్నారు. జగదీశ్‌రెడ్డి తాను మాట్లాడిన మాటల్లో ప్రతి పదాన్నీ వెనక్కి తీసుకుని సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తప్పేముంది?

జగదీశ్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా.. ఆయన మాటల్లో ఏ తప్పూ లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సభలో అందరు సభ్యులకూ సమాన హక్కు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అయితే.. జగదీశ్ రెడ్డి క్షమాపణ చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ సభ్యులు నినాదాలు ప్రారంభించారు. ఆ సమయంలో.. మాట్లాడేందుకు జగదీశ్‌రెడ్డికి స్పీకర్ అవకాశమిచ్చారు. అప్పుడు ఆయన.. కాంగ్రెస్ సభ్యుల నిరసన గురించి ప్రస్తావించి, సభను ఆర్డర్‌లో పెట్టాలని, అందరూ కూర్చుంటేనే తాను మాట్లాడతానని అన్నారు. సభాసంప్రదాయాలేంటో, స్పీకర్ హక్కులేమిటో, సభ్యుల హక్కులేమిటో తేలాలని వ్యాఖ్యానించారు. దీనికి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్.. జగదీశ్ రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి ఏకవచనంతో మాట్లాడారని, బీఆర్ఎస్ నేతలు తొలి నుంచీ దళిత జాతిపై చిన్నచూపుతో ఉన్నారని మండిపడ్డారు. స్పీకర్‌ను అవమానించిన జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. యావత్ దళిత జాతికీ జగదీశ్ రెడ్డి క్షమాపణ చెప్పాలని కోరారు. ఇరుపక్షాల వాగ్వాదంతో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో స్పీకర్ సభను 15నిమిషాలపాటు వాయిదా వేశారు. కానీ, మూడున్నర గంటల తర్వాత సభ ప్రారంభమైంది.

అవహేళన చేశారు.. అవమానించారు..

జగదీశ్ రెడ్డి సభాపతిని ఏకవచనంతో సంబోధిస్తూ తీవ్ర ఆరోపణలు చేశారని మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, సీతక్క, ఉత్తమ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో ఆయన ప్రవర్తించిన తీరుపై మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు గవర్నర్‌ను కాంగ్రెస్ కార్యకర్త అన్నారని.. ఇప్పుడు స్పీకర్‌ను ఏకవచనంతో 'నీకు' అని సంబోధించారని.. జగదీశ్ రెడ్డి తీరు సభలో జుగుప్సాకరంగా ఉందని మంత్రి సీతక్క దుయ్యబట్టారు. గిరిజన గవర్నర్, దళిత స్పీకర్ కావడంతోనే ఆయన అలా ప్రవర్తించారని, ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. ఏమీ అనకపోయినా గత ప్రభుత్వం కాంగ్రెస్ ఎమ్మెల్యేలైన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్ శాసనసభ సభ్యత్వాలను రద్దు చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. ఒక స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం ఇంతవరకూ తాను చూడలేదన్నారు. స్పీకర్ స్థాయిని తగ్గించి వ్యంగ్యంగా మాట్లాడిన జగదీశ్‌రెడ్డి ఆయన్ను అవమానపరిచారని ఆవేదన వెలిబుచ్చారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. స్పీకర్ అధికారాల గురించి తెలుపుతూ సభాహక్కుల పుస్తకాన్ని చదివి వినిపించారు. స్పీకర్‌కు రాజ్యాంగం విశేషాధికారాలు కల్పించిందని.. సభ లోపల, బయట స్పీకర్‌కు వ్యతిరేకంగా మాట్లాడకూడదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఆయన్ను తొలగించడంపై ఎథిక్స్ కమిటీలో చర్చిస్తామని.. ఈ సమావేశాలు జరిగేంతవరకూ సభ నుంచి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని కోరారు. దీంతో ఈ సెషన్ ముగిసేదాకా ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. సభ నుంచి వెంటనే వెళ్లిపోవాలని స్పీకర్ ఆదేశించడంతో జగదీశ్ రెడ్డి వెళ్లిపోయారు. స్పీకర్ నిర్ణయం అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. ఆయన తన నిర్ణయాన్ని వెల్లడించే ముందు తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదంటూ సభ నుంచి వాకౌట్ చేశారు.



సంస్కరణలతో సభ ఔన్నత్యాన్ని పెంచుతాం

» బీఆర్ఎస్ సంప్రదాయాల్ని పూర్తిగా మార్చేసింది: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ శాసనసభ సంప్రదాయాన్ని పూర్తిగా మార్చేసిందని, నిబంధనలను నిర్వీర్యం చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. సభా వ్యవహారాల విషయంలో సంస్కరణలు చేపట్టి సభ ఔన్నత్యాన్ని పెంచుతామన్నారు. గురువారం అసెంబ్లీలో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ మాట్లాడుతూ సభ నిర్వహించే సమయం, అంశాలపై మాట్లాడే సమయాలపై ప్రస్తావించారు. వైఎస్సార్, చంద్రబాబు హయాంలో సభలు ఎలా జరిగేవన్న విషయాలను గుర్తుచేశారు. దీనిపై భట్టి స్పందిస్తూ.. అక్బరుద్దీన్ వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నానన్నారు. శాసనసభ ఎన్ని రోజులు జరగాలన్న విషయంలో బీఆర్ఎస్ పాలనలో స్పష్టత లేదని చెప్పారు. గతంలో వేసవి, శీతాకాలంలో నిర్వహించే సమావేశాలకు సంబంధించి ముందుగానే షెడ్యూల్ ఖరారయ్యేదని గుర్తు చేశారు. తమ ప్రభుత్వంలో సభా వ్యవహారాల విషయంలో సంస్కరణలు చేపడతామని తెలిపారు. సభ్యులు అందరితో చర్చించి భవిష్యత్తులో సభ సమయాన్ని క్రమేపి పెంచడానికి ప్రయత్నిస్తామన్నారు.

పెయిడ్ ఆర్టిస్టులతో అసభ్య పోస్టులు: కూనంనేని

సోషల్ మీడియా వేదికగా పెయిడ్ ఆర్టిస్టులతో కొందరు నాయకులకు వ్యతిరేకంగా అసభ్యకర పోస్టులు పెడుతున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో పోసాని, వల్లభనేని వంశీ తదితరుల విషయంలో చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో వారు ఊచలు లెక్కపెడుతున్నారని గుర్తు చేశారు. ఇష్టానుసారంగా మాట్లాడాలంటే వెన్నులో వణుకు పుట్టేలా ఇక్కడ సైతం చర్యలు ఉండాలన్నారు. కుర్చీ మారగానే బీఆర్ఎస్ విధానంలో మార్పు వచ్చిందని, సభాధ్యక్షుడ్ని ఉద్దేశించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అభిప్రాయపడ్డారు.

అసెంబ్లీ చరిత్రలో ఇది చీకటి రోజు

జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం దారుణం: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు

» అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన

» బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్టు చేసి

» తెలంగాణ భవన్ వద్ద వదిలిపెట్టిన పోలీసులు



కేటీఆర్, ఇతర నేతలను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

హైదరాబాద్/ఖైరతాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సభలో నిబంధనలకు విరుద్ధంగా ఏమీ మాట్లాడకపోయినా.. జగదీశ్‌రెడ్డిని ఉద్దేశపూర్వకంగా సభ నుంచి సస్పెండ్ చేశారని, అసెంబ్లీ చరిత్రలో ఇది చీకటి రోజని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులోని భారీ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్, ఎమ్మెల్సీ మధుసూధనాచారి, వాణిదేవి, గోరేటి వెంకన్నతోపాటు వందలాది మంది నాయకులు నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ స్పీకర్‌ను ఉద్దేశించి జగదీశ్‌రెడ్డి అగౌరవంగా మాట్లాడలేదని, అనని మాటను అన్నట్లుగా చిత్రీకరించి సమావేశాలు పూర్తయ్యే వరకూ సస్పెండ్ చేయడం దారుణమన్నారు. తమ తప్పు ఉంటే క్షమాపణ చెప్పి, ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటామని చెప్పినా.. పట్టించుకోకుండా సస్పెండ్ చేస్తూ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారన్నారు. ఢిల్లీలో రేవంత్‌రెడ్డి ప్లాన్ వేస్తే శాసనసభలో మంత్రి శ్రీధర్‌బాబు దాన్ని అమలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పట్టపగలు ప్రజాస్వామ్యం గొంతుకోసిందని ధ్వజమెత్తారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రజల సమస్యలపై మాట్లాడే అవకాశం ప్రతిపక్షాలకు లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీ స్పీకర్‌గా ప్రసాద్‌ను ప్రతిపాదించినప్పుడు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దళితబంధు కింద రూ.10లక్షల సాయం అందించిన ఘనత కేసీఆర్‌ది అని పేర్కొన్నారు. దళితులను ఓటు బ్యాంకుగా వాడుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. దళితుల గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. ఇలాంటి చర్యలు మానుకోకపోతే... భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. అనంతరం బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టుచేసి, ప్రత్యేక వాహనంలో తెలంగాణ భవన్ వద్ద వదిలిపెట్టారు. కాగా, సభను తప్పుదోవ పట్టించిన ఉత్తమ్ భేషరతుగా క్షమాపణలు చెప్పాలని 'ఎక్స్' వేదికగా హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గతంలో మహువా మొయిత్రా లోక్‌సభ సభ్యత్వం రద్దు, గవర్నర్‌పై దాడి నేపథ్యంలో అప్పటి ఎమ్మెల్యేలు సంపత్‌కుమార్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి బహిష్కరణను ఖండించిన ఉత్తమ్.. ఇప్పుడు జగదీశ్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. కాగా, నల్లగొండలోని గడియారం సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకే ప్రభుత్వం కుట్ర పన్ని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేసిందని విమర్శించారు.



ఓయూలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి శవయాత్ర

దళితులకు క్షమాపణ చెప్పాలని విద్యార్థి నాయకుల డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో గురువారం ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి శవయాత్ర నిర్వహించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఓయూ విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ స్పీకర్‌గా దళితుడు ఉండడాన్ని జగదీశ్‌రెడ్డి సహించలేకపోతున్నారని దుయ్యబట్టారు. దళిత సమాజానికి వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎక్కడికక్కడ ఆయన్ను అడ్డుకొంటామని, ప్రత్యక్ష దాడులకూ వెనుకాడబోమని హెచ్చరించారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు.



రేవంత్ చిత్రపటానికి ర్యాబిస్ ఇంజక్షన్

పిచ్చికుక్కతో పోలుస్తూ ఓయూలో బీఆర్ఎస్వీ నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ర్యాబిస్ ఇంజక్షన్ వేస్తూ, పిచ్చికుక్కతో పోలుస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో బీఆర్ఎస్వీ నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.విజయ్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విజయ్‌రావు, విద్యార్థి నాయకుడు కందుల మధు మాట్లాడుతూ పిచ్చికుక్క మాదిరిగా కేసీఆర్‌పై ఇష్టానుసారం నోరు పారేసుకుంటే సహించబోమని హెచ్చరించారు. కేసీఆర్ పదవిలో లేకపోయినా, నాలుగు కోట్ల మంది ప్రజల గుండెల్లో ఉన్నారని పేర్కొన్నారు. రేవంత్ తీరు మారకుంటే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

స్పీకర్‌గా ఓసీ ఉంటే అలాగే మాట్లాడేవారా?

సభాపతినే నిలదీసి వాదనకు దిగుతారా?

» జగదీశ్ రెడ్డిపై చర్యలు తీసుకోవాల్సిందే

» స్పీకర్‌కు అధికార పార్టీ సభ్యుల వినతి

» ఆ వ్యాఖ్యల్లో అన్‌పార్లమెంటరీ పదం లేదు

» స్పీకర్ చైర్‌ను అవమానించినట్లు భావిస్తే సభలో జగదీశ్ విచారం వ్యక్తం చేస్తారు.. హరీశ్ ప్రతిపాదన

» సస్పెన్షన్‌కు ముందు మూడున్నర గంటల హైడ్రామా

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): "స్పీకర్ చైర్‌లో ఓసీ ఉంటే.. జగదీశ్‌రెడ్డి అలా మాట్లాడుండేవారా? స్పీకర్‌నే నిలదీస్తారా? సభ నియామవళినీ పట్టించుకోకుండా వాదనకు దిగుతారా? ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందే" అంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. శాసనసభలో గురువారం ఉదయం స్పీకర్, జగదీశ్‌రెడ్డి మధ్య సంవాదం నేపథ్యంలో సభ 15 నిమిషాలపాటు వాయిదా పడింది. అయితే అప్పటి నుంచీ మూడున్నర గంటలపాటు స్పీకర్ కార్యాలయంలో హైడ్రామా నడిచింది. తొలుత స్పీకర్ కార్యాలయానికి చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు.. సభలో జగదీశ్‌రెడ్డి వ్యవహార శైలిని తప్పు పట్టారు. ఆయన వ్యాఖ్యలు అహంకారపూరితంగా ఉన్నాయని, స్పీకర్ చైర్‌లో ఓసీ వ్యక్తి ఉంటే.. జగదీశ్ రెడ్డి అలా నిలదీసే స్థాయికి వెళ్లి ఉండేవారు కాదని పలువురు ఎమ్మెల్యేలు వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. ఆయన శాసనసభ సభ్యత్వం రద్దు చేయాలనీ, ఈ మేరకు తీర్మానాన్ని సభలో ప్రతిపాదిస్తామనీ పట్టుపట్టారు. ఆ సమయంలోనే బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్ తదితరులు అక్కడికి చేరుకున్నారు. చాంబర్లో స్పీకర్‌తో విడిగా మాట్లాడిన వారు.. జగదీశ్ రెడ్డి వ్యాఖ్యల్లో అన్ పార్లమెంటరీ పదం ఏదీ లేదన్నారు. ఆయన వ్యాఖ్యల్లో కావాలని చేసినవి ఏవీ లేవన్నారు. స్పీకర్ చైర్‌ను అవమానించినట్లుగా భావించిన పక్షంలో.. సభాముఖంగా జగదీశ్‌రెడ్డి విచారం వ్యక్తం చేస్తారని ప్రతిపాదించారు. స్పీకర్‌తో భేటీ తర్వాత మీడియాతో మాట్లాడిన హరీశ్.. జగదీశ్ రెడ్డి స్పీకర్‌ను అవమానించలేదని స్పష్టం చేశారు. "సభ 'మీ' ఒక్కరిది కాదు.. అందరిది అన్నారు. 'మీ' అనే పదం అన్ పార్లమెంటరీ పదం కాదు. దానిపై కాంగ్రెస్ సభ్యులు ఎందుకు నిరసన తెలుపుతున్నారో తెలియదు"అని వ్యాఖ్యానించారు. స్పీకర్‌ను కలిసి.. సభలోజగదీశ్‌రెడ్డి మాట్లాడిన వీడియో రికార్డు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు.

వ్యాఖ్యల రికార్డు పరిశీలన..

డిప్యూటీ సీఎం భట్టి, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, మంత్రి ఉత్తమ్ తదితరులు.. సభలో జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల రికార్డును పరిశీలించారు. దీనిపై వారు ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డితోనూ మాట్లాడినట్లు సమాచారం. అలాగే.. భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు పలు మార్లు దీనిపై స్పీకర్‌తో భేటీ అయి చర్చలు జరిపారు. స్పీకర్ చైర్‌ను అవమానించేలా మాట్లాడిన జగదీశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాల్సిందేనన్న నిర్ణయానికి వచ్చి.. సస్పెన్షన్ వేటు వేస్తూ తీర్మానాన్ని ప్రతిపాదించి.. సభ ఆమోదం తీసుకున్నారు.

బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలోకి చీఫ్ మార్షల్

సస్పెన్షన్ వేటు పడిన అనంతరం.. జగదీశ్‌రెడ్డి సభ నుంచి బయటికి వచ్చి లాబీల్లోని బీఆర్ఎస్ఎల్పీ ఆఫీసులోకి వెళ్లారు. దీంతో చీఫ్ మార్షల్ కొంతమంది మార్షల్స్‌తో కలిసి అక్కడికి వెళ్లి.. సస్పెన్షన్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అసెంబ్లీ పరిధిలోనే ఉన్న ఆ కార్యాలయాన్నీ వీడి వెళ్లాల్సిందిగా జగదీశ్ రెడ్డిని కోరారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన కేటీఆర్, హరీశ్‌రావు.. చీఫ్ మార్షల్ తీరును తప్పు పట్టారు.

100 మంది గ్రూప్-1 టాపర్లలో
48 మంది బీసీలు

- ఐదుగురు ఎస్టీలు, ముగ్గురు ఎస్సీలు
- ఓసీలు, ఈడబ్ల్యూఎస్ కలిపి 44 మంది
- ఇంగ్లి‌ష్‌లో 12,323 మంది రాశారు
- తెలుగులో 7,829.. ఉర్దూలో 9 మంది
- వాల్యుయేషన్‌లో ఎలాంటి లోపాలు లేవు
- అభ్యంతరాలుంటే.. నివృత్తి చేస్తాంట?
- వెల్లడించిన టీజీపీఎస్సీ కార్యదర్శి

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 టాపర్లలో అంతా ఒకే సామాజిక వర్గానికి చెందినవారున్నారనేది అసత్య ప్రచారమని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) కార్యదర్శి స్పష్టం చేశారు. టాప్-100 మంది ర్యాంకర్లలో అగ్రవర్ణాలు(ఓసీ) 32 మంది, అగ్రవర్ణ పేదలు(ఓసీ ఈడబ్ల్యూఎస్) 12 మంది ఉన్నట్లు వివరించారు. వెనకబడిన కులాల(బీసీ)కు చెందిన వారిలో 58 మంది టాప్-100లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఐదుగురు ఎస్టీలు, ముగ్గురు ఎస్సీలు కూడా తొలి 100 మంది ర్యాంకర్లలో ఉన్నట్లు చెప్పారు. పూర్తి పారదర్శకతతో ఫలితాలను ప్రకటించామని గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరైన మొత్తం 20,161 అభ్యర్థుల వివరాలకు సంబంధించిన గణాంకాలను అందులో ప్రస్తావించారు. "12,323 మంది ఇంగ్లిషు మాధ్యమంలో పరీక్షలు రాయగా, 7829 మంది తెలుగు, 9 మంది ఉర్దూలో రాశారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికి ఎక్కువ ర్యాంకులు వచ్చాయనడం అసత్య ప్రచారమే" అని వివరించారు. వాల్యుయేషన్‌లో లోపాలపై వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. "గ్రూప్-1 సమాధాన పత్రాలను దిద్దినవారందరికీ యూపీఎస్సీ వాల్యుయేషన్‌లో పాల్గొన్న అనుభవం ఉంది. వారంతా వివిధ విశ్వవిద్యాలయాల్లో సీనియర్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు" అని స్పష్టం చేవారు. ఫలితాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే వాటిని నివృత్తి చేసేందుకు కమిషన్ సిద్ధంగా ఉందని.. అసత్య, నిరాధార ఆరోపణలతో అభ్యర్థుల్లో గందరగోళం సృష్టించొద్దని హితవు పలికింది.

రేపటి నుంచి ఒంటి పూట బడులు

- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 వరకే తరగతులు

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలు శనివారం నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని సర్కారు ఆదేశించింది. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకే నిర్వహించాలని పేర్కొంటూ పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు, ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం మధ్యాహ్నం 12.30 గంటలకు అమలు చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు యథావిధిగా కొనసాగించాలని కోరారు.

20 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) పదో తగరతి, ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలను ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ప్రతిరోజు రెండు విడతల్లో పరీక్షలు ఉంటాయని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా పేర్కొన్నారు. 26న మధ్యాహ్నం ఒకేషనల్ పరీక్షలకు ప్రాక్టికల్స్ ఉంటాయని వెల్లడించారు.

ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్‌కు
ప్రపంచ బ్యాంకు ఫెలోషిప్

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ స్టాటిస్టిక్స్, అనాలిటిక్స్ విభాగంలో అనుబంధ కోర్సు చేసేందుకు ప్రపంచ బ్యాంకు ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)లో మాస్టర్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ చేశారు. కోర్సును అభ్యసించిన వారికి.. మరో ఆర్నెల్ల పాటు ప్రత్యేక కోర్సు చేయడానికి ప్రపంచబ్యాంకు ఫెలోషిప్ అందజేస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 18వ తేదీ నుంచి 27వ తేదీ దాకా 9 రోజుల పాటు వాషింగ్టన్ డీసీలో జరిగే క్లాసులకు ఆయన హాజరుకానున్నారు. ఆ తర్వాత ఆర్నెల్ల పాటు కోర్సు చేయనున్నారు. కోర్సుకు సంబంధించిన మొత్తం ఖర్చు ఫెలోషిప్ నుంచి అందనుంది.

నాగారంలో 50 ఎకరాలు భూదాన్ భూములే

- వాటిపై జరిగిన లావాదేవీలు చెల్లవు: కాంపిటెంట్ అథారిటీ

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం నాగారంలోని సర్వే నెంబర్ 181, 182ల్లోని 50 ఎకరాలు భూదాన్ యజ్ఞబోర్డు భూములే అని కాంపిటెంట్ అథారిటీ కం రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ పేర్కొన్నారు. భూదాన్ యజ్ఞబోర్డు కాంపిటెంట్ అథారిటీ హోదాలో కక్షిదారుల వాదనలు విని ఈ మేరకు ప్రొసీడింగ్స్ జారీచేశారు. నవాబ్ మహమ్మద్ హాజీఖాన్ ఫాం-1 రాజీనామా (రిలింక్విష్‌మెంట్) ద్వారా ఆ భూములను భూదాన్ బోర్డుకు దానం చేశారని స్పష్టం చేశారు. వాటిపై ఆయన వారసులకు ఎలాంటి హక్కులు ఉండవని తేల్చిచెప్పారు. ఆ భూములకు సంబంధించి జరిగిన లావాదేవీలేవీ చెల్లవని స్పష్టంచేశారు. రికార్డుల్లో ఎవరి పేర్లు నమోదయినప్పటికీ వాటిని భూదాన్ భూములుగానే పరిగణిస్తామని తెలిపారు. ఈ భూములకు సంబంధించి హైకోర్టులో కేసు తేలిన తర్వాత భూదాన్ భూములుగా రికార్డులు సవరించాలని రంగారెడ్డి కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు.

రంగుల పండుగతో ఆనందం విరియాలి

- ప్రజలకు సీఎం రేవంత్ హోలీ శుభాకాంక్షలు..

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంగుల పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలు జరుపుకొనే ఈ పండుగ సమైక్యతకు అద్దం పడుతోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసానిచ్చారు. ఇటు ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి కుటుంబాల్లో ఆనందోత్సాహాలు నింపాలని ఆకాంక్షించారు.

చీరకట్టే.. మహిళలకు అందం

- మాంగళ్య షాపింగ్ మాల్ చైర్మన్ కాసం నమశ్శివాయ
- 'మాంగళ్య'లో ఘనంగా చీరకట్టు కార్యక్రమం


హనుమకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చీరకట్టే.. మహిళలకు అందమని మాంగళ్య షాపింగ్ మాల్ చైర్మన్ కాసం నమశ్శివాయ అన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో ప్రప్రథమంగా 'చీర కట్టు' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వనస్థలిపురంలోని మాంగళ్య షాపింగ్ మాల్‌లో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. చెన్నైకి చెందిన ప్రముఖ శారీ డ్రేపర్ కవిత.. చీర కట్టు ఎలా ఉండాలో వివరించారు. హైదరాబాద్‌లోని ఫ్యాషన్ డిజైనర్లు, బ్యూటీ పార్లర్ల నిర్వాహకులు హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం శివ, పుల్లూరు అరుణ్ కుమార్, తౌనుపునూరి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డైరెక్టర్లు పుల్లూరి అరుణ్ కుమార్, తౌనుపునూరి అరుణ్ కుమార్

ఫొటోలు దిగి చూపాలా?

(మొదటిపేజీ తరువాయి)

సమస్యలు లేవనెత్తుతారని, వాటిని సాధిస్తారని.. నిర్మలా సీతారామన్ చెన్నైకి మెట్రో తీసుకెళ్లారని తెలిపారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన కిషన్‌రెడ్డి మాత్రం తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అయినా, తామిచ్చిన ఆరు గ్యారెంటీల గురించి కేంద్రాన్నేమీ అడగడం లేదని, ప్రధాని మోదీ ప్రకటించిన.. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో గురించే అడుగుతున్నామని తెలిపారు. తెలంగాణ సమస్యలపై పోరాడాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డికి ఉందన్నారు. హిందీ ఎక్కువ మంది మాట్లాడే భాషేనని, జాతీయ భాష కాదని పునరుద్ఘాటించారు. హిందీ తర్వాత తెలుగే ఎక్కువగా మాట్లాడతారన్నారు. హిందీని దక్షిణాదిపై రుద్దడంలో బీజేపీకి ఏదో రహస్య అజెండా ఉందని ఆరోపించారు.


కేంద్రమంత్రి జైశంకర్‌కు తెలంగాణ తల్లి చిత్రపటాన్ని బహూకరిస్తున్న సీఎం రేవంత్

చెబితే కచ్చితంగా చేస్తా.. రాజీ పడను

తాను చెబితే కచ్చితంగా చేస్తానని, ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడనని రేవంత్ రెడ్డి తెలిపారు. 'రేవంత్.. చెప్తే చేస్తాడు. పీసీసీ అధ్యక్షుడిగా ఇచ్చిన ప్రతిమాటను నెరవేర్చాను. సీఎం పదవి వచ్చిన తర్వాత ఎంతో మంది వస్తుంటారు. కానీ.. కొట్లాడేటప్పుడు, ఉద్యమాలు చేసేటప్పుడు ఎవరైతే మనతో ఉంటారో, వాళ్లకు అండగా ఉండాలి. కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో మనతో ఉన్నోళ్లు ముఖ్యం కదా? సమయాన్ని బట్టి అందరికీ న్యాయం చేస్తానని చెప్పా. అలాగే, చేస్తున్నా. కాంగ్రెస్ కోసం పనిచేసిన 37 మందికి ఒకేసారి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చా. గతంలో ఎప్పుడైనా ఇలాంటి పరిస్థితిని చూశామా? ఇచ్చిన హామీలో భాగంగానే అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్ నాయక్‌కు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించాం. విజయశాంతి ఎమ్మెల్యేగా పోటీ చేయనని, ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరింది. శంకర్ నాయక్ ఎమ్మెల్యే సీటు కావాలని అడిగితే ఇవ్వడం కుదరదని చెప్పా. ఎమ్మెల్సీని చేస్తానని.. అప్పటి వరకు పార్టీ కోసం కష్టపడి పనిచెయ్యాలని సూచించా. అన్నట్టుగానే ఎమ్మెల్సీని చేశా. ఇలా.. ఇచ్చిన ప్రతిమాటను నెలబెట్టుకుంటున్నా. ఒక ట్రాక్ రికార్డు ఉండాలి కదా? రేవంత్ చెబితే చేస్తాడనే నమ్మకం కేడర్‌లోనూ, ప్రజల్లోనూ ఉండాలి. అందుకే కేడర్‌ను బలోపేతం చేస్తానే, హామీలు అమలు చేస్తున్నా" అని రేవంత్ తెలిపారు.

అబద్ధాలు చెప్పడం.. మభ్యపెట్టడం చేతకాదు..

పదేళ్లలో బీఆర్ఎస్ తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అదే విషయాన్ని ప్రజలకు చెప్పానన్నారు. రూ.7 లక్షల కోట్ల అప్పు ఉందని, దశలవారీగా హామీలు అమలు చేస్తానని చెప్పానని, అందులో తప్పేముందని ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పడం, ప్రజలను మభ్యపెట్టడం తనకు చేతకాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా, ప్రభుత్వ ఏర్పాటు, యంత్రాంగం తదితర విషయాలన్నింటినీ సరిచేసుకుని.. సీఎంగా పనిచేసింది ఎనిమిది నెలలేనని చెప్పారు. ఈ కొద్ది సమయంలోనే రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.10 లక్షల ఆరోగ్య సేవలు.. ఇలా ఎన్నో పథకాలను అమలు చేశానని తెలిపారు. నిరుద్యోగ రేటును గణనీయంగా తగ్గించానని, సొంత పన్నుల రాబడిలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపానని గుర్తుచేశారు. ఐదేళ్ల తర్వాత ఎన్నికలకు వెళితే 'రేవంత్ చెబితే చేస్తాడు'.. అనే నమ్మకంతో ప్రజలు ఓటేయాలని, ప్రస్తుతం అదే చేస్తున్నానని వివరించారు.

కేసీఆర్ అసెంబ్లీలో చర్చకు రావాలి..

కేసీఆర్ గవర్నర్ ప్రసంగానికి రావడం కాదని, అసెంబ్లీలో చర్చలకు రావాలని రేవంత్‌రెడ్డి సూచించారు. పదేళ్లలో రాష్ట్రాన్ని తుప్పు పట్టించారని, ఇప్పుడిప్పుడే ఆ తప్పును వదిలిస్తూ ముందుకెళుతున్నానని చెప్పారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు ఇలాగే చేశారని తెలిపారు. వారికి గత పాలనలో జరిగిన నష్టాన్ని సరిచేయడానికి రెండేళ్ల సమయం పట్టిందని గుర్తుచేశారు. కేసీఆర్ పదేళ్లలో ఒక్క కొత్త పాలసీనీ తీసుకురాలేదని చెప్పారు. కానీ, తాను అతి తక్కువ సమయంలో కులగణనను పూర్తి చేశానన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు కులగణన చేయడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. ఏపీలోనూ బీజేపీ మిత్రపక్షమే అధికారంలో ఉందని, అక్కడెందుకు కులగణన చేయడం లేదని నిలదీశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నేతల పరిస్థితి రోజురోజుకూ దారుణంగా తయారవుతోందన్నారు. రైతుల పంటలు ఎండిపోతే, టన్నెల్ ప్రమాదంలో ఎవరైనా చనిపోతే బీఆర్ఎస్ నేతలు డప్పులు వాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అది వారి పైశాచిక ఆనందమని తెలిపారు. మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ పూర్తయిందని, ఆ తర్వాత ఆదిలాబాద్, కొత్తగూడెం.. ఇలా అన్నింటికీ మార్గం సుగమం అవుతుందని అన్నారు.

హైదరాబాద్‌లో 'భారత్ సమ్మిట్'

- 60 దేశాల ప్రతినిధులకు ఆహ్వానం
- 'రైజింగ్ తెలంగాణ'కు మద్దతుగా నిలవండి
- కేంద్ర మంత్రి జైశంకర్‌కు సీఎం రేవంత్ వినతి

హైదరాబాద్‌లో వచ్చే నెలలో భారత్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనికి 60 దేశాల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు. రాబోయే 25 ఏళ్లలో తెలంగాణను సమున్నత స్థాయిలో నిలపాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందులో భాగంగా తాము చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా నిలవాలని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌ను కోరారు. ఢిల్లీలో గురువారం ఆయన కేంద్ర మంత్రిని కలిశారు. హైదరాబాద్‌లో ఈ ఏడాది ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న భారత్ సమ్మిట్, మిస్ వరల్డ్ పోటీలు, గ్లోబల్ డీప్‌టెక్ సదస్సు, యానిమేషన్ గేమింగ్, వీఎఫ్ఎక్స్ సదస్సులతోపాటు వినోద పరిశ్రమలో తెలంగాణ బలాన్ని చాటే ఇండియా జాయ్ సదస్సు వివరాలను కేంద్ర మంత్రికి వివరించారు. విదేశాల్లో నిర్వహించే భారత కార్యక్రమాల్లోనూ రైజింగ్ తెలంగాణ'ను ప్రచారం చేయాలని కోరారు. దౌత్య, లాజిస్టిక్ విభాగాల సాయంతో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమాల విజయవంతానికి సహకరించాలని విన్నవించారు. తెలంగాణలో చేపట్టే కార్యక్రమాలకు తమ శాఖ మద్దతుగా నిలుస్తుందని రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి జైశంకర్ హామీ ఇచ్చారు.

'దక్షిణాది'పై కేంద్రం కుట్రను తిప్పికొడతాం

- సీట్లు రాలేదన్న అక్కసుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యాన్ని తగ్గించేందుకు కేంద్రం యత్నం: రేవంత్

న్యూఢిల్లీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల పునర్విభజన పేరిట దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రను తిప్పికొడతామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆ మేరకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్నది నియోజకవర్గాల పునర్విభజన కాదని, అది ముమ్మాటికీ దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యాన్ని తగ్గించే కుట్రని మండిపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు కలిగే నష్టం, చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించేందుకు 22న చెన్నైలో జరిగే సమావేశానికి రావాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డిని తమిళనాడు సీఎం స్టాలిన్ ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో రేవంత్‌రెడ్డిని తమిళనాడు మంత్రి కె.ఎన్.నెహ్రూ ఆధ్వర్యంలోని డీఎంకే ప్రతినిధి బృందం కలిసింది. సీఎం స్టాలిన్ రాసిన లేఖను ముఖ్యమంత్రికి అందించారు. అన్ని పార్టీలు, పౌర సంఘాల అభిప్రాయాలు సేకరించేందుకు స్టాలిన్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారని రేవంత్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో ఎలా వ్యవహరించాలనే అంశంపై స్టాలిన్ కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆయన్ను ప్రోత్సహిస్తామని చెప్పారు. "2026 తర్వాత చేపట్టే జన గణన వరకు నియోజకవర్గాల పునర్విభజన చేపట్టకూడదన్న నిబంధన ఉంది. కానీ, కేంద్రం అవేమీ పట్టించుకోకుండా ఆ ప్రక్రియను తెరపైకి తెచ్చింది. నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడులో ఇప్పటికే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశాం. ఈ విషయంలో తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఒడిసా, పంజాబ్ రాష్ట్రాలతో కూడిన ఐక్య కార్యాచరణ సమితి(జేఏసీ)లో చేరేందుకు అంగీకారం తెలుపుతారని ఆశిస్తున్నా. జేఏసీలోకి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తరపున ఒక ప్రతినిధిని నియమించాలని కోరుతున్నా" అని స్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు. డీఎంకే ప్రతినిధులతో సమావేశం తర్వాత రేవంత్ మీడియాతో మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యాన్ని తగ్గించే ప్రయత్నాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఈ రాష్ట్రాల నుంచి బీజేపీకి పెద్దగా ప్రాతినిధ్యం లేదని, ఇక్కడి ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అధిష్ఠానం అనుమతి తీసుకుని చెన్నై సమావేశానికి హాజరవుతానన్నారు.


బూర్గుల రామకృష్ణారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్

భట్టి, జానారెడ్డి నేతృత్వంలో అఖిలపక్ష భేటీ

నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణలోనూ చర్చలు జరిపేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు అన్ని పార్టీల నేతలను సమావేశానికి ఆహ్వానించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి, మాజీ మంత్రి జానారెడ్డికి సూచించినట్లు చెప్పారు. తాము నిర్వహించే సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కూడా ఆహ్వానిస్తామన్నారు. ఆయన హాజరై.. సమావేశంలో అభిప్రాయాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల హక్కుల పరిరక్షణకు పార్టీలకతీతంగా అందరూ ఏకతాటిపైకి రావాలని విజ్ఞప్తి చేశారు. కాగా, బూర్గుల రామకృష్ణారావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని రేవంత్‌రెడ్డి కొనియాడారు. బూర్గుల జయంతి సందర్భంగా గురువారం ఆయనకు సీఎం నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, సీఎంగా, గవర్నర్‌గా, సాహితీవేత్తగా బూర్గుల బహుముఖ ప్రజ్ఞ కనబరిచారని అన్నారు.

కంచ గచ్చిబౌలిలో..
400 ఎకరాలు ప్రభుత్వానివే

(మొదటిపేజీ తరువాయి)

లేదని, పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉందని స్పష్టతనిచ్చాయి. ఆ భూముల్లో ఐటీ, వాణిజ్య, నివాస జోన్లను అభివృద్ధి చేయడంతో పాటు.. ఆ ప్రాంతాన్ని సుస్థిరాభివృద్ధికి కేంద్రంగా మార్చనున్నట్లు వివరించాయి. లేఅవుట్ చేసి, వేలం వేయాలని నిర్ణయించిన 400 ఎకరాల భూమి హెచ్‌సీయూ పరిధిలో ఉందంటూ ఇటీవల ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ పరిశ్రమల మౌలిక వనరుల సంస్థ(టీజీఐఐసీ) ఈ భూములపై గురువారం ఓ ప్రకటనను విడుదల చేసింది. హద్దుల కోసం హెచ్‌సీయూ చేసిన అభ్యర్థన మేరకు 2024 జూలై 19న సంయుక్తంగా భూముల సరిహద్దులను గుర్తించినట్లు పేర్కొంది. ఈ భూముల్లోని బఫెల్లో లేక్, పీకాక్ లేక్‌లు లేవనే విషయం కూడా ఈ సందర్భంగా తేలిందని తెలిపింది. ఈ భూముల్లో రాతి నిర్మాణాలు, పుట్టగొడుగు ఆకారంలోని కొన్ని రాళ్లు ఉన్నాయని, వాటిని గ్రీన్‌జోన్‌గా ఏర్పాటుచేయనున్నామని, ఇందుకోసం పర్యావరణ పరిరక్షణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించింది. వర్సిటీకి చెందిన భూములను గానీ, నీటి వనరులు, రాతి నిర్మాణాలను గానీ తొలగించలేదని వివరించింది. కంచ గచ్చిబౌలి భూముల్లో ఐటీ, ఇతర అభివృద్ధి ప్రాజెక్టుల ఏర్పాటు కోసం టీజీఐఐసీ ప్రభుత్వానికి దరఖాస్తు చేయగా.. సర్కారు 2024 జూన్ 26న తమకు కేటాయిస్తూ.. ఉత్తర్వులిచ్చిందని పేర్కొంది. 2024 జూలై 1న టీజీఐఐసీకి అధికారికంగా అప్పగించినట్లు తెలిపింది. ఈ భూముల్లో ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ కోసం టీజీఐఐసీ ఇటీవల టెండర్లను ఆహ్వానించిన విషయాన్ని గుర్తుచేసింది. లేఅవుట్ వేసిన భూములు ఎక్కువ ధర పలికేందుకు ఈ భూములకు దగ్గర్లో ఉన్న ఐఐఐటీ జంక్షన్ నుంచి ఔటర్ రింగు రోడ్డు(ఎగ్జిట్ నంబరు 1)కు దగ్గర్లో ఉన్న జీఏఆర్ రోటరీ వరకు 5 కిలోమీటర్ల మేర రోడ్డును అభివృద్ధి చేయాలని నిర్ణయించి, ఇటీవల టెండర్లను ఆహ్వానించినట్లు తెలిపింది.

ఇదీ భూముల కథ..

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని కంచ గచ్చిబౌలి సర్వే నంబరు 25లో ఉన్న 400 ఎకరాల భూమిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2003లో అప్పటి ప్రభుత్వం క్రీడా సౌకర్యాల అభివృద్ధి కోసం ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు కేటాయించింది. అయితే.. ఆ ప్రాజెక్టు ప్రారంభంకాకపోవడంతో 2006లో ఆ భూముల కేటాయింపును ప్రభుత్వం రద్దు చేసింది. దీనిపై ఐఎంజీ అకాడమీస్ సంస్థ హైకోర్టును ఆశ్రయించగా.. 2024 మార్చి 7న ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చింది. ఆ తర్వాత ఆ సంస్థ వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

22న చెన్నై సమావేశానికి వెళ్తాం

- బీఆర్ఎస్ వాదనను బలంగా వినిపిస్తాం
- నియోజకవర్గాల పునర్విభజనతో 'దక్షిణాది'కి అన్యాయం: కేటీఆర్
- కేటీఆర్‌ను కలిసిన డీఎంకే బృందం

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జనాభా ఆధారంగా కేంద్రం చేపట్టదలచిన నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ అంశంపై కార్యాచరణ రూపొందించేందుకు తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్యక్షతన ఈ నెల 22న చెన్నైలో నిర్వహించనున్న సమావేశంలో పాల్గొంటామని తెలిపారు. డీఎంకే ప్రతినిధులు గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌తో భేటీ అయ్యారు. చెన్నైలో నిర్వహించే సమావేశంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొనాలని తమిళనాడు మంత్రి కె.ఎన్.నెహ్రూ, ఎంపీ ఎన్.ఆర్.ఇళంగో, ఇతర నేతలు ఆహ్వానించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు కుటుంబ నియంత్రణను పకడ్బందీగా అమలు చేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించాలనుకోవడం దారుణమని చెప్పారు. స్టాలిన్ ఆధ్వర్యంలో చెన్నైలో నిర్వహించే సమావేశానికి బీఆర్ఎస్ తరఫున హాజరు కావాలని కేసీఆర్ ఆదేశించారన్నారు. ఇందులో పాల్గొని తమ పార్టీ వాదాన్ని బలంగా వినిపిస్తామని తెలిపారు. తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సమష్టిగా పోరాడితే తప్పకుండా న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. 1970-80ల్లో కుటుంబ నియంత్రణ బాగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల పార్లమెంట్ స్థానాలను కొత్త జనాభా లెక్కల ప్రకారం నిర్ణయిస్తామనడం అన్యాయమని చెప్పారు. దీనివల్ల పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుందని కేటీఆర్ తెలిపారు. అనంతరం డీఎంకే ప్రతినిధులు మాట్లాడుతూ.. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయాన్ని తమిళనాడు సీఎం స్టాలిన్ మొదటి నుంచి ప్రశ్నిస్తున్నారన్నారు. అందులో భాగంగా దక్షిణాదిలోని అన్ని పార్టీలతో చెన్నైలో భేటీ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.


డీఎంకే ప్రతినిధులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

యాతాలకుంట టన్నెల్ ఆగస్టు చివరికల్లా పూర్తవ్వాలి..

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

సత్తుపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం పనుల్లో భాగంగా సత్తుపల్లి ట్రంక్‌లో నిర్మిస్తున్న యాతాలకుంట టన్నెల్ పనులను ఆగస్టు చివరికల్లా పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంటలో టన్నెల్ పనులను ఖమ్మం, కొత్తగూడెం కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేశ్ వీ పాటిల్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం సీతారామ ప్రాజెక్టు ఇంజనీరింగ్, అటవీ, రెవెన్యూ, ఉద్యానవన, విద్యుత్తు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి ప్రాజెక్టు పనుల పురోగతిని మంత్రికి వివరించారు. మరో 700 మీటర్ల టన్నెల్ పనులు పూర్తి కావాల్సి ఉందని తుమ్మల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన చెప్పారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పరిహారం డబ్బులు బ్యాంకుల్లో వేయాలని సూచించారు. విద్యుత్ లైన్లను మార్చేందుకు అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. ఆగస్టు చివరికల్లా టన్నెల్ పూర్తి చేసి గోదావరి నీటిని విడుదల చేసి స్థానికంగా ఉన్న వాగులు, చెరువులకు మళ్లించాలని ఆదేశించారు. రైతు భరోసా నిధులు ఈ నెలాఖరుకల్లా రైతుల ఖాతాల్లో పూర్తిగా జమ చేస్తామని మంత్రి ప్రకటించారు. ధాన్యం బోనస్ డబ్బులు కూడా రూ.200 కోట్లు రైతుల ఖాతాల్లో వేస్తామన్నారు. కార్యక్రమంలో ఖమ్మం జెడ్పీ సీఈవో దీక్షారైనా, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు.


యాతాలకుంట టన్నెల్‌లోకి ట్రాక్టర్‌పై వెళ్తున్న మంత్రి తుమ్మల

నా రాజకీయ దిశానిర్దేశకుడు గాదె సత్యం..

తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి దిశానిర్దేశం చేసిన వ్యక్తి గాదె సత్యం అని మంత్రి తుమ్మల చెప్పారు. ఆయన సూచనలకు అనుగుణంగానే తన రాజకీయ నడవడిక సాగిందన్నారు. గాదె సత్యనారాయణ దశ దినకర్మ సందర్భంగా సత్తుపల్లిలో నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తనకు సలహాలిస్తూ ఎప్పుడూ వెన్నంటి ఉండే గాదె సత్యం మృతి తనను తీవ్రంగా కలచి వేసిందని భావోద్వేగానికి గురయ్యారు. సత్యం మృతి తనకు తీరని లోటని.. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దేశ విభజనకు కాంగ్రెస్ కుట్ర

- డీలిమిటేషన్‌పై రేవంత్ వ్యాఖ్యలు గర్హనీయం: బీజేపీ ఎంపీ లక్ష్మణ్



హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది, దక్షిణాది పేరిట దేశాన్ని విభజించేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ మండిపడ్డారు. దేశ సమైక్యత, సమగ్రతకు భంగం కలిగించేలా ఆ పార్టీ ముఖ్యమంత్రులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడు సీఎం స్టాలిన్ ఏర్పాటు చేయనున్న సమావేశానికి హాజరవుతానంటూ సీఎం రేవంత్ చేసిన ప్రకటనపై రాహుల్ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దక్షిణాదిపై బీజేపీ కుట్ర పన్నుతోందని, డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు నష్టమని రేవంత్ మాట్లాడటం ముఖ్యమంత్రి స్థాయికి తగదన్నారు. తెలంగాణలో కూడా కాంగ్రెస్ తరఫున, అదే విధంగా ప్రభుత్వం తరఫున అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పడం కాంగ్రెస్ దురుద్దేశాన్ని తెలియజేస్తోందని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జానారెడ్డి నాయకత్వంలో ఏర్పాటు చేసేది ప్రభుత్వ కమిటీనా..? లేక కాంగ్రెస్ ఏర్పాటు చేసుకున్న కమిటీనా..? ముఖ్యమంత్రి చెప్పాలని లక్ష్మణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

స్టాలిన్ సొంత కరెన్సీ కోరుకుంటున్నారా: సుభాష్

తమిళనాడు ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో రూపీ గుర్తును తమిళ లిపిలో ప్రచురించడం సరికాదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ అన్నారు. 'మీరు సొంత కరెన్సీ కోరుకుంటున్నారా..? ఇదేమి రాజకీయం..?' అని నిలదీశారు. డీఎంకే ప్రభుత్వ చర్య జాతి వ్యతిరేకమని సుభాష్ ఒక ప్రకటనలో మండిపడ్డారు.

సునీతా విలియమ్స్ రాక మరింత ఆలస్యం

న్యూఢిల్లీ, మార్చి 13: దాదాపు తొమ్మిది నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో ఉండిపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ భూమికి తిరిగి రావడం మరింత ఆలస్యం కానుంది. సునీతతోపాటు ఐఎస్ఎస్‌లో ఉన్న బచ్ విల్మోర్‌ను భూమికి తీసుకొచ్చేందుకు నాసా, స్పేస్ఎక్స్ గురువారం తలపెట్టిన క్రూ-10 విఎషన్ సాంకేతిక సమస్యల వల్ల వాయిదా పడింది. ఈ ప్రయోగంలో భాగంగా నాసాకు చెందిన కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్ రాకెట్ సాయంతో డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్‌ను ఐఎస్ఎస్‌కు పంపాలని అనుకున్నారు. ఈ స్పేస్ క్రాఫ్ట్‌లో బయలుదేరే నలుగురు వ్యోమగాములు సునీత, విల్మోర్ స్థానంలో ఐఎస్ఎస్‌లో బాధ్యతలు చేపడతారు. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం మార్చి19న సునీత, విల్మోర్ అదే స్పేస్‌క్రాఫ్ట్‌లో భూమికి తిరుగుప్రయాణం కావాల్సి ఉంది. కానీ, సాంకేతిక సమస్యలు, డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్ ప్రయాణించే మార్గంలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల గురువారం తలపెట్టిన ప్రయోగం ఆఖరి నిమిషంలో వాయిదా పడింది. భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం 4.33 గంటలకు క్రూ-10 ప్రయోగాన్ని మరోసారి చేపట్టాలని నాసా, స్పేస్ఎక్స్ నిర్ణయించాయి.

యూట్యూబ్‌లో చూసి స్మగ్లింగ్ నేర్చుకున్నా

» డీఆర్ఐకి ఇచ్చిన వాంగ్మూలంలో నటి రన్యా రావు

న్యూఢిల్లీ/బెంగళూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కన్నడ నటి రన్యా రావు బంగారం స్మగ్లింగ్ కేసు ప్రకంపనలు కన్నడ నాట కొనసాగుతున్నాయి. ఈ కేసులో ఇప్పటికే సీబీఐ విచారణ చేపట్టగా తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా రంగంలోకి దిగింది. మరోపక్క రన్యా రావును డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) విచారించి వాంగ్మూలం నమోదు చేసింది. గతంలో తానెప్పుడు బంగారం స్మగ్లింగ్ చేయలేదని, ఇదే మొదటిసారి అని డీఆర్ఐ విచారణలో రన్యా రావు వెల్లడించారు. బంగారాన్ని స్మగ్లింగ్ ఎలా చేశారో వివరించారు. యూట్యూబ్‌లో వీడియోలు చూసి స్మగ్లింగ్ చేయడం నేర్చుకున్నానని చెప్పారు. గతంలో తానెప్పుడు దుబాయ్‌లో బంగారం కొనలేదని స్మగ్లింగ్ చేయడం ఇదే మొదటిసారి అని ఆమె తెలిపారు. కాగా, రన్యారావు దుబాయి నుంచి తీసుకువచ్చిన కేజీల కొద్దీ బంగారం ఎక్కడికి వెళ్లిందని గురువారం హుబ్బళిలో కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి ప్రశ్నించారు.

ఆపరేషన్‌పై పాక్ అబద్ధం చెబుతోంది

» పాక్ సైన్యానికి భారీ నష్టం జరిగిందంటోన్న బీఎల్ఏ

ఇస్లామాబాద్, మార్చి13: జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్ ఘటనలో బందీలందరినీ విడిపించామని, ఆపరేషన్ విజయవంతంగా ముగిసిందని పాక్ సైన్యం ప్రకటించడంపై బలోచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) స్పందించింది. పాక్ సైన్యం అబద్ధాలు ప్రచారం చేస్తోందని, రెండు వర్గాల మధ్య పోరాటం కొనసాగుతోందని బీఎల్ఏ వెల్లడించింది. మరణించిన సైనికులు, రెబల్స్ ఫొటోలను పాక్ సైన్యం ఇంకా ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించింది. పాక్ సైన్యానికి భారీగా నష్టం జరుగుతోందని, బందీలుగా ఉన్న సిబ్బందిని రక్షించుకోలేకపోయిందని తెలిపింది. కాగా, బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పర్యటించారు.

బృందావనంలో ముస్లిం కళాకారుల సేవలను కాదనలేం: ఆలయ పురోహితులు

మథుర, మార్చి 13: బృందావనంలోని బంకే బిహారీ మందిరంలో ముస్లిం కళాకారుల సేవలను కాదనలేమని ఆలయ అర్చకులు స్పష్టం చేశారు. శ్రీకృష్ణుడికి అలంకరించే దుస్తులను వారే తయారు చేస్తుంటారని, ఆ విధానాన్ని నిలిపివేయలేమని తెలిపారు. ఆలయ సంప్రదాయాల్లో మతపర వివక్షకు చోటులేదని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడికి ముస్లిం కళాకారులు తయారు చేసే దుస్తులను అలంకరించకూడదంటూ శ్రీకృష్ణ జన్మభూమి ముక్తి సంఘర్ష్ న్యాస్ నాయకుడు దినేష్ శర్మ రాసిన లేఖపై వారు స్పందిస్తూ ఈ స్పష్టత ఇచ్చారు. మతపరమైన స్వచ్ఛత ఉన్నవారే ఈ దుస్తులు తయారు చేసేలా చూడాలని లేదంటే ఆందోళన చేస్తామని శర్మ హెచ్చరించారు. దీనిపై ఆలయ ప్రధాన అర్చకుడు జ్ఞానేంద్ర కిశోర్ గోస్వామి స్పందిస్తూ.. ముస్లిం కళాకారులను తొలగించాలన్న డిమాండ్ ఆచరణ సాధ్యం కాదని తెలిపారు. స్వామికి అవసరమయ్యే దుస్తులు, కిరీటాలను భక్తులే సమర్పిస్తుంటారని, తొలుత వారు పరిశుద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. మతం ఆధారంగా కళాకారుల స్వచ్ఛతను ప్రశ్నించలేమని చెప్పారు.

సిసోడియా, జైన్‌లపై కేసుల నమోదుకు రాష్ట్రపతి అంగీకారం

న్యూఢిల్లీ, మార్చి 13: ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లపై కేసుల నమోదుకు రాష్ట్రపతి ముర్ము అంగీకారం తెలిపారు. వారు ఢిల్లీ ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నప్పుడు చేపట్టిన పాఠశాల గదుల నిర్మాణంలో రూ.2,000 కోట్ల మేర అవినీతి జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరపనున్నారు. పాఠశాల గదుల నిర్మాణంలో అవినీతి జరిగినట్టు 2019లో బీజేపీ నేత హరీష్ ఖురానా, అప్పటి ఆప్ తిరుగుబాటు ఎమ్మెల్యే (ప్రస్తుత రాష్ట్ర మంత్రి) కపిల్ మిశ్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఏసీబీ దీనిపై దర్యాప్తు జరిపి నివేదిక ఇచ్చింది. రూ.2,892.65 కోట్లు వెచ్చించి 12,748 గదులు నిర్మించినట్టు ఇందులో రూ.2,000 కోట్ల మేర అవినీతి జరిగినట్టు పేర్కొంది.

తమిళనాడు బడ్జెట్‌లో ₹ మాయం

(మొదటి పేజీ తరువాయి)



ముదిరింది. జాతీయ విద్యావిధానంలో భాగంగా త్రిభాష విధానాన్ని ప్రవేశపెడుతూ మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్టాలిన్ ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. త్రిభాషల్లో హిందీని గుర్తించబోమని తేల్చిచెబుతోంది. తాజా నిర్ణయంపై గురువారం సీఎం స్టాలిన్ తన 'ఎక్స్' ఖాతాలో స్పందించారు. సమాజంలోని అన్ని వర్గాలకు ప్రయోజనాలు అందేలా తమిళనాడు రాష్ట్రాన్ని అభివృద్ధి పరచడం కోసమే తాజా మార్పు చేసినట్టు ఆయన చెప్పారు. ద్రవిడియన్ నమూనా, టీఎన్‌బడ్జెట్ 2025 అనే హ్యాష్‌ట్యాగ్‌ను దానికి జోడించారు. రూపీ లోగోను తాము తిరస్కరించలేదని, మాతృభాష తమిళానికి తగిన ప్రోత్సాహం మాత్రమే అందిస్తున్నామని అధికారిక డీఎంకే ప్రతినిధి ఎ.శరవణన్ వివరణ ఇచ్చారు. బడ్జెట్ లోగోలో హిందీని తొలగించిన విషయం సోషల్ మీడియాలో తీవ్రంగా వైరల్ అవుతోంది. ఈ చర్యను ఆ రాష్ట్ర బీజేపీ శాఖ అధ్యక్షుడు అన్నామలై తీవ్రంగా ఖండించారు. ఓ తమిళుడు.. అది కూడా డీఎంకే మాజీ ఎమ్మెల్యే కుమారుడైన ఉదయకుమార్ రూపొందించిన రూపీ చిహ్నాన్ని తొలగించడం గర్హనీయమన్నారు. ఆ చిహ్నాన్ని బడ్జెట్ లోగో నుంచి తొలగించడం సీఎం స్టాలిన్ అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. దేశం దృష్టిలో తమిళులను అపహాస్యం పాలు చేశారంటూ స్టాలిన్‌పై మండిపడ్డారు. బీజేపీ ఐటీ జాతీయ విభాగం అధ్యక్షుడు అమిత్ మాలవీయా కూడా స్టాలిన్ నిర్ణయాన్ని తప్పుబడుతూ, ఇదే అభిప్రాయం వెలిబుచ్చారు. పిచ్చి చేష్టలు మానాలని, రాష్ట్ర హక్కులు పేరిట ప్రజలను రెచ్చగొట్టవద్దు అని స్టాలిన్‌కు ఏఐడీఎంకే ప్రతినిధి కోవై సత్యన్ సూచించారు.

అది ప్రభుత్వ ఇష్టం: రూపీ రూపశిల్పి

రూపీ చిహ్నం రూపశిల్పి ఉదయకుమార్ ధర్మలింగం ఐఐటీ గువాహటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. తాజా వివాదంపై స్పందించేందుకు ఆయన నిరాకరించారు. డీఎంకే నాయకుడు తన తండ్రి కావడానికీ, రూపీ లోగో రూపకల్పనకూ ఎటువంటి సంబంధం లేదని ఆయన తెలిపారు. అది కేవలం కాకతాళీయమని పేర్కొన్నారు. "రూపీ ఆకృతిని మార్చి, దాని స్థానంలో సొంత ఏర్పాటు చేసుకోవాలని తమిళనాడు ప్రభుత్వం హఠాత్తుగా నిర్ణయం తీసుకుంది. అది పూర్తిగా ప్రభుత్వ ఇష్టం. దీనిపై నేను స్పందించడానికి ఏమీ లేదు." అని ఉదయకుమార్ తెలిపారు. వృద్ధుడైన తన తండ్రి ప్రస్తుతం గ్రామంలో సుఖంగా జీవిస్తున్నారని చెప్పారు. కాగా, ధర్మలింగం 1971 నుంచి డీఎంకేలో పనిచేస్తున్నారు. గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు.

ఉత్తరాదివారే అనాగరికులు

మంత్రి దురైమురుగన్

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాదికి చెందినవారే అనాగరికులని, బహుభర్తృత్వం పాటిస్తారని, కంపుకొట్టే నాగరికత వారిదేనంటూ డీఎంకే ప్రధాన కార్యదర్శి, తమిళనాడు సీనియర్ మంత్రి దురైమురుగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమిళనాడు ఎంపీలను అనాగరికులను విమర్శించడాన్ని ఖండిస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన సభలు జరిగాయి. ఈ నేపథ్యంలో వేలూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న దురైమురుగన్ మాట్లాడుతూ.. వివాదాస్పద వ్యాఖ్యలెన్నో చేశారు. "తమిళనాట ఒకరికి ఒకతే అనే రీతిలో ఏకపత్నీ విధానం ప్రాచీన కాలం నుంచే అమలులో ఉంది. ఉత్తరాదిలో అలా కాకుండా ఐదుగురు లేదా పదిమంది కలిసి ఓ యువతిని పెళ్లాడే విధానం ఉంది. ఒకరు పోయినా మరొకరు పెనిమిటిగా ఉంటారు. ఇలాంటి కంపుకొట్టే నాగరికత వారిది" అంటూ వ్యాఖ్యానించారు.

స్పేడెక్స్ అన్ డాకింగ్ విజయవంతం

కక్ష్యలో ఛేజర్, టార్గెట్‌లను వేరు చేసిన ఇస్రో

భవిష్యత్తులో భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే చంద్రయాన్-4, గగన్‌యాన్‌లకు లైన్ క్లియర్

బెంగళూరు, మార్చి 13: స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) మిషన్‌లో భాగంగా రెండు నెలల క్రితం ఎస్‌డీఎక్స్-01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్-02 (టార్గెట్) ఉపగ్రహాలను కక్ష్యలో అనుసంధానం (డాకింగ్) చేసిన ఇస్రో.. తాజాగా వాటిని వేరు చేసినట్టు (అన్‌డాకింగ్) తెలిపింది. ఈ ప్రక్రియ విజయవంతమైందని ప్రకటించింది. ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానం చేసే మిషన్‌లో భాగంగా గత ఏడాది డిసెంబరు 30న ఇస్రో ఛేజర్, టార్గెట్ అనే జంట ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలోకి పంపింది. పలు ప్రయత్నాల అనంతరం జనవరి 16న వాటిని విజయవంతంగా డాకింగ్ చేసింది. దీంతో అమెరికా, రష్యా, చైనా తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ రికార్డు నెలకొల్పింది. తాజాగా ఆ జంట ఉపగ్రహాలను విజయవంతంగా అన్‌డాకింగ్ చేసింది. ఈ ప్రయత్నాలు సక్సెస్ కావడంతో మరింత కచ్చితత్వం కోసం ఇస్రో భవిష్యత్తులో మరిన్ని డాకింగ్, అన్‌డాకింగ్ విన్యాసాలు చేపట్టే అవకాశం ఉంది.

అద్భుత వీడియోలు పంచుకున్న ఇస్రో

సొంతంగా అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, చంద్రయాన్-4, గగన్‌యాన్ వంటి ప్రతిష్ఠాత్మక భవిష్యత్ మిషన్లను సజావుగా నిర్వహించడానికి మార్గం సుగమం చేస్తూ ఇస్రో స్పేడెక్స్ ఉపగ్రహాలను విజయవంతంగా వేరు చేసింది. కక్ష్యలో విడిపోతున్న ఉపగ్రహాలకు సంబంధించిన అద్భుత దృశ్యాలకు సంబంధించి ఇస్రో ఎక్స్‌లో రెండు వీడియోలు పోస్టు చేసింది. అందులో ఛేజర్ నుంచి టార్గెట్ విడిపోతున్న దృశ్యం స్పష్టంగా కనిపించింది. కాగా, స్పేడెక్స్ మిషన్ అన్‌డాకింగ్ సక్సెస్ కావడంతో ఇస్రో బృందానికి కేంద్ర మంత్రులు అమిత్ షా, జితేంద్ర సింగ్ అభినందనలు తెలిపారు. కాగా, ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి స్పేడెక్స్ మిషన్‌లో మరిన్ని ప్రయోగాలు చేపడతామని చెప్పారు.

'డీలిమిటేషన్'పై సమావేశానికి మద్దతు

నేను రాలేను.. డీకే శివకుమార్ హాజరవుతారు

తమిళనాడు సీఎంకు కర్ణాటక ముఖ్యమంత్రి లేఖ

బెంగళూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ, అసెంబ్లీ నియోజవర్గాల పునర్విభజన అంశంపై నిర్వహించే సమావేశానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని కర్ణాటక సీఎం సిద్దరామయ్య స్పష్టం చేశారు. అయితే ముందస్తు షెడ్యూల్, పలు కారణాల రీత్యా తాను ఈనెల 22న జరిగే ఈ భేటీకి హాజరు కాలేకపోతున్నానని, సమావేశ ప్రాముఖ్యత నేపథ్యంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వస్తారని తమిళనాడు సీఎం స్టాలిన్‌కు గురువారం రాసిన లేఖలో పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన సాధక బాధకాలపై అవగాహన ఉందని, దీనిపై దక్షిణాది రాష్ట్రాల్లో సమగ్ర చర్చలు జరగాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. కాగా, సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ స్టాలిన్‌కు లేఖ రాసిన విషయాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్‌కు తమిళనాడులోని అధికార డీఎంకేతో మైత్రి ఉందని, ఆ పార్టీ తీసుకున్న నిర్ణయం సంతృప్తి కలిగిస్తోందని పేర్కొన్నారు. తమిళనాడు నుంచి వచ్చిన మంత్రితో చర్చించామని, పార్టీ అధిష్ఠానంతో చర్చించాక నిర్ణయం తీసుకుంటామని చెప్పామని తెలిపారు.

కాల్పుల విరమణకు పుతిన్ అంగీకారం

» రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీలక పరిణామం

» ముఖ్య పాత్ర పోషించిన ట్రంప్

మాస్కో,మార్చి13: అమెరికా ప్రతిపాదించిన 30 రోజుల కాల్పుల విరమణకు సూత్రప్రాయంగా అంగీకరిస్తున్నట్లు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. అయితే దీనికి సంబంధించి నియమనిబంధనలను రూపొందించాల్సి ఉందన్నారు. చిరశాంతికి అవే ప్రాతిపదికలు అవుతాయని అయన పేర్కొన్నారు. దీనిపై అమెరికా సహచరులతోనూ, ఇతర భాగస్వాములతోనూ మాట్లాడనున్నట్లు ఆయన మాస్కోలో విలేకరుల సమావేశంలో తెలిపారు. శాంతి ఒప్పందాన్ని ఎవరూ ఉల్లంఘించకుండా తగిన యంత్రాంగాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని పుతిన్ చెప్పారు. అంతకు ముందు ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోకుంటే రష్యాకు తీవ్ర ఆర్థిక కష్టాలు తప్పవని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. తాను తలచుకొంటే రష్యాకు కష్టాలు తీవ్రం చేయగలనని, అది రష్యాకు వినాశకరమవుతుందన్నారు. అయితే, తానలా కోరుకోవట్లేదని, శాంతిని కోరుకుంటున్నానని చెప్పారు.

ప్రాజెక్టులకు నిధుల వినియోగం ఇలాగేనా?

» 21,640 కోట్లలో 58 శాతమే ఖర్చు

» పోలవరానికి కేటాయింపులు పెరిగాయ్

» తొలిదశ అంచనా రూ. 30,436 కోట్లు

» అందరికీ ఆయుష్మాన్ భారత్ పథకం

» పార్లమెంటరీ కమిటీల నివేదికలు

న్యూఢిల్లీ, మార్చి 13: వివిధ నీటి ప్రాజెక్టుల కోసం కేంద్ర జలశక్తి శాఖకు కేటాయించిన నిధుల వినియోగం తీరుపై జలవనరులపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం అసంతృప్తి వ్యక్తంచేసింది. 2024-25లో సవరించిన కేటాయింపులు రూ21,640 కోట్లు కాగా.. గత డిసెంబరు చివరకు అందులో 58% మాత్రమే ఖర్చుచేయడాన్ని తప్పుబట్టింది. నిధుల విడుదల, ప్రాజెక్టుల అమలులో ఆలస్యం వల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమైందని తెలిపింది. నిధులు సక్రమంగా వినియోగించేందుకు పర్యవేక్షక-అమలు వ్యవస్థలను తక్షణం బలోపేతం చేయాలని జలశక్తి శాఖకు సూచించింది. ఈ మేరకు తన నివేదికను బుధవారం పార్లమెంటుకు సమర్పించింది. పోలవరం జాతీయ ప్రాజెక్టు సహా పలు ప్రాజెక్టులకు కేటాయింపు లు పెంచడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. 2024-25లో జలశక్తి శాఖకు 21,323.10 కోట్లు మాత్రమే కేటాయించగా.. 2025-26లో 25,276.83 కోట్లకు పెంచారని తెలిపింది. పోలవరం ప్రాజెక్టుకు, భూగర్భ జలవనరుల నిర్వహణ, రివర్ బేసిన్ అభివృద్ధికి నిధులు పెంచడం వల్లే బడ్జెట్ పెరిగినట్లు తెలిపింది. పోలవరం పనుల పురోగతిని కమిటీ పరిశీలించింది. '2024-25లో ఈ ప్రాజెక్టుకు కేంద్రం 5,512.50 కోట్లు కేటాయించగా.. తాజా బడ్జెట్‌లో రూ.5,936 కోట్లకు పెంచింది. 2026 మార్చికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. గడువు మరో ఏడాది పొడిగించేలా నిబంధనలు చేర్చారు. 41.15 మీటర్ల ఎత్తులో ప్రా జెక్టు తొలిదశ అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లకు కేంద్రం ఆమోదించింది' అని పేర్కొంది. అలాగే దేశంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థలూ సమగ్ర, భవిష్యత్ దృక్పథంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం తప్పనిసరి చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాలపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం పేర్కొంది. ఈ కమిటీకి టీడీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి చైర్మన్‌గా ఉన్నారు.

60 ఏళ్లకే ఆయుష్మాన్ వయ వందన కార్డులు

ప్రజల సామాజిక-ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా అందరికీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని వర్తింపజేయాలని పార్లమెంటరీ ప్యానెల్ సూచించింది. ముఖ్యంగా ఆయుష్మాన్ వయ వందన కార్డులను 70 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లకు మాత్రమే పరిమితం చేశారని.. ఈ వయోపరిమితిని హేతుబద్ధం చేసి 60 ఏళ్లకు స్థిరీకరించాలని సిఫారసు చేసింది. తీవ్ర అనారోగ్యాలకు చికిత్సపై జనం భారీగా ఖర్చుచేయాల్సి వస్తోందని.. ఈ నేపథ్యంలో ఆరోగ్య బీమా కవరేజీని కుటుంబానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని సిఫారసు చేసింది. ఆరోగ్యం-కుటుంబ సంక్షేమంపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం ఈ మేరకు రాజ్యసభకు నివేదిక సమర్పించింది.



హెడ్మాస్టర్ 'స్వీయ శిక్ష'!

» పిల్లలు సరిగా చదవడంలేదని ఆవేదన

» గుంజీలు తీసి, సాష్టాంగ ప్రమాణం

» పశ్చాత్తాపం కలగాలని వినూత్న ప్రయత్నం

మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆ స్కూల్లో విద్యార్థులు సక్రమంగా చదవడంలేదు! రోజురోజుకూ విద్యాప్రమాణాలు కొరవడుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే వారి భవిష్యత్తు ఏమైపోతుందోనని ఆ పాఠశాల హెచ్ఎం 'చింత'న! పోనీ ఒక దెబ్బ వేసి బుద్ధి చెబుతామంటే అస్సలు కుదరదు! అందుకే.. ఆ ప్రధానోపాధ్యాయుడు తనను తాను శిక్షించుకున్నారు. విద్యార్థుల ముందు గుంజిళ్లు తీశారు. తల్లిదండ్రులకు సాష్టాంగ నమస్కారం చేశారు. 'మేం బడిలో చదివిస్తాం. మీరూ మీ పిల్లలపై శ్రద్ధ చూపండి' అని విన్నవించుకున్నారు. ఏపీలోని విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పెంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సంఘటన ఇది. మంగళవారం తరగతుల ప్రారంభానికి ముందు, ప్రార్థన సమయంలో ప్రధానోపాధ్యాయుడు చింతా రమణ విద్యార్థుల పరిస్థితిపై తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. 'మీలో మార్పురావాలన్న సదాశయంతో నాకుగా నేనే శిక్ష విధించుకుంటాను. ఇప్పటికైనా మారండి' అంటూ గుంజీలు తీశారు. దీంతో ఒక్కసారిగా విద్యార్థులు ఖిన్నులయ్యారు. 'వద్దు సార్.. వద్దు సార్' అని పిల్లలు వారించినా ఆయన ఆగలేదు. ఆ తర్వాత విద్యార్థుల తల్లిదండ్రులకూ ఒక సందేశాన్ని వినిపించారు. 'డియర్ పేరెంట్స్.. మీ పిల్లలను విద్య కోసం కొట్టలేం, తిట్టలేం. మీరు వారిని కంట్రోల్‌లో ఉంచడం లేదు. ఫలితంగా వారికి చదువు లేదు, క్రమశిక్షణ లేదు. రైటింగ్, రీడింగ్ స్కిల్స్ కూడా కరువయ్యాయి' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మనసు కరిగి, కొందరిలోనైనా పరివర్తన రాకపోతుందా? అని భావించి వారి ముందు గుంజీలు తీసి, సాష్టాంగ ప్రమాణం చేశానని హెచ్ఎం రమణ మీడియాతో చెప్పారు. విద్యార్థుల్లో పశ్చాత్తాపంతో కూడిన పట్టుదల, కృషి పెరగాలని అలా చేయాల్సి వచ్చిందన్నారు.

అమెరికాకు.. ఇప్పుడొద్దులే!

(మొదటి పేజీ తరువాయి)

ఆ పరిస్థితి లేదు. హెచ్1బీ వీసాల కోసం గతంలో కనిపించిన పోటీ ఇప్పుడసలు లేనే లేదంటున్నాయి పలు కన్సల్టెన్సీలు. అమెరికాలో ఆర్థిక పరిస్థితి దిగజారడం, హెచ్1బీ వీసాల ఫీజు భారీగా పెంచడం, దరఖాస్తుల వడపోతను కఠినతరం చేయటం, ప్రెసిడెంట్ ట్రంప్ రోజుకో తీరుగా మాట్లాడటం వంటి పరిణామాలే దీనికి కారణమని చెబుతున్నాయి. ఏదోరకంగా అమెరికాకు వెళ్లి నష్టపోయే బదులు కొన్నాళ్లపాటు వేచి ఉండటమే ఉత్తమమని పలువురు భావిస్తున్నారని నిపుణులు పేర్కొంటున్నారు. గ్లోబల్ ట్రీ అనే కన్సల్టెన్సీ వ్యవస్థాపకుడు శ్రీకర్ ఆలపాటి మాట్లాడుతూ.. ఇతర దేశాల్లో మెరుగైన అవకాశాలు లభిస్తుండటం కూడా మన విద్యార్థులను ఆలోచింపజేస్తోందన్నారు. డ్రాప్ బాక్స్ నిబంధనల్లో తీసుకొచ్చిన మార్పులు కూడా వీసాలు రెన్యువల్ చేసుకోవాలనుకునే వారికి ఇబ్బందికరంగా మారాయని క్వాలిటీ థాట్ గ్రూపు చైర్మన్ రమణ భూపతి తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం.. గత 12 నెలల్లో గడువు ముగిసిన వీసాలను మాత్రమే పునరుద్ధరించుకునేందుకు అవకాశమిస్తారు. ఈ వ్యవధి గతంలో 48 నెలల వరకు ఉండేది. ఒక పాస్‌పోర్ట్‌తో ఒక దరఖాస్తు మాత్రమే చేయాలనే నిబంధన కూడా వీసా దరఖాస్తుల్లో తగ్గుదలకు కారణమైందని ఐడీఏ కన్సల్టెన్సీ ప్రతినిధి రూపేశ్ తెలిపారు. గతంలో కంపెనీలు కూడా తమ ఉద్యోగులను.. 2-3 ఏళ్ల అనుభవం ఉంటే చాలు హెచ్1బీ వీసా ఇచ్చి పంపేవారని, ఇప్పుడు పదేళ్ల అనుభవం ఉన్న వారి విషయంలోనూ ఆచితూచి వ్యవహరిస్తున్నారని వెల్లడించారు.

ప్రత్యామ్నాయాలున్నాయ్

ఉద్యోగం కోసం అమెరికాకు వెళ్లాలంటే హెచ్1 బీ వీసా మాత్రమే కాదు, ఇంకా పలు అవకాశాలు ఉన్నాయి. అందులో మొదటిది ఎల్ 1 వీసా. ఇది ఇంట్రా కంపెనీ ట్రాన్స్‌ఫర్ వీసా. బహుళజాతి కంపెనీలు తమ ఉద్యోగులను అమెరికాలోని తమ శాఖలకు బదిలీ చేసుకునే అవకాశం ఇది కల్పిస్తుంది. సైన్స్ ఆర్ట్స్, ఎడ్యుకేషన్, బిజినెస్ తదితర రంగాల నిపుణులకు ఓ1 వీసాలు మంజూరవుతాయి. అమెరికాలో చదివే విదేశీ విద్యార్థులకు ఎఫ్ 1 వీసాలు, బిజినెస్ విజిటర్స్‌కు బీ 1, పని ఆధారిత శిక్షణ, ఇంటర్న్‌షిప్స్ టీచింగ్ కోసం జే 1, వ్యాపారవేత్తలకు ఈ-2 వీసాను మంజూరు చేస్తారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.